# భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

అక్టోబరు 1976

సంపుటము : 53 సంచిక : 10

విడిప్రతిక వెల రూపాయిన్నర

# ప్రజలు పిలిస్తే ప్రగతి వస్తుంది

ఇన్నాళ్ళుగా సోషలిజం అనేది ఆకాశమంత ఎత్తున అంతంత మాత్రాన అందని ఆశయంగా మాత్రమే మనకు దూరంగా కనిపించి మురిపిస్తుండేది.

ఇప్పుడు దాన్ని భూమ్మీదకు తెచ్చుకున్నాం. ఇరవై సూత్రాల పథకంలోని అంశాలు అమలు జరిగిన కొద్దీ మనం సోషలిజానికి చాలా దగ్గరగా వెళ్ళగలుగుతాం.

దేశంలో దారిద్ర్యం, అవిద్య, అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, స్వార్థం, స్వాలాభాపేక్ష, అవినీతి, అక్రమ ద్రవ్యార్జన మొదలైనవి సమూలంగా నిర్మూలించ బడాలంటే ఇరవై సూత్రాల పథకం గట్టిగా అమలు పరచుకోవడం ఒక్కటే మార్గం.

దేశంలో ప్రతీపశక్తుల విశృంఖల విహారాన్ని అరికట్టడం ఎంత అవసరమో, పురోగమనానికి ఒక నిర్మాణ కార్యక్రమాన్ని అందించడం కూడా అంతే ముఖ్యం. అదే 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం.

ఆనాడు గాంధీజీ దేశంలోని పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ కార్యక్రమం రూపొందించారు. ఈనాటి మన నిర్మాణ కార్యక్రమం 20 సూత్రాల పథకం.

ఈ పథకం శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతిపాదించినది కాదు భారత ప్రజలందరూ కలిసి ప్రతిపాదించినది.

జాతీయ సమైక్యత, ఆర్థిక పురోగమనం, సోషలిజం మన ఆశయాలు. వీటికై నిరంతరం పాటుపడదాం.

సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

DIPR. 11/1976-77

# విషయానుక్రమణిక

## అక్టోబరు 1976

# గిరులు

## శ్రీ ఆకొండి వెంకటరత్నం

ఎత్తుగా
చైతన్య పవనాలను పీల్చుతూ
చీకటి తొడర్ని చీల్చుతూ
మున్నుగా
గిరులు—
ఆకాశవృక్షం
ఆ కొసని పూచిన విరులు!

ఆ గిరులు
ఏమీ లేనట్టుగా,
శూన్యాన్ని మేస్తున్నట్టుగా ఉంటాయ్;
ఎగరడానికి తయారుగావున్న
తెల్లటి పావురాల్ని మరిపిస్తాయి;
ఒక్కొక్క సారి
పరిగెత్తే పొదరసాన్ని గుర్తుతెస్తాయి.

దగ్గరగా వెళ్ళి చూడాలి
ఆ గిరులు—
కెంపుల సరులు—
అవని సిరులు!

ఖాళీగా జాలికళ్ళతో
చూస్తున్నట్టు కనిపించే
గిరుల చుట్టూ
వింత ఆలోచనా సంపద
చూద్దాం పద!...

ఓహో!
ఎన్ని పండ్ల చెట్లు
కమ్మటి సంగీతం వినిపించే
పక్షితతుల జీవితాల తియ్యటి మెట్లు

ఏ తీరాలనుంచో ప్రేమతో
ఏతెంచిన మబ్బుకన్నెల్ని
ఆశ్లేషించి, ముద్దులతో మురిపించి
కరిగించి, సెలయేళ్ళుగా కదలించి
చిర్నవ్వు తొలికించే
ఈ గిరులు
ఎన్ని అందాల పురులు!...

ఇక్కడ ఉన్న రాళ్ళు
అబద్ధాల అద్దాలను
పగులగొట్టే పరికరాలు!
నెమళ్ళకు నాట్యం చెప్పగలిగిన
జవరాళ్ళు దాగున్న రాళ్ళు

ఈ గిరుల కౌగిలిలో
ఆనంద పరిమళాలు వీచే
పువ్వులు
హృదయంలో సితారులు పలికిస్తాయి
మనసులో మతాబులు వెలిగిస్తాయి

మళ్ళృత్నాయనా!
మూలికలుగా ఉపయోగించుకుంటే సరి—
ఈ గిరులు
సర్వులకూ వరులు!

# భక్తకవి తులసీదాసు కవితా జీవిత రేఖలు

ప్రొ. జి. సుందరరెడ్డి

హిందీ సాహిత్య చరిత్రలో తులసీదాసు జననం ఒక అపూర్వ విశేషం. మహాకవి తులసీదాసు కేవలమొక హిందీ సాహిత్యానికే కాక భారతీయ సాహిత్యానికీ అనుపమరత్నము. పదహారవ శతాబ్ది నాటికి భారతావనిలో మొగలాయి సామ్రాజ్యం పూర్తిగా సుస్థిర పడింది. హిందువుల హృదయాలలో నైరాశ్యభావమంకురించింది. ఆశాజ్యోతులంతర్ధానమయ్యాయి. వారి సమక్షంలోనే వారి దేవాలయాలు పడగొట్టబడి దైవ విగ్రహములు ధ్వంసమొనరింపబడేవి. వారి ఆదరాభిమాన పాత్రులగు పుణ్యపురుషులు అగౌరవింపబడేవారు. హిందూ సంఘంలోని అసమానత, జాతిభేదము, అస్పృశ్యత మొదలగు కారణాలచే భారీయెత్తున ఇస్లామ్ మతాన్ని స్వీకరించసాగారు. హఠయోగులు, తాంత్రికులు, కపట సన్యాసులు మొదలగువారి కుత్సభావాలకు గురియై ఆడంబరాల కాటపట్టై భారతీయ సమాజం తారుమారగుచుండెను. భారతీయులలో నిరాశ, నిస్పృహలు పూర్తిగా వ్యాపించాయి. అట్టి సంధి సమయలలో తులసీదాసు జన్మించాడు. తులసీదాసు జన్మతిథిని గురించి కొన్ని భేదాభిప్రాయాలున్నాయి. కాని యింతవరకు లభించిన సామగ్రి ఆధారంగా తులసీదాసు రాజాపురం అనే గ్రామంలో విక్రమాదిత్య శకం 1554 అనగా క్రీస్తుశకం 1497వ సంవత్సరంలో జన్మించినట్లు విదితమవుతుంది. వీరి తండ్రి ఆత్మారాముడు, తల్లి హులసీ. జన్మించినపుడు తులసీదాసు ఐదు సంవత్సరాల బాలకునివలె కన్పించాడట. తల్లిదండ్రులాతని విలక్షణస్వరూపానికి భయపడి తమ యింటిదాసీ మునియాకు పెంచుకొనుట కిచ్చివేసిరి. ఇదియేగాక మూలా నక్షత్రమందు జన్మించుటచే అరిష్టసూచకంగా భావించి త్యజించబడెనన్న వదంతి కూడ కలదు. ఏది యెట్లున్నను తలిదండ్రులచే అతడు త్యజింపబడెనన్న విషయంమాత్రం సత్యం. 'జనక జననీతజ్యో జనమి' — జన్మింపగనే జననీ జనకులు త్యజించిరి — అని తులసీదాసే ఒకచోట వ్రాసియున్నాడు.

తరువాత కొద్దికాలానికే అతనిని పెంచుతున్న మునియాదాసి కూడా చనిపోయింది. అపుడు బాబా నరహరిదాసు అనే సాధువు ఆ యనాథ బాలుడైన తులసీని పెంచి విద్యనేర్పెను. తరువాత శేష సనాతనుడనే పండిత శ్రేష్ఠునివద్ద తులసీదాసు వేద, వేదాంగముల నభ్యసించాడు. తులసీ అనాథ బాలుడైనను అతని రూప, గుణ, శీల, స్వభావ, విద్వత్తులకు ముగ్ధుడై ఒక కులీన బ్రాహ్మణుడాతనికి తన కన్యనిచ్చి వివాహం చేశాడు. తులసీదాసు మహారసికుడు. తన భార్యయైన రత్నావలియందత్యంత అనురక్తుడుగా వుండేవాడు. అయితే ఒకనాడు తానింటివద్ద లేని సమయంలో అతనిభార్య రత్నావళి పుట్టింటికి వెళ్లింది. ఈవార్త తెలియగానే భార్య ఎడబాటును సహించలేక తులసీదాసు ఆమెను చేరుకొనుటకు బయలుదేరెను. నిబిడాంధకారమయమైన రాత్రి. దానికితోడు కుంభవృష్టి పడుతూవుంది. అటువంటి భయంకరమైన రాత్రి సమయంలో అతడు తన భార్య వద్దకు చేరాడు. ఆ సమయంలో అతని భార్య రత్నావళి గావించిన హెచ్చరిక అతని జీవితాన్నే మార్చివేసింది.

> 'అస్థిచర్మమయ దేహ మమ తామేజైసీ ప్రీతి
> తైసీ జో శ్రీరామమహ హోత నతౌ భవభీతి'

నాథా! అస్థి చర్మమయమైన నాదేహమందున్నంత ప్రేమ ఆ శ్రీరామునియందున్నచో భవభీతియే యుండదుగదా!

రత్నావళి ఈ గంభీరోక్తి తులసీదాసుకు తారకమంత్రమయ్యింది. అతని యనురాగ మంతయు తీవ్రగతిని శ్రీరామునివైపునకు మరల సాగింది. అప్పటినుంచీ తులసీదాసు విరాగియై శ్రీరామచంద్రుని భక్తిలో నిమగ్నుడయ్యెను. అయోధ్య, కాశీలు తులసీదాసుకు నివాసస్థానా లయ్యాయి. జీవిత చరమ దశయందు కాశీయే నివాసస్థాన మయ్యింది. లోకకళ్యాణ కరమైన 'రామచరితమానస్' మహా కావ్యాన్ని వ్రాయడం తులసీదాసు అయోధ్యలోనే ప్రారంభించాడు. తరువాత కాశీలోవుంటూ రెండున్నర సంవత్సరాలలో రామచరితమానస్ వ్రాయడం పూర్తిచేశాడు.

తులసీదాసు సంస్కృతంలో మహాపండితుడై వుండికూడ రామాయణ గాథను ప్రజల కందజేయుటకు అయోధ్యప్రాంత ప్రజల

భాషయైన అవధీలో వ్రాశాడు. ఆ రోజుల్లో సంస్కృతంలో వ్రాస్తేనే కవి, ప్రజల భాషలో వ్రాస్తే పామరుడు అనే దృక్పథంతో చూచేవారు పండితులు. అటువంటి సమయంలో ప్రగతిశీలిగా, ప్రజా కవిగా, ప్రజల భాషలో రామాయణ కావ్యం వ్రాశాడు తులసీదాసు. దేశీయ ఛందస్సులైన దోహా, చౌపాయి, ఛప్పయి, కవిత్త, సవైయా, గీత మొదలగు ఛందస్సులలో వ్రాయడంచేతను సరళమైన సంస్కృత, తత్సమశబ్ద బహుళమైన అవధీభాషలో వ్రాయడంచేతను తులసీ రామాయణం లోకప్రసిద్ధి గాంచింది. అయితే కేవలం ప్రజల భాషలో వ్రాయడంచేతనే తులసీరామాయణం ప్రసిద్ధి గాంచింది అనడం ప్రామాణికం కాదు. ప్రజల భాషలో వ్రాయడమే ప్రమాణికమైతే మన తెలుగుభాషలో ఎందరు కవులు ఎన్ని రామాయణాలు వ్రాయ లేదు వాటిలో ఏ ఒక్క గ్రంథానికైనా 'రామచరిత మానస్' కున్నంత ప్రజాదరణ వుందా? లేదు. పోనీ మరే యితర ప్రాంతీయ భాషలోనైనా వ్రాయబడ్డ రామాయణానికుందా? లేదు. ప్రాంతీయ భాషలలో ఎందరో కవులచే ఎన్నో రామాయణాలు వ్రాయబడ్డా తులసీ రామాయణాని కున్నంత ప్రజాదరణ దేనికిని లభించలేదు. ప్రాంతీయ భాషలలో వ్రాయబడ్డ రామాయణాలలో తులసీరామాయణం తరు వాత తమిళభాషలో వ్రాయబడ్డ కంబర్ రామాయణం కొంతవరకు లోక ప్రసిద్ధి గాంచింది. సంస్కృతంలో ఎందరో మహాకవులు ఎన్నో మహాకావ్యాలు వ్రాశారు కాని మహాకవి కాళిదాసు కావ్యాల కున్నంత ప్రజాదరణ మరే యితర కావ్యాలకు లేదు. పై విషయాల్నిబట్టి చూస్తే ఏదైనా గ్రంథ ప్రామాణానికి గాని, లోక ప్రియతకు గాని, ప్రజాదరణకు గాని భాష ఒక్కటే కొలబద్ద కాదు. కవి ప్రతిభయే గ్రంథ ప్రమాణానికీ, ప్రజాదరణకు మానదండం. తులసీదాసు మహా ప్రతిభావంతుడు గనుకనే అతని రామచరిత మానస్ ప్రజలకు కంఠ హార మయ్యింది.

కథావస్తువు కొత్తదా అంటే కాదు. వాల్మీకి రామాయణం, అధ్యాత్మరామాయణం, రఘువంశం, ఉత్తర రామచరితమ్, ప్రసన్న రాఘవమ్, హనుమన్నాటకమ్ మొదలైన గ్రంథాలన్నిటిలోను రామ కథ వర్ణించబడి ఉంది. సంస్కృతంలో మహాపండితుడైన తులసీ దాసు వివిధ పురాణ నిగమాగమసార సంగ్రహ మొనరించి తన రామ చరిత మానస్ వ్రాశాడు వాల్మీకి రామాయణం, అధ్యాత్మరామా యణంలోని కథను రచనకు ఆధారంగా తీసుకొన్నా, కొన్ని మార్పులు, చేర్పులు చేశాడు అయితే ఆ మార్పులు ముఖ్యకథకు సంబంధించిన ప్రాసంగిక కథలకు మాత్రమే వర్తిస్తాయి. ఆదికవి వాల్మీకి తన రామాయణంలో శ్రీరాముని ఒక ఆదర్శ పురుషుడుగాను, మహావీరుడు గాను, ధర్మజ్ఞునిగాను, సత్యవాక్పరిపాలకుని గాను, దృఢ వ్రతునిగాను, మహాతేజస్విగాను అభివర్ణించాడు. కాని భక్తకవి తులసీ శ్రీరాముని ఒక అవతారపురుషుడుగాను, ఆరాధ్య దైవంగాను వర్ణించి అనాడు నిరాశ, నిస్పృహలతో నిండియున్న హిందూ జాతికి భక్తిమార్గాన్ని ప్రబోధించాడు.

తులసీదాసుకు పూర్వం హిందీకావ్యక్షేత్రం వీరగాథలతోను, సాధు సన్యాసుల ఉపదేశాలతోను పరిమితమై వుండేది. భాషకు ఒక సమగ్రమైన స్వరూపంగాని, సౌష్ఠవంగాని ఏర్పడి ఉండలేదు. తులసీ దాసు రచనలతోనే హిందీ కావ్యభాషకు ఒక సమగ్ర స్వరూపం, సౌష్ఠవం లభించాయి. హిందీ సాహిత్యంలో వీరగాథాకాలంనాటి కవులు వీరుల గాథలకు, కృష్ణభక్తి కవులు ప్రేమకు, తరువాత కవులు దాంపత్య ప్రణయానికీ ప్రాధాన్యత నిచ్చారు. దేశ పరిస్థితులను గాని, ప్రజల జీవితాన్నిగాని ఏ కవి దృష్టిలో ఉంచుకొన్నట్లు లేదు. దేశం బాగుపడాలంటే సామాన్య ప్రజల నైతిక స్థితి బాగుపడడం అత్యవ సరమని ఏ కవిగాని, రచయితగాని ఊహించలేదు. అట్టి తరుణంలో భారతీయ ప్రజలను దృష్టిలో ఉంచుకొని, వారి నైతికస్థాయిని పెంపొందింప జేయుటకు వారి కర్థమయ్యే సరళమైన భాషలో మొట్టమొదట కావ్యం వ్రాసింది తులసిదాసే. కనుక తులసీని హిందీ సాహిత్య జగత్తులో ప్రథమ ప్రజాకవి అంటే అతిశయోక్తి కాదు. రామచరిత మానస్‌నే గాక దోహావళి, గీతావళి, వినయపత్రిక, కవిత్త రామాయణం, రామలలానహఛూ, పార్వతీ మంగళ్, జానకి మంగళ్, బరవై రామాయణ్, వైరాగ్య సందీపని, కృష్ణగీతావళి, రామాజ్ఞా ప్రశ్నావళి మొదలగు ఇతర గ్రంథాలను గూడ తులసీదాసు రచించాడు. వీటిలో కొన్నింటిని ఆనాటి కావ్యభాష అయిన వ్రజభాషలో తులసీ దాసు వ్రాశాడు. వ్రజభాష మధురా బృందావనం పరిసర ప్రాంతా లలో మాట్లాడబడే భాష. ఇరువదవ శతాబ్దం ప్రారంభం వరకు హిందీ కావ్యాలు తరచు వ్రజ భాషలోనే వ్రాయబడేవి. కృష్ణభక్తి సాహిత్యమంతా వ్రజ భాషలోనే లభిస్తుంది. సంస్కృతంలో మహా పండితుడైన తులసీదాసు వ్రజ, అవధీ భాషలలో కావ్యాలు వ్రాయడం వారి ప్రతిభకు ప్రగతిశీలతకు ప్రబల నిదర్శనం.

తులసీ రామాయణం కేవలమొక కావ్యమే కాదు. మతగ్రంథం కూడ తులసీకి పూర్వం నిర్గుణోపాసకులైన హఠయోగులు, సంత కవులచే మన లౌకిక విధులు, సాంఘిక, పారివారిక జీవితవిధానాలు నిశితంగా విమర్శించబడ్డాయి.వారు 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అనెడి శంకరాచార్యులవారి వాక్యాన్ని వల్లిస్తూ సాంఘిక, సాంసారిక జీవితాన్ని నిందిస్తూ, స్త్రీని మాయాస్వరూపిణిగా వర్ణిస్తూ ప్రజలను పార లౌకిక కల్పనలవైపుకు మళ్ళించేవారు. అందువల్ల ప్రజలు జీవిత విలువలను గుర్తించక, పారలౌకిక స్వప్నజగత్తులో విహరిస్తూ కాలం గడిపేవారు. మానవ జీవితంలో సుఖము, శాంతి కావాలంటే భౌతిక

అభ్యున్నతి అత్యావసరమని వారికి తోచలేదు. ఈ ప్రపంచం క్షణ భంగురము, నశ్వరము అనెడి గోరఖ్‌నాథ్, కబీర్, దాదూ, రైదాస్ మొదలగు నిర్గుణోపాసక కవుల వల్లను, హఠ యోగులవల్లను సంఘము విశృంఖల మగునని, దాని ప్రగతి కుంటుపడునని మొట్ట మొదట గుర్తించిన మహాకవి తులసీదాసే. ఆనాడు భారతీయ సమాజంలో వ్యాపించియున్న శైవ, వైష్ణవమత విద్వేషాలను తగ్గించడం, అసంఖ్యాకులైన హిందువులను ఇస్లామ్ మతావలంబులు కాకుండ పరిరక్షించడం, సాంసారిక, సాంఘిక కర్తవ్యాలను ప్రోత్సహించడం, భగవద్భక్తిని ప్రేరేపించడం, మత సామరస్యాన్ని, సమన్వయతనూ పెంపొందింపజేయడం మొదలైనవి తులసీదాసు ప్రధాన లక్ష్యాలు. అందువల్లనే అతడు ప్రజల శ్రేయస్సు కొరకు, లోకకళ్యాణం కొరకు రామచరితమానస్ వ్రాశాడు. భగవద్గీతలో ప్రబోధింపబడ్డ జ్ఞానయోగము, కర్మయోగముల ప్రాధాన్యతను గుర్తించి కూడ తులసీదాసు తన రామాయణంద్వారా సామాన్య ప్రజలకు భక్తిమార్గమే సులభమైనదని ప్రబోధించాడు.

శైవ, వైష్ణవ మత సామరస్యం కొరకు తులసీదాసు తన రామాయణంలో అనేకచోట్ల శివుని మహిమను అభివర్ణించాడు. 'నామరూపదుయి ఈస ఉపాధి' అనగా నామరూపములు రెండు ఈశ్వరుని ప్రతిబింబాలే, అంటూ సగుణోపాసనను ప్రతిపాదించాడు తులసీదాసు. రామచరిత మానస్ బాలకాండలో విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ 'సియా రామమయసబ్ జగజాని, కరౌ ప్రనామ జోరిజుగపాని, అనగా ఈ ప్రపంచమంతా సీతారామమయమని భావించి చేతులు జోడించి నమస్కరించమంటాడు తులసి.

వాల్మీకి రామాయణం ఆనాటి ఆర్య, ఆర్యేతరుల సంస్కృతికీ, సంప్రదాయాలకు ప్రతిబింబమైతే తులసీ రామాయణం మధ్యయుగపు హైందవ సంస్కృతికీ, సంప్రదాయాలకు అటపట్టు. అంతేకాదు, ఒక మహాకావ్యాని కుండవలసిన సమస్త లక్షణాలు రామచరిత మానస్‌లో ఇమిడి ఉన్నాయి. పాత్ర చిత్రణలోను, నవరస పోషణలోను మానవ స్వభావాన్ని అత్యంత సహజంగాను, మనోవైజ్ఞానికంగాను చిత్రీకరించడంలో తులసీదాసు అద్భుత ప్రతిభను ప్రదర్శించాడు. ప్రబంధ పటుత్వము, రచనా చాతురి, ఇతివృత్తము, వస్తు ప్రతిపాదన, భావవ్యక్తీకరణ, హృదయాలను స్పృశించే సంవాదాలు, ప్రసంగానుకూలమైన భావం, భావానికితగ్గ భాష, సహృదయత మొదలగు ఉత్కృష్ట కావ్యగుణ సమన్వయమె రామచరితమానస్. వాల్మీకి రామాయణంలో సుందరకాండ అత్యంత రసవత్తరమైనదయితే, తులసీరామాయణంలో అయోధ్యాకాండ మానవ మాత్రుని హృదయాన్ని కదిలించి వేస్తుంది. కథలోని ముఖ్యఘట్టాలను ఎంతో చక్కగాను, సుమనోజ్ఞంగాను వర్ణించి మానవహృదయాలను స్పందింప

జేశాడు తులసీ. అటువంటి వాటిలో శ్రీరాముని వనగమనము, దశరథుని మరణము, వనమార్గమందు సీతారాములపట్ల గ్రామీణ స్త్రీల సానుభూతి, శ్రీరామునితో గుహుని సంవాదము, శబరి ఆతిథ్యము, భరతుని ఆత్మగ్లాని, సీతాపహరణము, రామ రావణుల యుద్ధము, శక్తి బాణముచే లక్ష్మణుడు మూర్ఛపోవుట మొదలగునవి ముఖ్యమైనవి.

భక్తకవి అయినా తులసీదాసు శృంగారాన్ని ఎంతో చక్కగాను, శిష్టంగాను పోషించాడు. మహాకవి కాళిదాసుని శృంగార కవిత్వము వలె తులసీదాసుని శృంగారకవిత నిస్సంకోచంగా నలువురియెదుట గానం చేయవచ్చును. కృష్ణోపాసక కవులు శ్రీకృష్ణుని లీలల వర్ణనలో లీనమై ప్రపంచ మర్యాదను మరచారు. కాని తులసీ తన శిష్ట శృంగార వర్ణనద్వారా కృష్ణోపాసకుల ఈ లోపాన్ని సరిదిద్దాడు. ప్రజల శ్రేయస్సు, లోకకళ్యాణము తులసీదాసుని భక్తికి ముఖ్యమైన ఆదర్శాలు.

కొందరు కవులు శిల్పానికి అత్యధిక ప్రాముఖ్యతనిస్తే, కొందరు భావ రసాదులకు ప్రాధాన్యత నిస్తారు. కాని తులసీ కవిత్వంలో ఈ రెండూ సమానస్థాయిలోవుండి కావ్యానికెంతో వన్నెతెచ్చాయి. అతని కవిత అతి సహజంగాను, సరళంగాను, సరసంగాను, శ్రావ్యంగాను వుండడంవల్ల తులసీ రామాయణంలోని కొన్ని పద్యాల నయినా కంఠస్థం చేయని హిందీ వారుండరు. రామచరితమానస్ నిజంగా ఉత్తర భారతీయులకు కంఠాభరణం అంటె అతిశయోక్తికాదు. తులసి రామాయణం చదవాలనే అభిలాషతో ఎంతోమంది హిందీ ఏతర ప్రాంతాల వారు హిందీ నేర్చుకొన్నారు. హిందీ సాహిత్యంలో ఆ గ్రంథానికిగల గౌరవభావం మరే గ్రంథానికిలేదు. అందుకే సర్ జార్జి గ్రియర్సన్ మహోదయుడు రామ చరిత మానస్‌కుగల ప్రజాదరణను పేర్కొంటూ 'క్రైస్తవులలో బైబిల్ కంటె కూడా హిందువులలో రామచరిత మానస్ అధిక ప్రచారంలోవుంది. దరిద్రుల కుటీరాలు మొదలు రాజప్రాసాదాలవరకు గూడ ఆ గ్రంథమెంతో లోకప్రియ మయింది' అని ప్రశంసించారు. కేవలం మనదేశంలో నే కాదు విదేశాలలోకూడ ఈ గ్రంథాని కెంతో గౌరవభావంవుంది.

తులసీదాసును కొంతమంది సంప్రదాయవాది అంటారు. శూద్రులను, స్త్రీలను తన కావ్యంలో అచ్చటచ్చట హీనంగా వర్ణించా డంటారు. అటువంటివారు తమ వాదనకు తులసీదాసుచే వ్రాయబడ్డ కవితనే ఆధారంగా తీసుకొంటారు. తులసీదాసు రామచరితమానస్‌లో ఒక సందర్భంలో 'ఢోల్, గంవార్, శూద్ర, పశు, నారీ, యే సబ్ తాడనకే అధికారీ' అని వ్రాసియున్నాడు. అనగా డోలు, మూర్ఖుడు, శూద్రుడు, పశువు, స్త్రీ దండనార్హులు. కేవలం ఈ పంక్తిని ఆధారంగా తీసుకొని తులసిని సంప్రదాయవాది అనడం అంత సమంజసంగా లేదు. అసలు తులసీ సంప్రదాయవాది అయితే తన కావ్యాన్ని సంస్కృతంలో వ్రాసి ఉండేవాడుకాదు. శూద్రులను హీనంగా వర్ణించాడన్నది కూడాయదార్ధంకాదు. అతడు నిజంగా శూద్రులను హీనంగా చూస్తే శ్రీరాముడు శబరి ఆతిథ్యం స్వీకరించడం, గుహునిపట్ల అత్యంత ఆదరాన్ని వ్యక్త పరచడం జరిగి వుండేవి కాదు. తులసీ సంప్రదాయవాది, బ్రాహ్మణవాది అయి బ్రాహ్మణులను సమర్థించిందీ లేదు. మహా బలపరాక్రమశాలియై ఇరువదియొక్కసార్లు క్షత్రియవంశాలను నిర్మూలన మొనరించిన బ్రాహ్మణుడైన పరశురాముని బ్రాహ్మణేతరులైన రామలక్ష్మణులచే పరాభవింపచేశాడు. అంతేకాదు బ్రాహ్మణోత్తముడు, వేదపండితుడు, మహా శివభక్తుడైన రావణుని క్షత్రియుడైన శ్రీరామునిచే సంహరింపజేశాడు. పై విషయాలవల్ల తులసీ సంప్రదాయవాది కాదని స్పష్టమవుతుంది. ఇక స్త్రీల విషయంలో—తులసీదాసు శ్రీరామునికి అనన్య భక్తుడగుటవల్లను, మందర, కైకేయిల కారణంగా శ్రీరాముని రాజ్యాభిషేకము చెడిపోవుటచేతను కైకేయిని కొంత దూషించినమాట వాస్తవమే. అయితే కౌసల్య, సీత మొదలగు స్త్రీ పాత్రలను తులసీ ఎంతో ఆదర్శంగా చిత్రించాడు. శ్రీరాముడు సీతను అగ్నిపరీక్ష చేయుట స్త్రీ జాతికి కటువుగానే కనబడుతుంది. అయితే బంగారాన్ని స్వచ్ఛమైనదిగా రూపొందించుటకు పుటంవేసినట్లు సీతను శీలవతిగా ఆచంద్రతారార్కం నిలిచిపోవునట్లు చేయుటకే కవి శ్రీరామునిచే సీతను అగ్నిపరీక్ష చేయించాడేమో ననిపిస్తుంది. పై విషయాలనుబట్టి చూస్తే తులసీదాసు సంప్రదాయవాది కాడని ఋజువవుతుంది. ఎవరైనా అతనికి సంప్రదాయవాది అనే కళంకాన్ని ఆపాదించినా కాళిదాసుగా రన్నట్లు, 'ఏకోహి దోషో గుణసన్నిపాతే, నిమజ్జతీన్దోః కిరణేష్వివాఙ్కః'' అనగా అనేక మంచిగుణాల సముదాయంలో చంద్రునిలోని కళంకమువలె ఈ దోషమొక లెక్కలోనిది కాదు.

తులసీదాసు భక్తిలో పరాకాష్ఠత వరకు పోయి కూడా లౌకిక కర్తవ్యాన్ని విస్మరించలేదు. భక్తి, జ్ఞాన, కర్మ యోగముల సుందర సమన్వయమే 'రామచరితమానస్.' నిజంగా తులసీదాసుని రామభక్తి గానంతో హిందీకావ్య జగత్తులో ఒక ప్రౌఢయుగం ప్రారంభమైంది. అంతటి మహత్తర కావ్యం గనుకనే అది అనేక భారతీయ భాషల్లోను, విదేశీయ భాషల్లోను అనువదింపబడి బహు జనాదరణ పొందబడుతూ వుంది. కనుకనే వివిధ ప్రాంతాలలోను, దేశాలలోను వాల్మీకి రామాయణం తరువాత తులసీ రామాయణమే అధిక ప్రచారంలో వుంది అంటే అతిశయోక్తికాదు.

# అడ్రసు ఇస్తున్నాను మాఇంటికిరండి!

## శ్రీ అనుముల శ్రీహరి

నా దేశం మేధాకాశం
నా రాష్ట్రం జీవిత దహనం]
నా జిల్లా జీవన మరీచి
నా తాలూక చీకటి బూచి
నా గ్రామం గోడులనాడు కూలిన కోట
నా బజారు ఆశల పాతర్లపాడుపేట
నా ఇల్లు కన్నీళ్ళ అంతస్తుల అద్దాలమేడ
నేను ఆఖరు అంతస్తుమీద
అనుభూతుల ఏకాంతానంద చంద్రశాలలో
అనుక్షణం చైతన్యమై మేల్కొని స్థిరంగా ఉంటాను.
దానికి బాట నా అనుభవాల అడుగుల జాడ
ఎంతోదూరం! నిగ్గిరావాలి!
ఎన్నోమెట్లు! ఎక్కి నెగ్గిరావాలి!
సృష్టిహృదయం నుండి
జ్ఞానేంద్రియాల గవాక్షాలనుండి
అనుభవాలుగా నా అంతరంగం లోనికి
కేంద్రీకరించుకొని చొచ్చుకొని వస్తున్న విశ్వజ్ఞాన రశ్మిరేఖలు;
నా మనస్సునుండి
బయటికి చిమ్ముతూ విస్తరిస్తూ
సృష్ట్యంతరాత్మలోనికి ప్రవేశిస్తున్న
అక్షర విభిన్న రస కాంతి కిరణాలు
ఆత్మ ప్రవృత్తుల ఆవేశపు మూడ్‌లో
పాడుకొంటున్న ఏకాంత గీతికల ఊలపాటలు
అభిముఖంగా పోటీపడి
ఒకదానిలో మరొకటి చొరబడి
చొచ్చుకొని వస్తూపోతూ పోతూ వస్తూ
ట్రాన్స్‌పరెంట్ స్ఫటికం లాంటి ప్రిజం లాంటి నాలో
ఏదో లేని మహత్తును లోకానికి ప్రదర్శిస్తూ
నన్ను రంగుల వెలుగు వాక సుడిగుండంలో ముంచి
హోళీ ఆడుతుంటే
అక్కడ—ఋతు చక్రంమీద
సూర్యుని పగటి ప్రయోగశాలలో
ప్రకృతి సహజ ప్రయోగాలు చూస్తూ
ప్రయోగాల విచిత్ర సుందర చర్యలు—ఫలితాలు చూస్తూ
అమావాస్య అర్ధరాత్రినుండి
నిండుపున్నమి నిశిమధ్యం వరకు
శశికళల జీవితాశ్రమాల
నిశీథి సామ్రాజ్యాల
ఉదయాస్తమయాలు చూస్తూ
పగటి వెలుగులో దాగిన సృష్టిలోపాల చుక్కల సంఖ్యలు
లెక్కిస్తూ
అలసిపోయే నన్ను చూచి
నామీద జాలిగొని
రాత్రుల నల్లని ఆకాశపు పుటంమీద
తమంతట తామే వెదజల్లుకొని
మిణుకు మిణుకుమని వెలుగు నవ్వులు నవ్వే
భయంలేని నగ్న సత్యాల మెత్తని హృదయాల
సృష్టిలోపాల నాజూకు చుక్కల బంగారు ముఖాలు
చూస్తూ—చదువుకొంటూ
సేదతీర్చుకొని ఉత్తేజంపొంది హృదయం ముందుకుసాగి
ఈ సృష్టిలోపాలవల్ల పరిపూర్ణం కాదని
ఏం బాగు లేదని
ఇది న్యాయం కాదని
మరోసృష్టికోసం మదనపడుతూ

ఏవో ప్రయోగాలు చేస్తూ
ఏదో అన్వేషిస్తూ
ఎంతో నిమగ్నుణ్ణై ఉంటాను—
అక్కడ నన్ను కలుసుకోండి
అవాంతరం ఔతుందనుకోకండి
అవశ్యం నన్ను కలుసుకోండి
మరచిపోకండి
నా ఇంటికిరండి
నేను ఆనందిస్తాను
మరినేను వెళ్ళొస్తాను !
(నా అముద్రిత దీర్ఘ కవిత 'అనుభూతికి అక్షర చిత్రం' లోని అంతిమభాగంనుండి)

# సుప్త చైతన్యం!

## శ్రీ సుభాష్ చంద్ర

అబ్బ
శబ్దం, యుద్ధమంత శబ్దం—
టెలిగ్రాఫ్ సంకేతాల్లా
చిక్కగా అల్లుకున్న చిక్కుడు పాదులా
నడక నేర్వని పాపాయి ఆరాటంలా
ఒక దాని కొకటి పెనవేసుకొని
అక్కడే ఉంటున్నాయి
అడుగు ముందుకేయవు.
అంతలోనే
నిశ్శబ్దం, శవమంత నిశ్శబ్దం—
గోళాలు గుండెలో గుద్దుకుంటున్నా
చెవులకు వినబడనంత నిశ్శబ్దం—
కణతల మీద కాల్చి వాతలేస్తున్నట్లు
కనుగుడ్లమీద ముళ్ళపాదాలు మోపుతున్నట్లు
వెన్నుమీద చిల్లివేసి
ఎవరో ఆనందంతో మురళి వాయిస్తున్నట్లు
కాలి గోళ్ళకింద
గుండుసూది గుడారం వేస్తున్నట్లు బాధ—

అబ్బ
తల్చుకుంటుంటేనే మునిపళ్ళకు రాయితగిలినట్లు
జివ్వు మంటూన్నాయి –
నోటినిండా ఉప్పగా నెత్తుటేరు.
కళ్ళముందు
శబ్ద నిశ్శబ్దాలు వివస్త్రంగా
అస్త్రాలు సంధిస్తున్నాయి.
సంధ్యలో సూర్యుణ్ని
ఎవరో చప్పరించి వదిలేసారు.
వేళ్ళు నోరు కోరుకున్న
కొస నిప్పు గుప్పు గుప్పున పొగలు చిమ్ముతుంది
మసాలా మిర్చి ముందునుండి
సినిమా స్లైడ్‌లా కదిలిపోతుంది.
ఊహ రూపుదిద్దుకొనే లోపలే
అద్దం మాయమవుతుంది.
నిశ్శబ్దం చాపకింద నీరులా ఆవరిస్తుంది
శబ్దం నిశ్శబ్దంగా ఆవులిస్తుంది.

# గణిత చరిత్రలో ఒక విషాద గాథ

డా. విశ్వనాథ అరుణాచలం

క్రీస్తుశకము 1832 వ సంవత్సరం, మేనెల 30 వ తేదీ, ఉదయము. పారిస్ నగరంవైపు పయనిస్తూఉన్న ఫ్రాన్సుదేశపు రైతు ఒకడు దారి కడ్డంగాపడిఉన్న ఒక యువకుని మృతశరీరాన్నిచూచి హఠాత్తుగా ఆగినాడు; దిగ్భ్రమతో, భయంతో నలుదిక్కులు చూచినాడు. కడుపులో ప్రేల్చబడిన తుపాకిగుండువల్ల మరణించినట్లున్నాడు ఆయువకుడు. దిక్కులేక, గడ్డకట్టిన రక్తంలో మునిగిపోయి భీభత్సంగా కనపడే ఆ మృత యువకుడు ఫ్రాన్సు విప్లవవీరుడు ఎవరిస్ట్ గాల్వా (Evariste Galois). బక్కపలచనగా, దయనీయంగా, లేబ్రాయంలోఉండే ఆశరీరం యావత్ప్రపంచాన్ని ఆశ్చర్య చకితంచేసే ఒక మహత్తర మేధస్సుకు నిలయమైనదని ఇప్పుడు అందరూ ఒప్పుకొంటారు.

బలవంతంగా తననెత్తిపైన రుద్దబడిన సవాలును అంగీకరించి పతిష్ఠ నిలబెట్టుకోడానికి ఇరువురి హంతకులతో కుస్తీ (Duel) కి దిగి మృత్యుదేవతకు బలియైనాడు ఎవరిస్ట్‌గాల్వా. ఈ డూయల్‌కు ఇదమిత్థమైన కారణం ఫలానా అని ఇప్పటికీ ఎవరికీ తెలియలేదు. కాని దీనికి మూల భూతమైన వ్యక్తి ఒక స్త్రీ. "ఆవిడతోడి సంబంధమే ఈ విషాద గాథగా పరిణమించింద"న్న గాల్వా తుది పలుకులవల్ల మనకు తెలియ వస్తోంది కొంత. మరణశయ్యపై బడి మృత్యుదేవతతో హోరాహోరి పోరాడుతూ నిస్సహాయుడై కడపటి శ్వాసలు పీలుస్తూ గాల్వా పలికిన పలుకులు: "నేను మరణిస్తున్నాను. ఒక నీచాతి నీచమైన కులటకు బలియైపోయాడని సమాజం నన్ను అవహేళన చేస్తుంది, ఆడిపోసుకొంటుంది. తృప్తి చెందుతుంది! అయితే నాపైకి మృత్యువును లాగుకొనివచ్చినవారా క్షమార్హులు. విశ్వసనీయులు".

గాల్వా తుది పలుకులుగా మనకందిన పై వాక్యాలు యదార్థాన్ని కొంతవరకే చెబుతోంది. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులకి లోనయి, నిరాశ నిస్పృహలు మూర్తీభవించినట్లుగా నడయాడుతూ, మాటి మాటికీ ఎదురీతలు ఈదలేక ఓడిపోతూ విలప్రాయంలో అన్ని అవాంతరాలకు అంకితమైపోయిన ఒక యువకుడు ఈవిధంగా పలికితే అది అతని మానసిక గాంభీర్యమును తెలుపుతుంది, కాని కథ నడచిన తీరువేరు. లేకుంటే పనికట్టుకొని తనను నిష్కారణంగా సవాలుకు దింపి తుదముట్టించే వరకూ నిదురపోని హంతకులను క్షమార్హులు అంటాడా? విశ్వసనీయులు అంటాడా?

చివరకు సహచరులే గాల్వాను హతమార్చినారు. అయితే ఇది ఆనాటి సమాజం గాల్వాకు చేసిన ద్రోహంలో స్వల్పంగానే పరిగణించబడుతుంది. గణితశాస్త్రంలో, రాజకీయ పరిజ్ఞానంలో తారా పథాలను అందుకొనే శక్తిని కరతలామలకం చేసుకొని బ్రహ్మాండమైన మేధాసంపన్నతతో నిండి ఉండిన గాల్వాకు సమకాలీన సమాజం తన ఇనుపపాదాల క్రింద సజీవమైన సమాధిని చేసింది. ఈ ఘోరశిక్షకంటే గాల్వా భౌతిక శరీరాన్ని కాల్చి చంపినవారు అతనికి ప్రసాదించిన బాధే కొంత నయమనిపిస్తుంది,

మిడి మిడి జ్ఞానంతో ఉన్నత పదవులను, అధికారాలను హస్తగతం చేసుకొన్నవారు ఎక్కడైనా విజ్ఞానధనులు, అర్హులు ఎదురైతే వారిని హతమార్చేందుకు కంకణాలు కట్టుకొని నిర్విరామంగా కృషి చేసి సఫలమనోరథులౌతూ ఉంటారు. ఈ పరమ సత్యానికి ప్రబల నిదర్శనం గాల్వాజీవితం.

క్రీ. శ. 1811వ సంవత్సరం, అక్టోబరు 25 న బోర్గ్‌లా–రినీ అనే పట్టణంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించినాడు ఎవరిస్ట్‌గాల్వా. గాల్వా తండ్రి సాహితీప్రియుడు. తత్త్వశాస్త్రం చదువుకొని రాజకీయాలలో ప్రవేశించి బోర్గ్‌లా–రీనికి మేయరై ఆ పదవిని చాలకాలం నిర్వహించినాడు. గాల్వా తల్లి ఒక న్యాయశాస్త్రాచార్యుని కుమార్తె. కష్ట సహిష్ణుత, ఉదార స్వభావం ఆమెకు పుట్టుకతో అమరిన భూషణాలు. పన్నెండేండ్ల ప్రాయం వచ్చేసరికి గాల్వా తల్లిదండ్రుల ప్రాపును వదలి పారిస్‌లోని లూయీ–లే–గ్రాండ్ కళాశాలలో ప్రవేశించినాడు. వయసుకు మించిన జ్ఞాన పరిణతి గలవాడని ప్రవేశించిన కొద్ది రోజులకే తోటివారికి తెలిసిపోయింది. తరగతికి నిర్ణయించిన పాఠ్యపుస్తకాలు అతని తృష్ణను తీర్చలేక పోయినవి. ప్రాథమిక బీజగణిత గ్రంథాలు చదవలేక చీదరించుకొనేవాడు. తన జ్ఞానస్థాయికి సరిపడే పుస్తకాలకోసం వెదకి వాటిని సేకరించి చదవడం ప్రారంభించినాడు. ఆ రోజుల్లో గణిత శాస్త్రంలో లబ్ధ ప్రతిష్ఠులు లేగ్రాంజి, కోషీలు. చిరు ప్రాయంలోనే గాల్వా వీరి రచనలను జీర్ణించుకొన్నాడు. గాల్వా చేతుల్లో ప్రౌఢములైన గణిత గ్రంథాలను చూచి ఆచార్యులు కోపంతో చురచుర చూచేవారు కొందరు, "ఎందుకు ఇట్లాంటి వటనలు–ఇవన్నీ నీకు అర్థమై ఏడుస్తాయా" అని మందలించేవారు కొందరూ ఉండేవారు. "అనుసరించడమే జ్ఞానసముపార్జనమనుకొనే మిథ్యాధీమంతులకు సహజ పాండిత్యం చూపోపమిని కలిగిస్తుంది కదా!". వీరు భావ

విప్లవాలను, నూతన మార్గాలను అభినందించరు, గ్రహించరు కూడా. కనుక గాల్వాకు పాఠాలు చెప్పేందుకు వచ్చే ఉపాధ్యాయులు గాల్వాలో మహత్తరమైన తెలివితేట లున్నాయని అంగీకరించేందుకు నిరాకరించినారు. పైగా "వాడు అవిధేయుడు, పెడసరిరకం మనిషి" అని యోగ్యతా పత్రాలిచ్చినారు పరస్పర ఆమోద ముద్రతో. ఇంకా బుద్ధిమంతులైనవారు "వాడు పిచ్చివాడు, లేకుంటే ఈ చిన్న వయస్సులో ఉద్గ్రంధాల జోలికి పోతాడా ఏవడైనా?" అని ఊరకున్నారు. గణిత చరిత్రకారులకు అందిన ఒక గ్రంధంలో గాల్వా ఉపాధ్యాయుడొకడు ఈ విధంగా వ్రాసిఉన్నాడు: "అందరూ గాల్వాలో ఒక శక్తి ఉన్నదంటారు. నేను ప్రత్యక్షంగా పరీక్ష చేసినాను. ఒక్క నిదర్శనం కూడా కనబడ్డంలేదు, అతణ్ణి గొప్ప తెలివితేటలు కలవాడనేందుకు." ఈ విధంగా తన ఉపాధ్యాయులు తనని గురించి మాట్లాడుతూ తప్పడడుగులు వేస్తున్నప్పుడు గాల్వా అఖండమైన విజ్ఞానతృష్ణతో, రాబొయ్యే తరాలవారికి నిక్షేపాలుగా నిలబడే పరిశోధనలను కొనసాగిస్తున్నాడు. అప్పటికి అతడు పదునారేండ్ల పసిబాలుడు. పూర్వులైన గణిత శాస్త్రజ్ఞులు పరిశోధనలుచేసి విజయం సాధించని అంశాలపైన పని చేస్తున్నాడు గాల్వా-సర్వసాధారణ పంచమ ఘాత సమీకరణాన్ని (**General Fifth Degree Equation**) న్ని సాధించేందుకు, ఫలితంపైన నమ్మకం కుదరనప్పటికీ, పూనుకొన్నాడు. నిర్విరామంగా పరిశోధనలు చేస్తూ ఒక స్థాయిలో సాధించేశానని నమ్మినాడు! అది అసాధ్యమైనదని తెలిసికూడా. ఈ సమస్యా పరిష్కారానికి పూనుకొని గాల్వా, అమూల్యమైన జ్ఞానాన్ని ప్రోగుచేసినాడు గణితానికి. తత్ఫలితమే నేడు మన కందిన గణితజ్ఞాన నిక్షేపము: **Theory of Algebraic Solution of Equations.** ఈ సిద్ధాంత చర్చలో ఒక చోట పంచమ ఘాత సమీకరణాన్ని సాధించ వీలుకాదు అనే విషయం నిర్ణయమైనది.

లూయీ-లే గ్రాండ్‌కళాశాలలో విద్యాభ్యాసం ముగించుకొని పదు నేడేండ్ల వయస్సులో గాల్వా "ఎకోల్ పాలిటెక్నిక్"లో చేరేందుకువెళ్ళినాడు. ఆ రోజులో అగ్రశ్రేణి గణితశాస్త్రశాల "ఎకోల్ పాలిటెక్నిక్". గాల్వాకు ప్రవేశం లభించలేదు. మొదటి ప్రయత్నం విఫలమైనది. మరు సంవత్సరం 1829 లో మళ్ళీ ప్రయత్నించినాడు. నిష్ప్రయోజనమైనది. రెండుసార్లు గాల్వా అనర్హుడనే నిర్ణయించి ప్రవేశాన్ని కల్పించలేదు. గాల్వా తన గణిత జ్ఞానానికి నిదర్శనంగా అప్పుడే **Gergonne's Annales De Mathematique** లో తాను ప్రచురించిన సమీకరణ సమస్యలను చూపించినా అతనికి ప్రవేశం లభించలేదు. ఇంతమంది కలసి తనని గణిత జ్ఞానానికి అనర్హుడని భావించి బాధించినా గాల్వా మాత్రం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. తన పరిశోధనలు విశ్వసత్యాల పొలిమేరలకు వెళుతోన్నదని, భావి ప్రపంచం అర్థంచేసుకొని లాభపడుతుందని దృఢంగా నమ్మినాడు. తన మొదటి **Memoir** ను సైన్సు అకాడమీ వారికి పంపించినాడు. చాల రోజులు వేచినప్పటికీ, ఎన్నో ఉత్తరాలు వ్రాసినప్పటికీ **Memoir** అతీగతీ తెలియలేదు-వ్రాసిన ప్రతి ఉత్తరం బుట్టదాఖలు చేయబడేది. కొంత కాలం తరువాత ఆ **Memoir** ఎక్కడో చిత్తుకాగితాలతో కలసిపోయిందని, ఎంత వెదకినప్పటికీ లాభంలేదని అకాడమీనుండి గాల్వాకు వార్త అందింది. ఈ మెమాయర్ ధారపోవడానికి కారణం కోషి ఉదాసీనత. లూయీ-లే గ్రాండ్ కళాశాలలో చదువుకొనే రోజుల్లో కోషి అంటే ఎంతో భక్తి శ్రద్ధలు కలిగి ఆయన రచనలు శిరోధార్యాలని యెంచి ఆయనను పూజించినందుకు గాల్వాకు లభించిన బహుమానమిది. ఈ అకాడమీ గాల్వాకు నిష్కృతిలేని అపకారం చేసింది. అక్రమమార్గాలలోగాక నిజ ప్రతిభతో పైకి రాదలచిన అతని ఆశాకుసుమాలను మొగ్గలుగనే త్రుంచివేసింది. మెమాయర్ చ్యుతిమైపోయింది. "మళ్ళీ వ్రాసిపంపవలసిందని అకాడమీ కోరిఉంటే ద్విగుణీకృత ఉత్సాహంతో, విశిష్టమైన పద్ధతిలో మెమాయర్‌కు కొత్తరూపురేఖలు కూర్చిపంపే వాడు" అని గాల్వా స్నేహితుడు షెవిలియర్ ఒకచోట వ్రాసినాడు. ఇన్ని విధివైపరీత్యములతో హోరా హోరి పోరాడే గాల్వాకు గోటి చుట్టుపై రోకటిపోటుగా తండ్రి ఆత్మహత్య చేసుకొన్నాడు.

అయినా గాల్వా జిజ్ఞాస ఆగిపోలేదు. 1829 లో 'ఎకోల్ నార్మల్' లో ప్రవేశించినాడు. అప్పటికి అతని వయస్సు పదునెనిమిదేళ్ళు. అక్కడకూడా తన పురోగమనాన్ని సహించని శక్తులు ఎదురైనాయి. అయినా సాహసంతో ఓటమిని అంగీకరించక ఆరు గణిత వ్యాసాలను ప్రచురించినాడు. దురదృష్టవశాత్తు ఆ పాఠశాల అధికారులకు, గాల్వాకు రాజకీయంగా భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. విద్యాసంస్థ డైరెక్టరు గాల్వాను పాఠశాలనుండి బహిష్కరించినాడు. విచిత్రమైన వ్యక్తులతో నిండిన ఆ పాఠశాలనుండి బయటపడటమే మేలనుకొన్నాడు గాల్వా. కాని ఒక పాఠశాలనుండి బహిష్కరించబడినందువల్ల గాల్వా అన్ని విద్యాలయాలకు అస్పృశ్యుడైనాడు. ఆ సందర్భంలో గాల్వా నిరుపేద. దినబత్తెము సంపాదించుకొంటేగాని డొక్క ఆడదు. అందుకని ఒక పుస్తకాల కొట్టులో ఉపన్యాసాలిచ్చే ఉద్యోగాన్ని ఏలాగో సంపాదించినాడు. పందొమ్మిదేండ్ల బాలుడు, దరిద్రుడు అయిన గాల్వా గణిత పరమావధులను స్పృశిస్తూ ఉపన్యాసాలిస్తున్నాడు, కాని శ్రద్ధగా వినేవారు ఎవ్వరూలేరు శ్రోతలలో. విప్లవాలలో పాల్గొనేవారు, ఏదో వాగుతున్నాడు వింటాము అని ధయతలచి ఉబుసుపోకకు వచ్చేవారు తప్ప మరెవ్వరూ రారు ఆ సభలకు. గాల్వ ఆరోజుల్లో ఇచ్చిన ఉపన్యాసాలు సామాన్యులకు అవగాహన అవుతుందా? గణితంలో ఎంతో ప్రావీణ్యంకావల వానికి గ్రహించేందుకు.

ఎంత పోరాడినప్పటికి పేదరికంతో, జయించలేకపోయినాడు

గాల్వా. పూట గడవడమే కష్టమైనది. దీనికి తగ్గట్లు అతని ఆరోగ్యం కూడా దెబ్బ తిన్నది. ఒంటరితనం మనిషిని మరీ క్రుంగ దీసింది. అంత దయనీయమైన పరిస్థితులలో గాల్వాను ఆదరించేందుకు సిద్ధమైనవారు అనేకులున్నారు. కాని గాల్వాకు ఆత్మాభిమానం అడ్డు వచ్చింది. అన్నమునకు వాచి అన్యులను ఆశ్రయించడం గాల్వాకు సుతరామూ గిట్టదు. చిన్న చిన్న పూటకూళ్ళ ఇళ్ళల్లో అర్ధ భోజనాలు అలవాటు చేసుకొన్నాడు. రోడ్ల ప్రక్కన ఎక్కడ ఖాళీ బల్లలుంటే చాలు అక్కడ రాత్రులలో నిద్రపోవటం నేర్చుకొన్నాడు. అవే గాల్వాకు హంసతూలికాతల్పాలు. స్వంత డబ్బాలు కొట్టుకొని 'బోధమల్పంబు, గర్వమభ్యున్నతంబు'గా విర్రవీగే కుహనాజ్ఞానజీవుల దౌష్ట్యాలకు బలియై అర్హతకు తగిన పారితోషికాలు సంపాదించే అవకాశాలు లభించక నానాటికి మానసికంగా, శారీరకంగా కృశిస్తున్నప్పటికీ, గాల్వా సైన్సు అకాడమీకి మఱొక మెమాయర్ పంపినాడు. అప్పుడు అకాడమీ కార్యదర్శి పేరుమోసిన గణితజ్ఞుడు బేరన్ ఫూరియర్ (J. B. J. Fourier) ఫూరియర్ గాల్వా రచనను తాపీగా చూద్దామని ఇంటికి పట్టుకెళ్ళి తన బల్లపై పడవేసి ఉంచినాడు. గాల్వా దరిద్రమేమో; ఆ రచనను చదివేందుకు తీరుబడి దొరికే లోగా ఫూరియర్ మరణించినాడు. సైన్సు అకాడమీవారు ఫూరియర్ వద్ద ఉండిన గణిత భాండాగారాన్ని స్వాధీనం చేసుకొని శోధించినారు. కానీ గాల్వా రచన కనబడలేదు. ఆ రచన పోయినందుకు అకాడమీ వారు చింతించలేదు, అంతకంటే ముఖ్యమైన పనుల్లో వారు నిమగ్నులైనారు గనుక!

ఇన్ని విధి విఘాతాలకు ఓర్చుకోలేక క్రుంగిపోయే గాల్వాకు ఒక ఆశాజ్యోతి కనబడింది, విఖ్యాత గణితవేత్త పాయిస్సన్ (Poisson) పరిచయంతో. పాయిస్సన్ స్వయంగా అకాడమీకి వెళ్ళి గాల్వా కేసు విచారిస్తానని పూనుకొన్నాడు. ఆయన ప్రోత్సాహంతో గాల్వా రెండవ మెమాయర్‌లోని విషయాలను గుర్తుకు తెచ్చుకొని, మళ్ళీ వ్రాసినాడు, సైన్సు అకాడమీకి. పాయిస్సన్ నాలుగు నెలల కాలం ఆ రచనను అట్టిపెట్టుకొని, గాల్వానుండి అనేక ఉత్తరాలు వచ్చిన తరువాత "అర్థము కాలేదు" అన్న రిమార్కుతో త్రిప్పి పంపినాడు.

ఫలించని ఆశల ఫలితంగా విపరీతంగా విసిగిపోయినాడు గాల్వా. అతని హృదయం చీకాకులతో కాకలు తీరింది. ఆ అయోమయస్థితిలో గాల్వా గణిత పరిశోధనలను తాత్కాలికంగా ఆపి రాజకీయ సుడిగుండంలోకి ఉరికినాడు. "రివల్యూషనరీ లిబరలిజమ్" కోసం గద్దెలెక్కి గొంతు చించుకుని ఉపన్యాసాలిచ్చినాడు. కట్టలు త్రెంచుకొని ప్రవహించే నదీజలంవలె అతనిలో ఉగ్రకోపం వేయి పడగలు సాచింది.

బూర్జువా నాయకత్వం బూడిదపాలు కావాలని బల్లగుద్ది గర్జించినాడు. ఒక సభలో, మాటపై మాట వచ్చినప్పుడు, కోపావేశంతో 'లూయీ ఫిలిప్స్'ను హతమారుస్తాను అనేశాడు. తత్ఫలితంగా గాల్వా ఖైదీ అయినాడు. విచారణలో క్షమాభిక్ష కోరుకుంటే విడుదల చేస్తామని అధికారులు చెప్పినా, ఆత్మాభిమానంతో గాల్వా ఆడిన మాటను శెదనలేదు. క్షమించమనీ ఆశించలేదు. అయినా ఒక సాంకేతిక అంశంపై విడుదల చేయబడ్డాడు, కొద్దిరోజులు బ్రతికేందుకనే! రెండు నెలల తరువాత మళ్ళీ "ప్రమాదకరమైన విప్లవాలు లేవ తీయగలడు" అన్న పట్టంతో కారాగారంలోకి త్రోయబడ్డాడు. తరువాత కొన్ని నిబంధనలతో విడుదలైనాడు.

ఇతఃపూర్వమే పూర్తిగా విసిగి పోయిన గాల్వాకు ఇప్పుడు జీవితంపైననే ఒక ఏహ్యాభావం కలిగింది. జీవితంలో అన్నీ దుస్సాధ్యాలేననే తీవ్రనమ్మకం ఏర్పడిపోయింది. నూటికి నూరు పాళ్ళు నిరాశావాదిగా రూపొందినాడు గాల్వా. అలా మథించబడే ఆతని మేధస్సులో స్వప్నసమయాలలో విశ్వసత్యాలు లీలగా గోచరించేవి. అయితే అవి ఆనాటి గాల్వాకు రుచించని సమస్యలు. వాటిని గురించి ఆలోచిస్తే అతనిలోఉన్న దుఃఖం మరీ పెరుగుతుంది. నిరాశ నిండుకొంటుంది—అందువల్ల వాటినిగురించి అనుకోవటమే మానేశాడు. ఆరోజుల్లోనే ఒక స్త్రీతో పరిచయం ఏర్పడింది గాల్వాకు. ఆవిడే ఆతని దుర్మరణానికి కారణమైన కులట—

ఈ వ్యక్తితో గాల్వాకు ఎలాంటి సంబంధముండెనో యధార్థంగా ఎవ్వరికీ తెలియడంలేదు. అయితే గాల్వాపై ఆవిడమాత్రం సమ్మోహనం ప్రయోగించింది. ఆవిడ అంటే గాల్వాకు ప్రాణం. ఆమెకు మామయ్య అని ఒకడు, ప్రియుడని మరొక్కడు—ఇరువురు అకస్మాత్తుగావచ్చి గాల్వాతో పేచీపెట్టుకొన్నారు. నిజానికి వారు ఆవిడతో కులికే విలాసపురుషులేగాని బంధువులుకారు. ఆ పేచీ ముదిరి పిస్తోలులతో కొట్లాటకు దారితీసింది. ప్రతిష్ఠ, పరిస్థితులమధ్య యిరుక్కొని ఆ సవాలును అంగీకరించక తప్పిందికాదు గాల్వాకు, తాను పోటీలో మరణించడం తధ్యమని తెలుసుకొనికూడా ఒప్పుకొన్నాడు. 1832, మే, 25, 27 తారీఖులలో పోటీ జరగవలసిందని నిర్ణయించుకొన్నారు. నిర్ణయించుకొన్నతరువాత డైరీలో వ్రాసుకొన్నాడు గాల్వా "విధిలేక నిర్బంధంమీద నేను ఈ డ్యూయల్‌కు ఒప్పుకొన్నానని దేవుడేసాక్షి. డూయల్ అపుదామని ఎంత యత్నించినా నిష్ప్రయోజనమైంది"—

డ్యూయల్‌కు ముందురోజు గాల్వా మూడు ఉత్తరాలు వ్రాసినాడు; అందులో ఒకటి మిత్రుడైన ఆగస్టీ కేవిలియర్‌కు. స్వల్ప జీవితకాలంలో తాను సాధించిన గణితశాస్త్రసత్యాల సింహావలోకనం ఆ ఉత్తరంలోని ఉదంతం. అదృష్టవశాత్తు అమూల్యమైన ఆ ఉత్తరం కాలగర్భంలో కలసిపోక ఈ నాటికీ జాగ్రత్తగా కాపాడబడి ఉన్నది—

డ్యూయల్ జరిగింది; పిస్తోలుగుండ్లు గాల్వా కడుపు చీల్చి వెళ్ళినాయి. నిలువున కూలిపోయినాడు గాల్వా. విధివైపరీత్యం అతడు తక్షణ మరణంకూడా నోచుకోలేదు. నిస్సహాయస్థితిలో, మరణదేవత రంపపుకోతలకు శరీరాన్ని అప్పగించి డ్యూయల్ జరిగిన పొలంలోనే మూడు పగళ్ళు, మూడు రాత్రులు విలవిల తన్నుకొన్నాడు. ఆ జీవుడి ఆవేదన ఆలకించిన వారెవ్వరూలేరు, 30వ తారీఖు (మే) ఉదయంవరకు. ఆఉదయవేళ ప్యారిస్ నగరానికి వెళుతూ ఈ భీభత్సం చూచినాడు ఒకరైతు. అప్పటికీ కొనప్రాణాలతో ఉన్నాడు గాల్వా. ఆరైతు ఎంతో కష్టంతో, ఆతురతతో గాల్వాను మోసుకెళ్ళి కోబిన్ హాస్పిటల్‌లో చేర్చినాడు. హాస్పిటల్‌లో చేరుతూ ఉండగనే ప్రాణాలు గోల్పోయాడు గాల్వా.

గాల్వా భౌతిక శరీరాన్ని శ్మశానానికి తీసుకొని వెళ్ళేటప్పుడు దాదాపు 3000 మంది రిపబ్లికన్లు చేరినారట. పోలీసు బందోబస్తు కూడా అమర్చింది ప్రభుత్వం, గాల్వా గౌరవార్థం కాదు, గుమిగూడిన జనాన్ని అదుపులో ఉంచేందుకని—

ఇరువది ఏళ్ళ ప్రాయం వరకు బ్రతికినపుడు గాల్వాతో మనసిచ్చి మాటాడిన మనుజుడు లేడు ఆ సమాజంలో, కాని ఘోరంగా మరణించినపుడు స్మారక సభలు జరిపినారు, తలలు వంచుకొని దుఃఖసూచకంగా ఊరేగినారు, స్మృతిగేయాలు రచించినారు. ఎంత విచిత్రమైనది మన మానవ సమాజం!

గాల్వా భౌతిక శరీరం మట్టిలో కలిసిపోయిన తరువాత కొన్ని ఏండ్లకు ప్రపంచం గుర్తించింది, అతని రచనల వైశిష్ట్యాన్ని ఒక శతాబ్దం తరువాత విఖ్యాత ఫ్రాన్సు గణితవేత్త జోర్డాన్, గాల్వా పరిశోధనలను విజ్ఞాన ప్రపంచానికి తెలిపేందుకు ప్రయత్నించినాడు. ఆ ప్రయత్నంలో అనుకొన్నాడు 'గాల్వా రచనల అంతరార్థాలను సత్యాలను, పూర్తిగా అర్థం చేసుకొనేటందుకు ఒక సుదీర్ఘ జీవిత కావలె' అని. అలాగా చాల కాలం వినియోగించినాడు ఏకదీక్షలో జోర్డాన్. అప్పటికి ఆతనికి ఆశయసిద్ధి పరిపూర్ణంగా నెరవేరలేదు. అయినంతవరకు కుణ్ణంగా గ్రహించి దానిని భావికాల గణిత ప్రపంచానికి ఎంతో ఉపకరించేటట్లుగా రూపొందించి వంద పుటల తొలి పలుకులతో ప్రచురించినాడు. గణితశాస్త్ర నభోవీధిలో మిరుమిట్లు గొలిపే దివ్యతారగా గాల్వా అమరినాడు, ఇందుకు జోర్డాన్ ఎంతో అభినందనీయుడు.

నేడు గాల్వా ప్రావీణ్యమును గూర్చి ఎవ్వరూ శంకించరు. విశ్వవిఖ్యాత గణిత సత్యాలయినాయి ఆతని పరిశోధనా ఫలితాలు. కానీ ఆతని జీవితం మాత్రం బాధాకరమైన విషాదగాథగా మిగిలిపోయింది.

# అపస్వరాలు

## శ్రీ యన్నంరెడ్డి వెంకటరెడ్డి

హృదయ వీణియపై
        చైతన్య తంత్రులపై
వేలి కొసల మీటుతో
రాగ రంజిత విపంచికలు
మ్రోగుతూ...మ్రోగుతూ...ఆ తంత్రీ నిస్వనాలు
క్షణ కాలం ఆగిపోయాయి...
ఎందుకో... ?

మృదు మధురంగా పాడే కోయిల
కర్ణపేయంగా వినిపించే ఆ రాగం
ప్రకృతి ప్రశాంతతలో
ప్రతిధ్వనిస్తోంటే...
పాడుతూ...పాడుతూ...ఆ కంఠం...
క్షణ కాలం జీరవోయింది...
ఎందుకో...?

కాలయంత్రంలోని ముల్లు
ఘడియలు, గంటలు చూపుతూ
కాలాన్ని వెనక్కి నెడుతూ
ముందు కురక లేస్తుండ...
సాగుతూ...సాగుతూ...ఆ కాలం...
క్షణ కాలం చలన రహితంగా ఉంది
ఎందుకో......?

స్వార్థ చింతన లేని
మలయ మారుతపు
పిల్ల గాలులు
హాయి హాయిగ వీస్తుండ...
వీస్తూ...వీస్తూ...ఆ గాలి...
క్షణ కాలం స్తంభించి పోయింది...
ఎందుకో... ?

గలగల పారే సెలయేరులు
మిలమిల మెరిసే పిల్లకాలువలు
బండ రాళ్ళ మధ్యనుండి బరువుగా
దారి తీసుకు పోతూ...
పారుతూ...పారుతూ...ఆ నీరు...
క్షణ కాలం ఘనీభవించింది...
ఎందుకో...?

శివ శైలతనయు లేకమై
విలయ విన్యాస ప్రళయ నృత్యం చేస్తోంటే...
హిమగిరీంద్ర శిఖరం
ఘూర్ణిల్లుతున్న సమయాన
ఆడుతూ ..ఆడుతూ...ఆ నృత్యం...
క్షణ కాలం ఆగిపోయింది...
ఎందుకో... ?
వినిపించే వీణా
తంత్రీ నిస్వనాల్లో...
మధురంగా పాడే
కోయిల కంఠంలో...
సాఫీగా సాగుతోన్న
కాలయంత్రంలో...
చల్లగ వీచే గాలిలో
ఉయ్యాల ఊపులో...
సెలయేరు గలగలలలో
పిల్లకాలువల మిలమిలలలో...
శివ శైలతనయుల
ప్రళయ నృత్యంలో...
ఎక్కడో ఏవో పలుకుతున్నాయి—అపశ్రుతులు
అవి ఎందుకో దేనికో మేధకందని—అపస్వరాలు !

# "సౌందరనందము - సంఘటన సంవిధానము"

"బీయార్"

బౌద్ధ వాఙ్మయంలో సుందరీనందులకథ అనేక విధాలుగా కనిపిస్తోంది. కానీ పింగళి కాటూరుల సౌందర నందానికి అశ్వఘోషుని సౌందరనందమే ఒజ్జబంతి. రచయిత చెప్పుకున్నా రెండు భాషలలో ఒకే పేరుతో ఒక కావ్యం కనిపిస్తున్నప్పుడు వాటిని సరిపోల్చి చూడటమూ, జరిగిన మార్పులనీ, కలిగిన లాభాలనీ బేరీజు వేయటమూ నిష్ప్రయోజనం కానేరదు.

సంస్కృత సౌందరనందం నించి అరవైదాకా శ్లోకాలు యధాతధంగా అనువదింపబడటమేకాకుండా, మరన్ని శ్లోకభాగాలూ, భావాలూ తెలుగు సౌందరనందంలోకి దిగుమతి అయ్యాయి. అయితే ఈ అనుసరణలన్నీ మొదటి అయిదు సర్గలకే పరిమితాలు. తరువాత ఉన్న నాలుగు సర్గలకీ, సంస్కృత సౌందరనందానికి సంబంధమే లేదని చెప్పవచ్చు. అంతవరకూ అంత సన్నిహితంగా నడిచి నడిచి ఆరవసర్గ దగ్గరనుంచీ అలా విడిపోవటానికి దారితీసిన సంఘటనలేమిటి, వాటివల్ల కావ్యానికి పుష్టి కలిగిందా నష్టి కలిగిందా? అనేది పరిశీలించటమే నా ప్రధానోద్దేశం.

## అయిదు మార్పులు

మొత్తం తెలుగు సౌందరనందం కథలో చెప్పుకోవలసిన ప్రధాన సంఘటనలు ముఖ్యమై అయిదు ఉన్నాయి. వీటిలో అయిదో సర్గతో ముగిసిన ఇరవై రెండు సంఘటనల్లోనూ అయిదు తప్ప తక్కిన సంఘటనలన్నీ రెండు కావ్యాల్లోనూ సమానమే. ఈ అయిదు మార్పులూ కారణంగా తెలుగు కావ్యానికి కొన్ని ఔచిత్యాలూ, కొన్ని అనౌచిత్యాలూ సంక్రమించటంతోపాటు, ఆ పై నాలుగు సర్గలూ స్వతంత్రాలవ్వటం కూడా జరిగింది.

## అమితభాషి బుద్ధుడు

కపిలవస్తు నిర్మాణకథతో సంస్కృతకావ్యం ప్రారంభం అవుతుంది. నిర్వాణ పథాన్ని కనుగొన్న బుద్ధుని పునరాగమనంతో తెలుగు కావ్యంలో తెరలేస్తుంది. కపిలవస్తు పౌరులకి దశ ధర్మసూత్రాలనీ తెలుగు బుద్ధుడు తానే ఉపదేశిస్తాడు. అశ్వఘోషుడు కపిలవస్తు పౌరుల ప్రవర్తనలో జరిగిన మార్పులని వర్ణిస్తూ దశ ధర్మసూత్రాలని వ్యంగ్యంగా తెలియజేశాడు. అంతేకాదు. [1]ఉభయ దైశికుడైన మహర్షి విహరించడం కారణంగా ఆ కపిలవస్తు పట్టణం కురు రఘు పూరు పురోపమంగా మారిందని చెప్పాడే తప్ప, వచ్చీ రావడంతోనే పౌర జన సమూహాన్ని ఉద్దేశించి బుద్ధుడు ధర్మోపన్యాసం చేశాడని చెప్పలేదు. శిష్యులే ప్రబోధించారో, బుద్ధుని మహాత్మ్యమే వారిని మార్చిందో! మొత్తం పద్దెనిమిది సర్గల సంస్కృత కావ్యంలో బుద్ధుని గొంతు వినిపించేది నాలుగుసార్లే. అదికూడా నందునితో మాత్రమే.

"ఆ నందుడు" అనే శిష్యుడు నందుడికి దీక్షనిచ్చిన తరవాత శ్రమణుడు అనే శిష్యుడు, శరీర నశ్వరత్వాన్ని గురించీ, అహంకార త్యాగాన్ని గురించీ, స్వార్థరాహిత్యాన్ని గురించీ, అనేక విధాల నందుడికి ఉపదేశిస్తాడు. ఈ శ్రమణుడి ఉపదేశాంశాల్ని కూడా తెలుగు కవులు బుద్ధుని నోటనే పలికించారు. ఈ మార్పుల్నిబట్టి చూస్తే తెలుగు బుద్ధుడు పరమ లౌక్యుడుగానూ, ఉపన్యాసప్రియుడుగానూ కనిపిస్తాడు. సంస్కృత బుద్ధుడు మితభాషిగానూ, "[2] నాటికి భిక్షాశన మొల్లమి హస్త సంజ్ఞామాత్రమున" తెలియజేయదగిన వాడుగానూ కనిపిస్తాడు.

## వియోగినీ హృదయం

ఇంక పునరాగమ ఘట్టంలో యశోధర తన చిన్నికొడుకుని వెంటబెట్టుకొని బుద్ధదర్శనానికి వచ్చినట్లు అశ్వఘోషుడు చెప్పలేదు. తెలుగుకవులు ఇది కల్పించారు. అంతఃపుర నియమాలనిబట్టి చూస్తే ఇది తప్పు. సానుభూతితో, వియోగినీ హృదయంతో చూస్తే ఇది ఒప్పు. ఈమార్పువల్ల తెలుగు కావ్యానికి ఆ ఘట్టంలో రసార్ద్రత చేకూరింది. "కజ్జలహీనమై" అనే మంచి పద్యానికి కారణమయ్యింది.

## కామం - ప్రేమం

సుందరీనందుల కేళీ విలాసాల్ని కేవల కామ శృంగారంగా వర్ణించాడు అశ్వఘోషుడు. అతని సుందరీ నందులు[3] హిమవన్నాగ గుహలలో

విహరించే సిద్ధదంపతులు [4] భూమికి ఒక మెట్టుపైన, స్వర్గానికి ఒక మెట్టు కిందా ఉన్నవారు మాత్రమే కానీ తెలుగుకవుల సుందరీనందు అనురాగం శృంగారమాత్ర పరిమితంకాదు. వీరిది ఒకరు లేక ఒకరు బతుకలేని అద్వైతప్రేమ కాబట్టే అశ్వఘోషుడు ఆగిపోయిన చోటనుంచి మరోమూడు మెట్లు పైకి ఎక్కారు తెలుగు కవులు.

ప్రాలేయ గిరిక దరా నికోద విహార పరులైన సిద్ధ దంపతులనంగ,
విబుధ తరంగిణీ వీచికాడోలలం దూగెడిరాయంచ దోయియనంగ,
కవి మనఃపంకజాసనసిక్తమై రసాగమున నాడెడి పదార్థము లనంగ,
ఆనంద పరిపుల్ల మౌనీంద్ర దహరతారాధ్య మందాడు జీవాత్మలనంగ
నీకు చింతల దిగ దావి, చెన్నుమిగిలి
హృదయ సంవేద్యమయ్యు, నాత్మైకగమ్య
మైన యద్వయ సౌఖ్య రసామృతమ్ము
ననుభవింతురు వారు నిరంతరముగ.

సుందరీనందుల అద్వైత ప్రేమని ఇంతకంటే మనోహరంగా ఎవ్వరూ చెప్పలేరు.

## తావలచింది రంభ

అశ్వఘోషుడు సుందరీనందులది కామతృప్తి కోసమైన శృంగారంగా భావించాడు కాబట్టే [5] నందనవనంలో రంభాదుల్ని చూసినప్పుడు నందుని మనస్సు చలించినట్లు చెప్పాడు ఇది అద్వైత ప్రేమకి విరుద్ధం. అందుచేతనే తెలుగు కవులు ఈ స్వర్గ సందర్శన ఘట్టాన్ని పరిత్యజించారు. అంతే కానీ కొందరు విమర్శకులు భావించినట్లు, స్వర్గగమనాదులు అతిమానుషాలూ అసహజాలూ అనే ఉద్దేశంతో మాత్రం కాదు బుద్ధునిలో ఉన్న అతిమానుషశక్తినీ, దైవత్వాన్నీ, తెలుగుకవులూ అంగీకరించినవారే.

## విశ్వప్రేమ

తమ అనురాగాన్ని కేవలతుచ్ఛ విషయవాంఛగా పరిగణించి గౌతముడు నిందిస్తున్నప్పుడు నందుడు విలవిలలాడి పోయాడు. అటుపైని నెమ్మదిగా గురునిదగ్గరకిచేరి తమది నిష్కామమైన అద్వైత ప్రేమ అని నందుడు విన్నవించుకొంటాడు. "నాకున్ ప్రాణము ప్రాణమైన చెలితో... నిష్కేదదివ్యామృత స్వీకారమ్ము భజింపుచున్, సమయముల్, సీమల్ వెసన్ దాటి ఏకాకారమ్మును నిత్యమై నెగడు నయ్యానందమర్థించెదన్" అని తన సిద్ధాంతాన్ని ఆవిష్కరిస్తాడు. అంతవరకూ నందుని మనస్సులో రాజదర్పమూ, యౌవనగర్వమూ, విషయవాంఛలూ మాత్రమే ఉన్నాయని భావించి వాటిని పోగొట్టటానికే ప్రయత్నిస్తూ వచ్చిన బుద్ధుడు నందుని ఈ ప్రేమ సిద్ధాంతాన్ని విన్నతరువాత, ఆ ప్రేమని విశ్వప్రేమగా మార్చుకోమనీ, సుందరికి మాత్రమే అది పరిమితమైనానాడు స్వార్థపూరితమైన కామమే అవుతుంది తప్ప ప్రేమకాజాలదనీ—

హృదయ తటముల పొరలిపొంగెడి త్వదీయ
ప్రణయ సురధుని విశ్వ ప్రపంచముపొకట
జాలిమై ముంచియెత్తినంబోలుగాక
యంగనామాత్ర సముపేక్షకార్థమగునె?

అని ప్రబోధించాడు. ఇప్పుడు నందుని మనస్సు తేరి పరిపక్వమై తెల్వివహించింది. శోక మోహాలు దూరమయ్యాయి. "తొంటివలకూర్మికి దవ్వునిచ్చి" సహధర్మిణియైన సుందరికికూడా దీక్ష నిమ్మని అడిగాడు. ఇది కామరహితమైన అద్వైత ప్రేమ సిద్ధాంతానికి పరాకాష్ఠ. ఇప్పటికీ సుందరిలేనిదే నందుడుండలేడు. కానీ ఇప్పటి ఈ ఉండలేక పోవటానికి శరీరస్పర్శలూ, కామవాంఛలూ కారణాలుకావు. ఇప్పుడు నందునిలోనిది విశ్వప్రేమ. ఈ తత్త్వాన్ని ప్రతిపాదించటానికే సుందరీనందుల ప్రణయవృత్తాంతాన్ని కేవలకామశృంగారంగా కాకుండా అద్వైత ప్రేమగా చిత్రించారు. ఈ మార్పు చెయ్యటంలో రవీంద్రుని ప్రభావం తెలుగు కవులపై కనిపిస్తోంది.

## "బలవంతపు బ్రాహ్మణార్థము"

విహారవాటికకి నందుణ్ణి తీసుకొనిపోయి సంస్కృతబుద్ధుడు ధర్మోపదేశం చేస్తాడు. నందుడు "తథా" అన్న తరవాతనే బుద్ధుడు ఆనందుడు అనే తన శిష్యుణ్ణి పిలిచి నందుడికి దీక్ష ఇమ్మనిచెప్పి తను వెళ్ళిపోతాడు. బుద్ధుడు వెళ్ళాక "నప్రవజిష్యామ్యహం" అని ఆనందునితో నందుడు తెగేసి చెబుతాడు. ఆ వైదేహముని (ఆనందుడు) ఈనందుని అభిప్రాయాన్ని గురుదేవునికి వెంటనే విన్నవిస్తాడు. బుద్ధుడు తిరిగి వచ్చేసి నందుడికి మరికొన్ని ఉపదేశాలు చేస్తాడు. అవి కూడా విన్నాక "ఓదేవా! [6] నువ్వు ఆజ్ఞాపించినట్లే నడుచుకుంటాను" అని దీక్షా స్వీకారానికి తన సమ్మతిని తెలియజేస్తాడు. త్రికరణశుద్ధిగా కాకపోయినా బలవంతంగానైనా అంగీకార వాక్యాన్ని తీసుకొన్నాకనే సంస్కృత కావ్యంలో దీక్ష ఇవ్వటం జరిగింది. కానీ తెలుగు కావ్యంలో అంతా మారిపోయింది.

ఈ పరివ్రాజన ఘట్టంలో తెలుగు కవులు వ్రాసిన ఈ పద్యాన్ని చూస్తే బుద్ధభగవానుడు బలవంతపు సన్యాసాలు చేయించాడు అనిపించటమే కాకుండా, అతనిపట్లా, అతని మతంపట్లా, అతని శిష్యులపట్లా, పాఠకులకి గౌరవాదరాలు ఏర్పడటంమాట అటుంచి భయాందోళనలు పుట్టుకొస్తాయి.

సుడిపెట్టిలో గొంతు నడిపమ్మడుప్పుఁ దూపాను

గడవనీ కెడి యాతగానివోలె
... ... ... ... ... ...
భిక్షుమండలి వేంజిక్క, పెనగులాడి,
వేడుకొని, బిట్టుగా విలపించి, కసరి,
విసివి, చేష్టలు దక్కి, సొమ్మసిలి వాలి,
సుందరీ ప్రాణధనము భిక్షులకు దక్కె. 3-42

## రెండు జంటలు

బుద్ధుడు ఎన్నో ఉపదేశాలిచ్చినా తెలుగు కావ్యంలోని నందుని పరివ్రజనం బలవంత బ్రాహ్మణార్థమే. చివరి ఘట్టంలో గుడిసెలో సుందరీనందులు కలుసుకున్నప్పుడు వారి హృదయాలు పూర్తిగా పాత వికారాన్ని పొందాయి. ఈ పొందటం వెంటనే నిగ్రహించుకోవటం రెండూకూడా వారి అపరిపక్వస్థితిని తెలుపుతున్నాయి. పునరాగమ ఘటంలో బుద్ధుణ్ని చూసిన యశోధర కానీ, యశోధరని చూసిన బుద్ధుడుగానీ చలించలేదు దానికి కారణం బుద్ధుని సన్యాసం ఐచ్ఛికం. నందుని సన్యాసం బలవంతం. పుత్రుడు జనించి సంతృప్తిని పొందింది యశోధర మనస్సు. అగతికంగా వైరాగ్యాన్ని అవలంబించింది సుందరి మనస్సు. మొదటినుంచీ గౌతముని మనస్సు వైరాగ్యోన్ముఖం. ఇది యశోధరకి తెలుసు. నందుని మనస్సు భోగోన్ముఖం. ఇది సుందరికి తెలుసు. అందుచేతనే "అతనుండె సర్వ దైవత కులాధిపుడంచు సన్నజాజుల పూజ సల్పుచుండునట్టి" మన్మథ సేవకుడు వైరాగ్య పద్ధతిని పూనెనన్నమాటని సుందరి నమ్మలేకపోయింది. నిర్బంధ సన్యాసమేనని నిశ్చయించుకొంది. తప్పనిసరియై తానూ అదే అవలంబించింది. ఈ తెలుగు కావ్యంలో సుందరీ నందులది అగతిక వైరాగ్యం. అంటే అద్వైత ప్రేమతత్వానికి మన తెలుగు కవులు పట్టం కట్టారన్నమాట.

## గురువును మించిన శిష్యుడు

బ్రహ్మచర్య దీక్షనీ, శీలకవచాన్నీ, బౌద్ధమతాన్నీ స్వయంగా అవలంబించిన అశ్వఘోషుని చిత్రణలో సుందరీ వైరాగ్య ధోరణి మాట లేకపోగా, నందునిది బలవంతపు సన్యాసంగా కూడా కనిపించటంలేదు. అంతేకాదు గౌతముని గురుత్వంలో సాధనచేసి నిర్వాణ పథాన్ని నందుడు కూడా కనుగొన్నాడని అశ్వఘోషుడు వివరించాడు. కాబట్టి అశ్వఘోషుని నందుడు బుద్ధునితో సమానుడు. 7 "నీ మనఃస్థైర్యాన్ని విన్నాక నీ భార్యయైన సుందరి కూడా నిన్ను అనుకరించగలదు" అని చివరలో గౌతముడు సుందరీ ప్రసంగాన్ని తెచ్చాడేతప్ప, నందుడు ఆమెను తలపనైనా తలవలేదు. బండరాయిగా మారిపోయాడు. ఈ విషయంలో ఇతడు గురువుని మించిన శిష్యుడే అయ్యాడు అంచేత సంస్కృత నందుని సన్యాసమూ వైరాగ్యమూ, సార్థకమూ పరిపక్వమూను.

## గురువును ముంచిన శిష్యుడు

పరివ్రాజనఘట్టంలోసంస్కృతనందుడు తన ప్రేమ సిద్ధాంతాన్ని ఆ నందునితో చెప్పుకోలేదు. "న ప్రవజిష్యామి" అనే ఒక్క మాటని మాత్రం అన్నాడు. ఈ ఒక్కమాటనీ తన గురువుగారికి పొల్లుపోకుండా విన్నవిస్తాడు. ఈ కావ్యంలో ఆనందుడు గౌతముని నమ్మినబంటు. ఈతణ్ణి "ఆత్మసముడు" అని గౌతముడు అనుకొంటే అది అన్నివిధాలా తగినట్టే ఉంటుంది.

కానీ తెలుగు కావ్యంలో ఆనందుడు వేరు. "ప్రేయసీని విడిచి స్వర్గంలో కూడా క్షణకాలమైనాసరే ఉండలే"నని నందుడు తనతో చెప్పుకొన్న ప్రేమగోలని ఆనందుడు గురువుగారికి విన్నవించుకోలేదు. ఈతణ్ణి "ఉపచారదక్షుడు ఆత్మసముడు" అని తెలుగు కవులు పరిచయం చెయ్యటం సమంజసంగా లేదు.

ఒకవేళ చెప్పాడేమో అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే ఆ తరవాత గౌతముడు నందుణ్ణి పిలిచి లోకంలోని శోకాన్ని వివరించి చెప్పి చెప్పి చివరికి "నీ వా సందున నేటికీ యరమరల్? నిక్కమ్ము

దెబ్బంగదోయీ! నీ మానసమెట్లు నా కేరుగరాదో? అప్పులెవ్వారు తం(డీ! నా కన్నను నీకు'' అని అనునయిస్తాడు దీన్నిబట్టి నందుని మనస్సులో ఉన్నదీ, ఆనందునితో చెప్పుకున్నదీ అయిన (ప్రేమ సిద్ధాంతం గౌతమునికి తెలిసిందనుకోవటానికి వీల్లేదుగదా!

ఒకవేళ తెలిసినప్పటికీ నందుని నోటనే అది విందామనుకొని గౌతముడు అట్లా మాట్లాడాడేమో అనుకోవచ్చు. ఆ పక్షంలో అటువంటి అతని (ప్రయత్నానికి ఏ రకంగానూ ఉపయోగపడని ''ఉప దేశము'' అనే సర్గ మొత్తం వ్యర్థమే అవుతుంది ''అనుచు నింతా పెరంపరలందు మరల మునుంగు నందుని నైఖరిపోల్చి గురుడు...'' అనే పద్యంతో ''ధర్మసంవాదము'' అనే తరవాత సర్గని (ప్రారం భిస్తే సరిపోతుంది. కాబట్టి అశ్వఘోషుణ్ణి కాదని ఆనందుని దగ్గర నందుని (ప్రేమతత్వాన్ని ఆవిష్కరించినందువల్ల తెలుగు కావ్యానికి మేలు జరుగకపోగా కీడు జరిగింది.

# నైటింగేలూ-గాంధీగారూ

చివరలో గౌతముడు చెప్పిన ఒక్క శ్లోకాన్ని ఆధారంగా తీసు కుని (ధ్రువంహి సం(శుత్య......) తెలుగు కవులు సుందరిలో వచ్చిన మార్పులనీ, ఆమె సంఘసేవాతత్పరతనీ ''అనుజ్ఞ'' అనే ఒక సర్గగా అద్భుతంగా చిత్రించారు. ఈ సర్గలో సుందరి తెలుగువారి ఫ్లారెన్సు నైటింగేలుగా కనిపిస్తుంది. సుందరీ నందుల పునర్దర్శ నానికి వెలివాడని రంగస్థలం చెయ్యటంలోనూ, గౌతమబుద్ధుడు ఈ సుందరీ నందులకు బాలనంద సుందరులను అందించటంలోనూ గాంధీమహాత్ముని అస్పృశ్యతా నివారణోద్యమ (ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

# ముక్తాయింపు

సంఘటన సంవిధానంలో తెలుగు కవులు చేసిన ఈ అయిదు మార్పులవల్లా తేలిందేమిటంటే-

1. సంస్కృత బుద్ధుడు మౌని–తెలుగు బుద్ధుడు వాగ్మి.
2. సంస్కృత సుందరీ నందులది కేవల శృంగారం– తెలుగు సుందరీ నందులది అద్వైత (ప్రేమ. ఇది కార ణంగా ''ధర్మసంవాదము'' అనే సర్గ వచ్చింది.
3. అశ్వఘోషుని ఆనందుడు ఉత్తమ శిష్యుడు–వీరి ఆనం దుడు అంతటివాడు కాదు. ఇది కారణంగా ''ఉప దేశము'' అనే సర్గ వచ్చింది.
4. సంస్కృత నందుని సన్యాసం సమ్మతం – తెలుగు నందుని సన్యాసం అసమ్మతం.

---

# అధోజ్ఞాపికలు

1 ఇతి మృదితమనా మయాం నిరాపత్కురు రఘు పూరు పురోధసాం

అభయ దేశికే మహర్షే విహరతి తత శివాయ వీత రాగే (3-42)

2 తాద్బుద్ధిమిత్త్వం సుగతశ్చకార నాహోరక్షత్యం స యథా వివేద (5-10)

3. భావాను రక్తోగిరి నిర్ఝర స్నాతే కిన్నరీ కింపురుషౌ విహోభా (4-10)

4. అతీత్య మర్త్యాన్ అనుపేత్య దేవాన్ సృష్టా వభూతామివ భూత ధాత్రా (4-6)

5. స జాత హర్షో ఒప్యరసః పిపాసుః
తత్ (ప్రాప్తయే ఒధిష్ఠిత పక్షబార్యః
లోలేంద్రియాశ్వేన మనోరథేన
జే(హీయమాణో నధృతించకార (10-41)

6. ఇత్యేవముక్తః స వినాయకేన హితైషిణా కారుణికేనసందః కర్తాస్మి సర్వంభగవన్! వచసే తథాయథాజ్ఞాపయ సీత్యువాచ. 5-50.

7. (ధువంహి సం(శుత్యతవస్థిరం మనః, వివృత్య నానా విషయైర్మనోరథైః

వధూః గృహేసా పితవాను కుర్వతీ, కరిష్యతే (ప్రీష విరాగిణీః కథాః (18-59)

# సీలేరు

## శ్రీ కొలచన వెంకటరమణమూర్తి

[పదునె దేండ్ల క్రిందట సీలేరు నందుద్యోగము చేసియుంటిని. ఆ సందర్భమున నచటి స్థితి గతులను అవలోకించి నా డైరీయందు కొన్ని పద్యములను వ్రాసియుంటిని. ఈ మధ్య ఒకసారి సీలేరు వెళ్ళితిని. అప్పటి పరిస్థితికి ఇప్పటి స్థితికీ చాల వ్యత్యాసము కలదు. ఆనాటి నిగువ సీలేరు నందలి పని ప్రాథమికావస్థ. ఈనాడు సీలేరునది యోగినివలె ప్రజాసేవయందు మగ్నమై యున్నది.]

ఆనాటి మధురస్మృతులే ఈ పద్యములు.

**సై ర న్ :**

తే. గీ. తరణి యుదయించెఁ దూర్పునఁ దరలవలెను
కూలి తక్కువ, పనులెన్న గొప్పవియను
కష్టజీవుల నిట్టూర్పు సృష్టియనఁగ
గోల చేసె సైరను దయ కాలమందు.

**అ ర ణ్య ము :**

శా. మీ లోకంబున దుష్టులెవ్వరో కనన్ మీవార లెవ్వారలో
మీలో శక్తి నశించె; నీతిభువినేమీలేనె లేదాయెగా
మాలో దుష్టులు శిష్టులుం దెలియుఁగా మా భూమి
కిన్ రండటం
చాలింపన్ గనుపట్టుఁగా వన మృగావ్యానార్భటుల్
తద్దయున్.

సీ. ఒక కొండ చండాంశు నుదయాద్రియై యుండు
నన్నమూగిరిచూడ నస్తశిఖరి
దిక్కులన్నింటను మక్కువం గనినచో
మిక్కుటంబుగఁజెట్లు నిక్కిచూచు
ఆబాల గోపాలమంఁటిసె నణకించు
చలిజోదు నిరతంబు సంచరించు
సీలేరు సెలయేరు చిలిపిగా గలగల
కిలకిల నవ్వుచుఁ జెలఁగుచుండు

తే. గీ. గుండెధైర్యముఁబూనఁగఁ గొండలన్ని
లోతు మనమును దాల్చఁగ లోయలన్ని
విపుడు నుల్లాసమున నుండ నేరులన్ని
తెలుపుచుండును దమ రూపు కలిమిచేత.

**వే స వి స ం జ :**

సీ. ఇనుఁడస్తమించుచుఁ దన లేత కిరణముల్
గిరివెడల్ నిశిస్థైనఁ బరపెనఁగ
అవనియంత తమోమయమగును జెలంగు
గైరికా ధాతుల కాంతి యనఁగ
చలిబాదనుడుపంగఁజాలెదు మంటలన్
వనసత్త్వములుగూడి వైచెననఁగ
చీకటి పడుటచే శిఖరాగ్రదేవతల్
వెలిగించినట్టి దివ్వియలనంగ

తే గీ. పర్వతస్థిత కానన భాసమాన
గగనచుంబిత వృక్ష సంఘర్షణభవ
దారుణోజ్జ్వల తేజోహుతాశనుండు
దగ్ధమొనరింపఁ గన్పట్టు తరుల తీరు.

కొండ నెత్తమ్మునుండి కాంచినచో సీలేరు లోయ యందలి విద్యుద్దీపములు కన్పట్టు విధము :

సీ. మెఱపులా! యయ్యవి! మెఱపులేయైనచో
నిలకడ నొకచోట నిలుచుటెట్లు
చంద్రికలాయవి చంద్రికలైనచో
వరుసగాఁబంక్తులన్ బరగుటెట్లు
తారకలాయవి తారకలైనచో

నేరేరు రంగుల వెలుఁగుబెట్లు
వర [illegible] యని వరమణులైనచో
హెచ్చుతగ్గుల కాంతులీనుబెట్లు
తే గీ నిలకడగ నిలుచుట మెఱపులునుగావు
నిలబడి వెలుఁగుట జంద్రికలునుగావు
పలుంకపు రంగుఁను దారకలును గావు
ఘృణులు హెచ్చుతగ్గుల గుట మణులుగావు.

**సీ తే రు :**

ఉ లోతులఁజూచిచూచి కడులుబ్బతనువ్వతు లెక్కియెక్కి సం
పాత [illegible]ఁజెంది చెంది గుణవార మపారముఁగూర్చికూర్చ [illegible]
జాతులఁగూడికూడి దరసం కమణంబులఁ బొందిపొందిపల్
కైతల రీతి మార్పులనుగాంచి 'సీలేరు' వరించెగౌతమిన్

# నిర్వాణ షట్కము లేక 'శివోహమ్'

మూలము : శ్రీ శంకరాచార్య (ఆదిజగద్గురులు)

అనువాదము : శ్రీ దేశపతి గోపాలకృష్ణశర్మ

నేను మన మహంకారములుగాను సుమ్మ !
చిత్తమున్గాను కర్ణము, జిహ్వగాను
కన్నులున్ముక్కునేగాను, గానునంబ
రమ్ముధరయునుంగాను సుమి రమ్యతేజ
వాయువుల్గాను శివుడను, వాదమేల ? 1

సప్తధాతువుల్గానేను సరవిప్రాణ
సంజ్ఞమున్గాను, పంచసంఖ్యాజ్ఞవాయు
పంచ కోశములున్గాను, వాక్కుగాను
పాణిపాయుపస్థన్గాను, పరమశివుడ ! 2

రాగమున్ ద్వేషమును భోగలోభ
మదము మోహములున్లేవు, మత్సరమును
గాను పురుషార్థములు నేను, జ్ఞానమూర్తి
నయిన శివుడనై యన్నిట నమరినాను ! 3

పుణ్యపాపములున్గాను సౌఖ్యదుఃఖ
ములును మంత్రము తీర్థముల్ మున్నెగాను
వేదముల్ యజ్ఞముల్గాను నుదర పోష
ణార్థ మాహారము న్గాను నరయ భోక్త,
గాను, శివుడను చిన్మూర్తి గనగనేను ! 4

మృత్యువున్గానునేనొగి నిలనుదాని
భయములేనట్టి మృత్యుంజయాఖ్యనొప్పు
శంకనేగాను జాతియు చాటలేదు
తల్లి, దండ్రినిగానేను యెల్లిజన్మ
లేదునాకిక బంధుమిత్రాదిగురువు
శిష్యుడనురూపమేగాను, శివుడనేను ! 5

నిర్వికల్పుడనైయుందు, నిశ్చయముగ
నాకృతియెలేదు సర్వేంద్రియావ్త విభుత
లేదునాకెట్టిసంగతి, లేవు బంధ
ముక్తులున్గాడ ముక్తుడై ముదముగూర్చు
శివుడనేనుమ్మి చిన్మూర్తి శివుడనేను ! 6

(శంకరులకు స్వేచ్ఛానువాదము యథామూలమునునై యున్నది పై రచన)

# శిశిరములో (కవిత)

శ్రీ గజానన్ తామన్

శిశిర శైత్య దష్టతరూ
శీర్ణకోటి పర్ణావళి
పండి, పసుపు వన్నెనొంది,
రెండు నాళ్ళు రెమ్మలపై
వ్రేలి వేలి, గాలిసోక
తేల సందడించి, తుదకు
ప్రాంగణాల వన పథాల
రాలి తేలి పడుటఁజూచి
మన్ను గరచు మన బ్రతుకుల
మాట మదినిఁ దలచినాను.

జగతి నావహించె జడత;
జడత నాదు మానసాన
అహము గీయు వలయు మందె
అటుమటించు నాత్మగాన
కదల లేను మెదల లేను,
కదల లేవు నా ఊహలు.

వేమారులు విధిమనమ్ము
వేధించే పీడ వోలె.
నీడ వోలె నీవచ్చట
నిచ్చలు తిరుగాడుచుండ;
నైరాస్యపుగుడారాల
నాశ్రయించి నేనిచ్చట
పుష్పి చే నాగఫణుల
పొంకముఁ దిలకిస్తున్నా.

ఈనాటి రేయినో రాణి
ఈప్సితాల స్వప్నాలను
వృథాను రాగబంధాలను
వేర్చి బోగిమంటలలో,
బ్రతుకని యెడు నీ శాపము
బ్రతుకని యెడు నీ వ్యాధిని
కౌగలించి ఇరువురమీ
కాలమ్మును గడ్పింతము.



# మూడు చుక్కలు

శ్రీ హెచ్. హరిశ్చంద్రారెడ్డి

అసంపూర్ణానికి సంకేతం
...ఈ మూడు చుక్కలు
నేటి సమస్యలు...లెక్కలేనన్నివి
ఏమి అర్థంకానప్పుడు...ఏమో ?
నాలుకెఱిగిన రుచిని అక్షరాల్లో
వర్ణించడానికి భాషల్లో
...చాలా బాగుంది
"చాలా" అవ్యక్తం కానిది·
సాహిత్యంలో అక్కడక్కడా
శేషంగా మిగిలినవక్కడ...ఈ మూడు చుక్కలు
ప్రశ్నకు జవాబు అవ్యక్తం అయితే
ఇది...(మూడు చుక్కలు) సమాధానం.

రచయిత చెప్పలేని సమాధానం
మనసుకు మాత్రం గోచరం అయితే
...మూడు చుక్కలతో ముగిస్తాడు.
గొప్ప ప్రకృతి దృశ్యాన్ని కెమెరాలో ఇమిడ్చినట్లు
అంతుతెలియని వాటనన్నిటిని 1, 2, 3 చుక్కల్లో
చూపవచ్చు.

... ... ... ... ...

శూన్యానికి చిహ్నం...(మూడు చుక్కలు)
విత్తు మొదలా చెట్టు మొదలా...ఇది సమాధానం.
(...ఈ మూడు చుక్కల్ని సాహిత్యంలో
ఎందుకు ఉపయోగిస్తున్నామో చమత్కారంగా
చిత్రించడమే ఈ గేయ, వచన భావం.)



# నిరాశ నీడలో

**శవేరా**

జాలిలేని జీవుల నుండి
        జారిపోయిన జీవన నౌక
కల్లోల కడలిలో కన్నీటి తెరలతో
        పయనిస్తోంది

గరళ జ్వాలల్లా చీకటి కూకట్లు
        బీటవెట్టినవి మదిలో
కానన నీడల్లా శోకానల ధూమాలు
        వ్యాపించినవి చుట్టూ

ప్రళయకాల రుధిర ధారల్లా
        నిస్పృహ ప్రవహిస్తున్నది మస్తిష్కంలో
విషాదాశ్రు లహరులు భాగీరథీ స్రవంతిలా
        స్రవిస్తున్నవి అరుణ నేత్రాల్లో

విడారిలా బీడువారిన
        మమతల మాన్యంలో
మోహ లతలు మొలకెత్తుతాయని ఆశిస్తే
        మోసం చేసింది మాయ

ఆవేదన జంఝూపవనంలో
        ఆగలేదు తనూవల్లి
ఆక్రందన ఝరీ వీచికలో
        నిలువ లేదు ఆనందవల్లరి

భావక్షాళన శూన్యాంబర హృదిలో
        ఆశా తారలు తొంగి చూచేదెప్పుడు?
భరించలేని బాధాస్మృతుల
        చిహ్న పరంపరలు తొలగే దెప్పుడు?

ఏదీ శుక్లపక్షపు నక్షత్రేశుని
        వినూత్న దివ్య ద్యుతి మరీచీజాలం ?
ఈ పాపపంకిల తమో సామ్రాజ్యంలో
        ప్రవేశింప దేల ?

ఏవీ హిమాంశువు తుహిన
        సుధా సోనలు
నిశ్చేష్ట గాత్రోపరి భాగాన్నైనా
        సోక వేల ?

పరిహసిస్తుంది కృష్ణపక్షపు కారుమరుత్పథాన్ని
        కుదురు లేని కొంటె మనసు
పరాభ విస్తానంటుంది అగాధనిక్షిప్త బడబాగ్నిని
        పెల్లుబికే ఊహావలయం

ప్రచండ కిరణ ప్రసార మహీధ్రము
        మీద పడితే
దాటిపోవు దారి తెలియదు
        దాగుటకు చోటు దొరకదు

నిరాశ నీడలో నిరుత్సాహ విలయంలో
        నీరసించే నిర్భాగ్యు డింతే !
నింగిని చూస్తూ నికృష్టునిలా
        కృంగిపోవలసిందే !

*[మానవత చిందించే మహనీయ మూర్తియై
నా జీవిత కుసుమము కాలచక్రాన పడి
నలిగి పోకుండా కాపాడిన శ్రీ ఆర్. శ్రీరామ
రాజుగారికి అంకితము]*

# పంచపాత్ర

## కే ఎ స్వీ

(గత సంచిక తరువాయి)

ఆ మెనుగూర్చి ఆమె "నేను" అని కాకుండా "కైక" అనే రిఫర్ చేస్తూ రావడం వింతగా వున్నా నామటుకూ నాకు చక్కగా వున్నట్టే అనిపించింది. నాకేసి చూస్తూ నేవున్నా, తనకు తానే చెప్పుకుంటున్నట్టు చెప్పుకుపోతూనేవుంది కైక.

స్కూల్ ఫైనల్ పాసౌతూనే "ఇహ నువ్వు పెళ్ళిచేసేసుకు వెళ్ళు కైకా!–" అన్నాడు తండ్రి.

"నాకా ఇప్పుడే పెళ్ళా?–" అంది కైక.

కైక తండ్రి ఎన్నిందాలుగా చెప్పినా వినకుండా కాలేజీలో జేరింది కైక చదివుద్దరిద్దామని కైకకి లేదు కాని, చదువుదామని వుంది చదువుదామనీ కాదు, కాలేజీకి వెళ్దామని. అంటే–కాలేజీ జీవితంలో మాధుర్యం చవి చూద్దామని.

చదివించ గల ంత దీనస్థితీ హీనస్థితీకూడా కాదు కైకతండ్రిది. కాని, ఆడపిల్లల్ని చదివించి ఏం భరిస్తాడు చెప్పూ? మార్కెట్‌లో అల్లుళ్ళ రేట్లు పెట్రోలు ధరలకన్నా ఎక్కువగా పెరిగిపోతున్నాయి!! అందుచేత, కైకకు తెలీకుండానే కైకకని పెళ్ళిసమ్మంధా లోహవంక చూస్తూనే వున్నాడు కైక తండ్రి.

కాలేజీలో జీవిత మాధుర్యం చవిచూడాలని కదూ కాలేజీలో జేరింది కైక? కాలేజీలో ఆమె ఆ మాధుర్యం కాస్తా చవిచూడనే చూసింది. రంగురంగుల చీరెలు, వారానికి రెండు సినిమాలు, క్లాసులో అబ్బాయిలు, బోరుకొడితే కేంటీన్లు, బోరు కొట్టక పోయినా పార్కులు. ఇంకేం? జీవితం అంటే సుఖపడడం అనే నిర్ణయానికి కుమారి కైక రావడానికి ఆమాత్రం సదవకాశాలు సరిపోయేయి. నెలనెలా రెగ్యులర్‌గా మనియార్డర్ పంపడానికి ఎవరో వొకరు డాలిగాని, అట్లాంటి అభిప్రాయం ఈ జీవితంమీద కలగడం ఏమంత కష్టం?

గొప్ప రూపం లేకపోయినా మంచిరూపం వుందన్నాను కదూ కైకకి? ఇప్పుడీ జీవితంలో–కాలేజీ వాతావరణంలో – కైక అందం కొత్త మెరుగులు దిద్దుకుంది. రోజురోజుకీ కైకలో వొక కొత్త అందం మొగ్గ తెయ్యసాగింది. ఆ అందంవేసే మొగ్గలు పరాయి కళ్ళలో పడనే పడ్డాయి.

కైక కాలేజీ బ్యూటీ అయింది.

కాలేజీ బ్యూటీ కైకకి సహజంగానే చదువుడ్యూటీమీద శ్రద్ధ తగ్గింది.

సినిమాల్లో ప్రత్యేకం హిందీసినిమాలూ, అందులో ప్రత్యేకం హిమాలయా కాశ్మీర్–ప్రాంతాల్లో–డ్యూయెట్లుండే దృశ్యాలూ–ఇవంటే మక్కువ ఎక్కువైంది.

కుమారి కైక 70 మిల్లీమీటర్ల ఈస్ట్మన్ కలర్ కలలే గాని, మామూలు 35 మిల్లీమీటర్ల బ్లాక్ అండ్ వైట్ కలలు గనడం ఎప్పుడో మర్చిపోయింది.

పాపం, కైక తండ్రి మాత్రం చాలారోజులు బ్లాక్ అండ్ వైట్ లోనే వుండిపోయేడు.

దూరబ్బంధువులబ్బాయి వొకతను–గోపీ సుందరం అనేవాడు–వుద్యోగం కోసమని తనని ఆశ్రయించే సరికి వాడిమీదికి కెమెరా ఫోకస్ చేసేడు కైక తండ్రి.

గోపీ సుందరానికి తల్లీలేదు, తండ్రీలేదు. పెంచుకుంటూన్న మామయ్య చెప్పాపెయ్యకుండా వొక పుదయం ఆఫీసుకెళ్ళి అట్నుంచటే స్వరానికో, నరకానికోగాని–మొత్తానికి పరలోకానికి పయనం కట్టేడు. వొళ్ళంతా నోరేవున్న అత్తమ్మ–మొగుడుపోయిన ఆరోరోజు కల్లా–గోపీ సుందరాన్ని నానామాటలూ ("దరిద్రపుగొట్టు వెధవా!–నీవల్లే ఆయన ఆ గతి అయ్యేరు–"!!) అని–ఇంట్లోంచి వెళ్ళగొట్టేసింది. తెగిన గాలిపటంలాంటి గోపీసుందరం ఎండీ ఎండని చెట్టులాంటి కైక తండ్రి ఇంటికొచ్చి చిక్కుకున్నాడు.

చిక్కుకోవడమంటే – చిక్కించుకున్నాడు కైకతండ్రి!

కు రాడు ని రగా, బు రగా వున్నాడు. గుణానికి మంచివాడే! చెప్పినట్ట్లా వింటాడు. ఏదో నౌహా వుద్యోగం చూసి పెడితే ఇంట్లోనే పడుంటాడు. అన్నట్టు–గోపీసుందరం కైకమ్మకి ఈడూ జోడూ కూడాను!

కుర్రాణ్ణి కూతురికిచ్చి పెళ్ళిచెయ్యాలనుకోవడం దురుదేశమేం కాదు గద! అందుచేత – సకల సదుద్దేశాలతోనూ గోపీ సుందరాన్ని ఇంట్లో వుంచుకుని ఆదరించి అతడి కోసం వుద్యోగాలు వెదకసాగేడు కైక తండ్రి.

అంతట్లోకి వొకసారి పరీక్షలానంతరం శెలవులో ఇంటి కొచ్చింది కైక. వొచ్చి గోపీసుందరాన్ని చూసింది. అతన్ని ఇంట్లో వుంచుకోవడంలో తండ్రి వుద్దేశం ఆమెకు అర్ధమై పోయింది. కైక అమాయకురాలు కాదు. అయినా – అమాయకంగానే వుండిపోదలచ లేదు.

గోపీ సుందరం కూడా పాపం కైక తండ్రి అనుకున్నంత అర్భకుడేం కాదు.

కనీసం కైక అనుకున్నంత అర్భకుడు కూడా కాడతను.

అతను తొలి తొలి ప్రయత్నాల్లో వుండగానే ఆ విషయం కైక కని పెట్టింది–

"ఏం కని పెట్టేరు మీరు?" అని అడిగేను.

తమాషాగా చూసింది కైక–"డోంట్ బీ సిల్లీ...మీరూహించ గలరు–"

"గలను కాని–మీరు పూర్తిగా చెప్తే–"

"ఇంతకంటే పూర్తిగా–ఇంకేమీ చెప్పను–"

"సరే-కానివ్వండి–"

"మీరింకో సిగిరెట్టు వెలిగించండి......రింగులు రింగులుగా పొగ వదల్లేరూ మీరు?"

"వూహూ–వొదల్లేను–కథ చెప్పండి–మీ కథ–"

"మీరు రింగులు రింగులుగా పొగ వదిల్తే బాగుణ్ను–ఇహ నైనా నేర్చుకోండి–సరే–ఎక్కడున్నాం?–"

"నా రూంలో–"

"అది కాదు-కథెక్కడుంది?-"

"చెప్పినంతవరకూ నా మెదళ్ళో- అదీమా ప్లస్ ఇక చెప్ప బోయేదీ మీ మెదళ్ళో–"

"అదికాదు బాబూ! కథ చెబుతూ ఏ ఘట్టంలో ఆగేను?"

"అతను తొలి తొలి ప్రయత్నాల్లో వుండగానే ఆ విషయం కైక కని పెట్టింది–"

పోగొట్టుకున్న కాణీ దొరికిన స్కూలు పిల్లలా ఆనందంగా నవ్వింది కైక.

–ఆ–అతను తొలితొలి ప్రయత్నాల్లో వుండగానే ఆవిషయం కైక కనిపెట్టేది. ఇహ అడ్డు ప్రశ్నలేవీవెయ్యకుండా వినండి, ఏం?–ఆ కనిపెట్టిన కైక ఏం చేసింది? గోపీ సుందరాన్ని ఎంత దూరంలో వుంచాలో అంత దూరంలో వుంచింది. ఆమెకు మా తం లోపల్లోపల గోపీసుందరమంటే అదోలాంటి అభిమానం లేకపోలేదు. కాని, దాన్ని ఆమె బైట పెట లేదు. బైట పెడితే తను చులకనై పోతుంది. ఏదైనా సహిస్తుంది గాని, వొక అబ్బాయికి తను చులక నైపోవడం మాత్రం సహింపజాలదు కైక.

శెలవులైపోయి మళ్ళీ కాలేజీకి వెళ్ళాలి వొచ్చేసరికి కైకకు మనసు దిగులుగా అయిపోయింది. కారణం తెలియని (!) గుబులు ఎవ్వరితోటీ చెప్పుకునేదీ కాదు!

"నేనేపు టౌను కెళ్ళున్నా–" అంది కైక గోపీ సుందరంతో

గోపీ సుందరం ఏమీ మాట్లాడలేదు:

అప్పుడు కైక తండ్రి ఇంట్లో లేడు.

"–మళ్ళీ ఇంకో నాలుగు నెళ్ళకి–" అంది కైక. గోపీ సుందరం ఏమీ మాట్లాడకుండా వుండేసరికి ఆమెకి కొంచెం విసుగు కూడా వొచ్చింది. "అదోలా వున్నావు సరే–నే వెళ్ళాలే-" అని కదిలింది కైక.

"కైకా!–" అన్నాడు గోపీసుందరం. కళ్ళలో కోరికతో ఆమె దగ్గిరి కొచ్చేడు "నువ్వివాళ ఎంతో అందంగా వున్నావు!–" అన్నాడు......

"ప్చ్!–" అని చప్పరించేన్నేను. ఏవిటో వెధవది చప్పరించడం అలవాటైపోయింది.

"అదేవిటి?" అంది కైక.

"కైక తనజా గత్తలో తనుండి గోపీసుందరాన్నితగుమా తం దూరంలోనే వుంచిందీ–అని ఇందాట్నా అన్నారు. మళ్ళీ ఇదేమిటి?... ఈ రొమాన్స్ సీను..."

"ఏం మీ పాఠకులకి రొమాన్స్ సీను సరిపడదా?..."

"పాఠకులకి సరిపడవచ్చునేమో......నేను...ర యిలేను"

"అయితే-కట్‌చేసి మిగతా చెప్పమంటారా ?-"

"వొద్దు. వర్ణన తీసేసి వాస్తవం మాత్రం చెప్పేసెయ్యండి"

"వాస్తవాలు రాస్తే చిక్కుల్లో పడతారు-" అని మళ్ళీ చెప్ప నారంభించింది కైక-

—రచయితగా మీరూ కంగారు పడక్కర్లేదు — మీ పాఠకులూ కంగారు పడక్కర్లేదు. ఆరోజు కైక సుందరాన్ని వుంచాల్సినంత దూరంలోనే వుంచింది. అయితే రెండో మూడో ముద్దులు పెట్టు కోనిచ్చింది. కౌగిలించుకోనిచ్చింది. కాని, అంతే!... ...

"ఆడవాళ్ళు చెడిపోతున్నారు-" అన్నాను.

"ప్లీజ్...అడ్డురాకండి-" అంది కైక సీరియస్‌గా. మళ్ళీ కథనం కొనసాగించింది.

—మరుసటిదినం కైక టౌన్ కెళ్ళిపోయింది. క్లాసులు చండ ప్రచండంగా జరుగుతున్నాయి. పరీక్షలు తోసుకొస్తున్నాయి.

కైకకిమాత్రం మనసు మనసులోలేదు. మనసు స్వంత వూళ్ళో, స్వంత ఇంట్లో, గోపీ సుందరం దగ్గర మరిచిపోయి వొచ్చేసింది.

కాలేజీలో స్టూడెంటు కుర్రాళ్ళని చూసేకొద్దీ కైక మనసు గోపీ సుందరానికేసే లగసాగింది. చదువులేదు అతనికి. డబ్బు లేదు. అవకాశాల్లేవు. మంచి బట్టల్లేవు, ఇవన్నీ సుందరానికే గనకవుంటే మన్మథ మన్మథుళ్ళాగే తళతళలాడిపోను. ఏమిటో విధి కృతం. చవట సన్నాసుల్లూ, జిడ్డు ముఖాల మొద్దులూ కాలేజీల్లో చదివి పారేస్తు న్నారు. అంత చక్కటి గోపీసుందరం కాలేజీ మెట్లు కూడా ఎక్కక పోవడం ఎంత అన్యాయం!

కైక ఇలా అనుకుంటూ వుండగానే స్వంత వూర్నుంచి వుత్తరం వొచ్చింది. కైక తండ్రి కైకకి రాసిన వుత్తరం కాదది. గోపిసుందరం కైకకి రాసిన వుత్తరం! కొట్టుకునే గుండెల్తో వుత్తరం తెరిచి చదువుకుని గొప్పసంచలనానికి గురయింది కైక.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు కాదంటే బ్రతకలేను. వెంటనే నువ్వు వుత్తరం రాయి. లేకపోతే చచ్చిపోతాను.

—అదీ వుత్తరం సారాంశం.

వుత్తరం రాయకపోతే చచ్చిపోయేంత ప్రేమోన్మాదంతో గోపీ సుందరం వుంటే-అతణ్ణి ఎంతో కొంత (అతన్లో ఏం చూసైనా కావొచ్చు)అభిమానించిన కైక—వుత్తరం రాయకుండా ఎలావుంటుంది?

రెండ్రోజులకో వుత్తరమే రాసేదో, రోజుకోటి రాసేదో, పూటకోటి రాసేదో-మొత్తానికి తండ్రి పంపే డబ్బులో చెప్పుకో దగినంత — పోస్టేజికింద ఖర్చు పెట్టింది కైక.

గోపీసుందరం కవి అనుకోవడానికి వీలేమీలేదు. కాని, ఆడ పిల్లకి వుత్తరాలు రాసేప్పుడు అంతో ఇంతో ఆ పైత్యం కూడా కలబోసి పంపని వాడెవ్వడు ?

కైక సహజంగానే వూహాల మనిషి. వూహాలు కాగితం•మీదికి దొర్లడానికి ప్రేమలేఖల్ని మించిన అవకాశం ఎక్కడిది?

శరపరంపరగా కైకకీ గోపీసుందరానికీ మధ్య వుత్తరాలు నడిచేయి. నడవడమేమిటి? ఎగిరేయి!

అయితే ఈ వుత్తరాయణం గురించి కైక తండ్రికి తెలుసా?

తెలుసనడానికి ఆధారాల్లేవు. తెలీదనుకోవడానికి అవకాశాల్లేవు. తెలివైనవాడు, లేదా-తను తెలివైన వాడేనని అనుకునేవాడు — కైక తండ్రి. చూసీ చూడనట్టు వుండడం మంచిదనే నిర్ణయానికి వొచ్చేడు.

ఎలాగైనా-తన పరీక్షలైన తర్వాత గోపీసుందరాన్ని పెళ్ళాడే సెయ్యొచ్చు ననుకుంది కైక.

కైక తండ్రీ అలాగే అనుకున్నాడు.

కాని, గోపీసుందరం అలా అనుకున్నట్టు కనిపించలేదు.

కైక తండ్రి ప్రయత్నాల వల్ల వొక వుద్యోగం దొరకగానే అతను తనదారి తాను చూసుకున్నాడు. కైకను పెళ్ళిచేసుకుంటే — కట్నంరూపేణా తనకి చిల్లిగవ్వ దక్కదని అతనికి తెలుసు, కైక అందమైనదే! కాని, అందం కొరుక్కు తింటామా ? డబ్బుతో కూడా రాని పక్షంలో—అందమైనభార్యయినా సరే అతనికి అక్కర్లేదు. ఇరవైవేల కట్నంతో వొక సమ్మంధమొచ్చేసరికి మరో ఆలోచన లేకుండా వొప్పేసుకున్నాడు గోపీసుందరం.

రాత్రింబవళ్ళూ హోరాహోరీగా చదివి తోచిందల్లా పరీక్షల్లో రాసేసి (!) బోనునుంచి బైటపడే పక్షిలా ఇంటికొచ్చి వాలింది కైక. తీరా చూసేసరికి ఇల్లంతా చీకటిగావుంది.

"వచ్చేవా కైకా ?-" అని నీరసంగా అన్నాడు కైక తండ్రి సాయంత్రమై చాలాసేపు దాటినా గదిలో దీపమైనా వెయ్యకుండా కూచున్నాడాయన.

"ఏవిటినాన్నా-ఏమైందీ?-"అంది కైక-అయోమయంగా అంటూ లైటు వేసింది. తలపట్టుక్కూచున్న తండ్రి కనిపించేడు.

మేజామీద పెళ్ళి పత్రికొకటి కనిపించింది.

వరుడిపేరు గోపీసుందరం. వధువు పేరు కనకలక్ష్మీకాంతం,

కైకకి లోకం చీకటై పోలేదు గాని మసకబారింది. ఆమెకు ఏడుపు రాలేదు కోపమొచ్చింది, కాని. ఆకోపంతో ఆమెగాని; ఆమె తండ్రిగాని—గోపీసుందరాన్ని ఏం చెయ్యగలరు ?

పెళ్ళిపత్రిక పంపాడేగాని మళ్ళీ కైకకేసిగాని కైక తండ్రికేసి గాని తిరిగి చూడలేదు గోపీసుందరం కొత్త వుద్యోగం - కొత్త సంసారం-కనకలక్ష్మీకాంతంయొక్క భర్తహోదాలో ఇల్లరికపుటల్లుడుగా అతను అత్తగారి వూళ్ళోనే వుండిపోయేడు.

వొకరాత్రంతా నిద్రలేకుండా పక్కమీదే పొర్లుతూవుండి ప్రొద్దున్నే స్నానాల గదిలో బాయిలరో గోపీసుందరం తనకి రాసిన అందమైన వుత్తరాలన్నిటినీ దఖలుపరిచి బరువు తీరినట్టు నిట్టూర్చింది కైక.

"పోనీలే కైకా—దిగులుపడకు—తొందర్లో ఏదోవొక సమ్మంధం చూసి-చేసేస్తాను—" అన్నాడు కైక తండ్రి.

"మనసు బాగులేదు నాకు. ఇప్పట్లో పెళ్ళొద్దు —" అని దృఢంగా జవాబు చెప్పింది కైక.

మరో నెల రోజులకి కైక పరీక్షల రిజల్ట్సు వొచ్చేయి. కైక పేసయింది.

అటుచేసి ఇటుచేసి తండ్రిని వొప్పించి — యూనివర్శిటీ కాలేజీలో ఎం. ఏ. లో చేరింది కైక.

"కథ దాదాపు ముగిసినట్టుంది—" అన్నాను.

"కథలా కనిపించే జీవితం యిది—" అంది కైక. "ఏం — విసుగ్గావుందా ? మీకు బోర్ కొడితే చెప్పండి—వెళ్ళిపోతాను—"

"కథలో కొత్తదనంలేదు—" అన్నాను.

"జీవితం అలావుంది —" అని, నన్ను లక్ష్యపెట్టకుండా — కైక కథ చెప్పడం సాగించింది కైక.

—గోపీ సుందరాన్ని మరిచిపోవడం కైకకి కష్టమేమీకాలేదు. కాలేజీనుంచి యూనివర్శిటీకి వొచ్చింది కదూ...వాతావరణం మారింది —పరిచయాలేర్పడ్డాయి—స్నేహాలు పెరిగేయి, గోపీసుందరం జ్ఞాపకం మెల్లిమెల్లిగా ఫేడౌట్ అయిపోసాగింది.

అంతలో వొక గమ్మత్తు జరిగింది.

కైక చెల్లెలు—స్కూలు ఫైనలు మూడుసార్లు తప్పి ఇంట్లో కూచున్న తెలివిమంతురాలు—వాళ్ళ ఎదురింటబ్బాయిని గుట్టు చప్పుడు కాకుండా ప్రేమించేసింది. పెళ్ళంటూ చేసుకుంటే కైక చెల్లెల్నే చేసుకుంటానని ఆ అబ్బాయి ప్రతిజ్ఞచేసి పారేసేడు. అతను వాళ్ళ తల్లిదండ్రులకి వొక్కడే సుపుత్రుడు, వంశోద్ధారకుడు. మరతని-మాట ఏం చెప్పీ కాదన జాలక వాళ్ళు వాళ్ళొచ్చి కైక తండ్రితో మాట్లాడి-పెళ్ళికి వొప్పించేరు.

కట్నం కాణీ అయినా లేకుండా ఆ రకంగా కైకచెల్లెలి పెళ్ళి సలక్షణంగా వాళ్ళ ఎదురింటబ్బాయితో జరిగిపోయింది.

తను వొంటిగా వుండగానే తన చెల్లెలు తన కళ్ళముందే వొక యింటిది (ఎదురిల్లే అయితేనేం ?) అయిపోవడం చూసి కైకకి పూర్తిగా మతిపోలేదు గాని దాదాపు అంతపనే అయింది.

జీవితంలో తొలిసారిగా ఆమెకు తన అంద చందాలమీద నమ్మకం సడలిపోజొచ్చింది.

"కైక కూడాఎవరో వొకర్ని ప్రేమించి-ప్రేమింపజేసుకుని — పెళ్ళిచేసుకుంటే బాగుణ్ను—" అనుకున్నాడు కైక తండ్రి.

ఆ సంగతి కైక గ్రహించకపోలేదు.

గ్రహింపువల్ల పనులు జరగొచ్చుగాని, గ్రహించడమే పని జరగడం కాదుగద !

యూనివర్శిటీకి తిరిగొచ్చేసింది కైక.

కైక తండ్రి వొకవేపు చవక సమ్మంధాలు వొస్తయ్యేమోనని చూస్తూనే వున్నాడు.

చదువుమీద బుద్ధి నిలవలేదు కైకకి. మెదడు శూన్యమై పోయింది. మనసులో నిశ్శబ్దంగా ఏదో తుపాను. ఏదో కలవరం.

ఎం. ఏ. తొలి సంవత్సరం పరీక్షలు రాసేసొచ్చింది కైక. ఆరేడుగురు అబ్బాయిలన్నా వొచ్చి కైకతో పెళ్ళిచూపుల తతంగాలు జరిపి వెళ్ళేరు. పాపం, కష్టపడే జరిపించేడు కైకతండ్రి. కాని ఏం లాభం ? వొకటీ అతికేట్టు కనిపించలేదు.

"అమ్మాయి మరీ ఫేషన్‌గావుంది-" అని మూతి ముడిచింది వొక అబ్బాయి తల్లి, "అవును- మరీ- ఇంత ఫేషనా ?-"అని పలికేడు ఆ అమ్మకూచి.

'యాభైవేలు-" అని ధర చెప్పేడు వొక అబ్బాయి తండ్రి.

వొక సమ్మంధం దాదాపు కుదిరినట్టే అనిపించి లాంఛనాల ప్రస్తావన దగ్గిర అనవసరంగా మాటామాటా పెరిగి అదీ చెడింది.

"అమ్మాయి నాకు నచ్చింది, నేను చేసుకుంటాను-" అని చెప్పిన వొకబ్బాయి-కట్నం గురించి మాట్లాడుతు — "వూహుఁ— నేను కట్నం తీసుకోకూడదనుకున్నాను, తీసుకోను కానయితే నేను ఆఫీసుకీ ఇంటికీ తిరగడానికి నాకో కారు కావాలి. కొత్త అంబాసిడర్ వొకటి కొనిపెట్టండి చాలు — మీ అమ్మాయిని చేసుకుంటాను-" అన్నాడు

కారు సమ్మంధానికి తూగలేకపోయేడు కైక తండ్రి.

కైకకీ పెళ్ళిచూపుల తంతుతో విసుగెత్తిపోయింది. వొకటీ కుదరక పోవడం మాట అటుంచి-వొచ్చేవాళ్ళలో కనీసం వొక్క మొఖమైనా కాస్త తేటగా లేకపోవడం ఆమెకు చాలా అనీజీగా అనిపించింది. "ఛీ! మొద్దు మొహాలు — వీళ్ళెవర్తోటీ కుదరకపోవడమే మంచిదయింది - వీళ్ళతో సంసారమా- బాబోయ్ " అని పెళ్ళిచూపులకొచ్చిన అనాకారి అబ్బాయిల్ని తిట్టుకుని, ఎవర్తోనూ పెళ్ళికుదిరిపోనందుకు సంతోషించి, తనని తాను వూరడించుకుంది. "సమ్మంధాలని చెప్పి నన్ను మాటి మాటికీ-ఇంటికి పిల్చి ఈ పెళ్ళిచూపుల ఫార్సు జరిపించకు నాన్నా—అంతగా కుదురుతుందని తోస్తే — నువ్వే ఏ సంగతి వొకటి నిశ్చయం చేసెయ్యి—" అని చెప్పి మళ్ళీ యూనివర్శిటీకి వచ్చేసింది

ఎం. ఏ. రెండోసంవత్సరం పట్టుబట్టి శ్రద్ధగానే కొన్ని దినాలు చదివింది కైక. కాని ఆశ్రద్ధ కొన్ని దినాలకంటె నిక్కువ ఆమెలో నిలువలేదు.

కైక వాళ్ళ క్లాసులోనే యస్. గోపాలం అని వొకకుర్రాడుండేవాడు. అతన్నందరూ సుందరగోపాలమని పిలిచేవారు. యస్. గోపాలం సుందరుడే. మెత్తగా వుండేవాడు, ఎర్రగానూ వుండేవాడు. అతనిలో నాజూకు అధికం. ఆడతనపు నాజూకు. ఆడపిల్లల్ని ఆకర్షించే నాజూకు.

కైకకి చదువుమీద దృష్టి చెడడానికి కారణం యస్ గోపాలం ఆ సంగతి మొదట కైకకే తెలీదు. తెలిసేక ఆశ్చర్యపోయింది. అప్పుడో గోపీసుందరం అలా ఆశపెట్టేడు, వెళ్ళిపోయేడు. ఇప్పుడీ సుందర గోపాలంమీద ఆశలెలా పెంచుకోవడం ?

వూహుఁ — ఆశలు పెంచుకోదలచలేదు కైక. అతనో మాటాడనైనా లేదు. అతన్ని గురించి తన స్నేహితురాండ్రతో ప్రసక్తిగానైనా ప్రస్తావించలేదు.

కాని, వొకసారి పండగ శెలవుల్లో వూరికెళ్ళిన కైకకి హఠాత్తుగా వొక విచిత్రమైన వుత్తరం వొచ్చి ఆమెను వొక్కసారిగా ఆనందపరచి అంతులేని ఆశల్లో ముంచేసింది. కైక కొచ్చిన ఆ వుత్తరాన్ని వొక్క కైకే గాక కైకతండ్రి చదివేడు, కైక చెల్లెళ్ళు చదివేరు. ఆ వుత్తరంలో ఇలావుంది—

కుమారి కైక గారికి—

మీ క్లాస్‌మేట్ యస్. గోపాలం మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు.

అతి గాఢంగా ప్రేమిస్తున్నాడు.

కాని, అతనిదొక వింత ప్రవృత్తి. తను మిమ్మల్ని ప్రేమించే విషయం మీకు చెప్పడానికి జంకుతున్నాడు.

అతనంటే మీకు ఇష్టమైతే-బహుశా మీరిద్దరూ పెళ్ళాడవచ్చు.

ఇట్లు
ప. పా.
(పరోపకారి పాపన్న)

కైక ఇంట్లో ఆ వుత్తరమ్మీద చాలా చర్చ జరిగింది. పపా ఎవరో అంతుపట్టలేదు. యస్. గోపాలమే వుత్తరం అలా రాయించేడా ? అతనంత పిరికివాడా ? లేక, ఇదంతా ఇంకెవరైనా నవ్వులాటకి చేస్తున్నారా ? ఏదీ అంతుబట్టలేదు.

కైకతండ్రి మనసులో ఏదో ఆశ తళుక్కుమంది. "అతన్నో సారి మన ఇంటికి రమ్మని రాయమ్మా !... ..." అన్నాడు. తండ్రి

ఆలోచన కైకకి అర్థమయింది కైక అంత అమాయకురాలేం కాదు. వెంటనే వుత్తరం రాసింది

శ్రీ యస్. గోపాలంగారికి—

మానాన్నగారు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు. వెంటనే వొకసారి మావూరొచ్చి వెళ్ళండి.

—కైక.

వుత్తరం పోస్టు చేసిన మరుసటి క్షణం నుంచే (!) యస్ గోపాలంకోసం ఎదురుచూడ్డం ప్రారంభించింది కైక. మరుసటి దినంకూడా రాలేదు గోపాలం (!). ఆ తర్వాత మూడు దినాలు వరసగా ఎదురుచూసినా గోపాలం వొచ్చే జాడలేదు. నాలుగోరోజున వుత్తరం వొచ్చింది. యస్. గోపాలం వుత్తరం.

"కుమారి కైకగారికి—

నమస్తే !

మీ వుత్తరం చూసి నేనెంతో ఆశ్చర్యపోయి, నమ్మలేక పోయి—అది ఆసలు నాకు రావాల్సిన వుత్తరమేనా అని కవరు మీది అడ్రెసు వొకటికి రెండుసార్లు సరిచూసుకున్నాను. మీరు నాకు వుత్తరం రాయడం ఏమిటని ఇంకా సందేహంలోనే వున్నాను. రమ్మని రాసేరు. ఎందుకో ఏమిటో రాయలేదు. అంతా గందరగోళంగా వుంది నాకు గొప్ప సస్పెన్స్‌గా వుంది. వివరాలు రాస్తే- అవసరమైతే రావడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

చిత్తగించండి,
యస్. గోపాలం.

బాగా వేడెక్కిన చిమ్నీమీద నీటిబొట్టు పడినట్టయింది కైకకి. కైక తండ్రికి్కూడా ఏమీ తోచలేదు. "ఆ వుత్తరం అతను రాయించలేదేమో!......సరే—ఎందుకేనా మంచిది—అసలు విషయం ఇదీ అని అతనికో వుత్తరం రాయి.. మనిషన్నా ఎదురుపడితే నిజానిజాలు కొంతవరకైనా తెలుస్తాయి—" అన్నాడు కైక తండ్రి.

పాపా వుత్తరం మడిచి కవర్లో పెట్టి, దాంతోబాటు ఇంకో వుత్తరం రాసి యస్. గోపాలానికి పోస్టు చేసింది కైక. తిరుగు టపాలో వచ్చేడు గోపాలం. కైకా, కైకతండ్రీ, కైక చెల్లెళ్ళూ అందరూ ఆనందించేరు.

కైక తండ్రి యస్. గోపాలానికి చెయ్యాల్సిన మర్యాదలన్నీ చేస్తూనే అతని ఆంతర్యం ఏమిటో కనిపెట్టడానికి ప్రయత్నించేడు. కాని—ఏదీ నికరంగా తెలీలేదు.

"ఆ వుత్తరం మీరు నన్ను రమ్మనడం—అంతా గమ్మత్తుగా వుంది-" అన్నాడు గోపాలం. "అలా జరిగినందుకు నాకూ బాధగావే వుంది—" అన్నాడెందుకో,

"బాధెందుకూ?" అని సందేహంలో పడ్డాడు కైక తండ్రి. "ఆ— దానికేముంది లెండి—అప్పుడు లేకపోయినా—ఇప్పుడు మీ మనసులో ఏదైనావుంటే...ఆలోచిద్దాం......కాని, మా స్థితి మా తంఇంలే-"అంటూ తను ఇంకా ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాల్సివున్న పరిస్థితీ, ఎవ్వరికీ కట్నంగా ఏమీ ఇవ్వలేని తను అశక్తతా, అన్నీ వివరించేడు. "అయితే—మర్యాదకి మాత్రం ఏమీ లోటు రానివ్వన్లేను—" అన్నాడు చివరగా.

ఆ మాటకి నవ్వేడో, ఇంకెందుకు నవ్వేడోగాని—నవ్వేడు యస్ గోపాలం.

కర్టెన్ వెనుకనుంచి ఆ నవ్వు చూసిన కైకకి చెప్పరాని ఆనందంతో తనువు పులకరించింది.

"చూద్దాంలెండి—మా వాళ్ళతోనూ ఆలోచించాలి-" అన్నాడు యస్ గోపాలం.

"తప్పకుండాను, పెద్దవాళ్ళతో చెప్పకుండా మాత్రం ఏ పనీ చెయ్యకూడదు మీరు-" అన్నాడు కైక తండ్రి అర్థవంతంగా.

మంచి బాలుడు రాముడిలాగా అందరి దగ్గరా శెలవు తీసుకుని నిష్క్రమించిన యస్. గోపాలాన్ని చూసి ఎంతో ముచ్చటయింది కైకకి.

ఇతను నన్ను చేసుకుంటాడా?—చేసుకుంటే!...

చేసుకోకపోతే?......

టౌనుకు మళ్ళీ వొచ్చేక యస్. గోపాలం కలవరమే వదలకుండా పట్టుకుంది కైకని. గోపాలం క్లాస్‌కు మామూలుగా వొచ్చేవాడు క్లాసునుంచి మామూలుగా వెళ్ళేవాడు.

ఈ దొంగాటకం భరించలేకపోయింది కైక.

తెగించి తనే అడుగుముందుకు వేసింది. టెలిఫోన్ కాల్స్, ... ఉత్తరాలు, లైబ్రరీలో గుసగుసలు, క్యాంటీన్‌లో మంతనాలు, ... సినిమాలు......

"ఇహ చెప్పకండి చాలు—" అన్నాను.

"ఏం?—"

"అర్థమైంది"

"ఏమిటర్థమైంది గోంగూర—"

"జరిగిందేమిటో అర్థమైంది- మీ ముఖ కవళికల వల్లే-" అన్నాను.

"ఏం లేదు-" అంది కైక దబాయింపుగా, బుకాయింపుగా.

"...ఎంతగా పాత్రలకి దాసోఽహమంటున్నా నేనూ ఒక కథ కున్నే......ఒకదినం సాయంత్రం కైక తన వూరికి ప్రయాణమైంది బస్ స్టేండ్‌లో హఠాత్తుగా యస్. గోపాలం కనిపించేడు: ఇప్పుడేం వూరికెళ్తావ్-సినిమా చూసి పోదూలే రమ్మని పిలిచేడు, సరేనంది కైక. ఇద్దరూ సినిమా చూసేరు. వూరికెళ్తున్నానని రిజిస్టర్‌లో రాసి హాస్టల్‌నుంచి వచ్చేనుగా-ఇప్పుడెలా-అంది కైక. లాడ్జిలో రూం తీసుకుంటే పోలా?-అన్నాడు యస్. గోపాలం. ఒప్పుకోలేదు కైక. కాని, ఒప్పుకోక తప్పేదేముంది? రూం తీసుకున్నాక-ఈ రాత్రిలో ఇహ నేను మాత్రం మా హాస్టల్‌కేం వెళ్తాను-అన్నాడు గోపాలం-"

"చాలు- ఆపండిహ-గోపాలం ఆ మాట అనలేదు-"

"వెరీ గుడ్-అయితే అంతవరకూ జరిగిందంతా మాత్రం నిజమేనన్నమాట...సరే-గోపాలం ఇంకేమాట అన్నట్టూ? కైక అతడికేమీ అడ్డుచెప్పలేదూ?-"

వున్నట్టుండి కైక ముఖం ఎర్రబారిపోయింది. చేతుల్లో ముఖం దాచుకుంది. లజ్జవల్లా, అవమానంవల్లా ఆమె గొంతు శూన్యంగా ధ్వనించింది-"ఇహ చాలు-ఇహచాలు-నా కథ-అయిపోయింది-"

గ్లాసుతో మంచినీళ్ళు అందించేను. "అయామ్‌సారీ! రియల్లీ వెరీ వెరీ సారీ!-పేకిటీజీ-" అన్నాను.

మంచినీళ్ళు తాగింది కైక. చాలాసేపటికి తేరుకుంది.

ఆమెను గురించే ఆలోచిస్తూ కొత్త సిగిరెట్టు వెలిగించేను.

ఆమెపట్ల సానుభూతీ, జాలీ నాలో క్షణక్షణానికీ అధికమౌతున్నాయి.

అన్నిటికన్నా ఆమె నిష్కపటం నాకు బాగా నచ్చింది.

"చెప్పండి సార్! రచయిత ఆనందరావుగారూ!...... నా కథ మీరు నవలగా రాయగలరా?..."

"ముగింపు లేదు-"

"మీరు కల్పించలేరూ?-కావలిస్తే-నన్ను చంపెయ్యండి-"

వింత కోరికగా అడుగుతోంది నా పాత్ర-తనని చంపెయ్యమని!

"ఎలా చంపడం?..."

"హత్య, ఆత్మహత్య, యాక్సిడెంట్-"

"అవునింతకీ యస్. గోపాలం ఇప్పుడెక్కడున్నాడు? అతను కైకను పెళ్ళెందుకు చేసుకోడు?-"

నా ప్రశ్నతో గంభీరంగా మారిపోయింది కైక.

శూన్యంగా చూసింది.

శూన్యంగా నవ్వింది.

"యస్. గోపాలం కైక జీవితమ్మీద పెద్ద దెబ్బ కొట్టేడు. లాడ్జిలో ఆ సంఘటన తర్వాత సిగ్గువిడిచి తనని చేసుకొమ్మని అడగసాగింది కైక. ఆ సాకులూ ఈ సాకులూ చెప్పేడు. యాభైవేల కట్నం లేనిదే మా నాన్న ఒప్పుకోడన్నాడు. ఆ తర్వాత-నే నెంతకీ నా ప్రయత్నాలు మానకపోయేసరికి-చివరికేమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?-"

"గోపీసుందరంతో నువ్వు నడిపిన గ్రంథం తెలిసి కూడా-నన్నెలా చేసుకొమ్మంటావ్?-అన్నాడు-"

"గాడ్! అతనికెలా తెలిసింది? ఎప్పుడు తెలిసింది?-"

"ఎప్పుడో తెలిసిందతనికి. ఎలాగైతేనేం? తెలిసింది! తెలుసుకుని పథకం వేసేడతను-అందితే ఆఘ్రాణించి చూద్దామనుకున్నాడు-ఆ పరోపకారి పాపన్న పుత్తరం-అతనే రాయించేడు-" కైక గొంతు దుఃఖంవల్లా, బాధవల్లా రుద్ధమైపోయింది.

(ఇంకావుంది)

# దుర్గా స్తోత్రము

## శ్రీ అరవిందులు

### (శ్రీ అరవిందుల బెంగాలీ రచనకు సంస్కృతానువాదము)

### శ్రీ భాష్యం విజయసారథి

★ మహాదేవ సంవిస్మయాకాశ రాకా
సుధా ధవళరూపే ! విరూపాక్షి ! దుర్గే !
జగత్ప్రాణశక్తే జయానంత శక్తే !
జయానంత శక్తిప్రదే సింహవాహే.

★ త్రిశూలోగ్రధారా హతా శేషరక్షః
పిశాచే మహాసింహ వాహే సుభాహో
అపాయా దముష్మాత్ పరిత్రాతు మస్మాన్
సమావిర్భవ త్వం పునర్భారతే ఽంబ !

★ నిశాతాట్టహాస స్ఫుటద్రోహి వక్షః
స్ఫుటే కంఠమాలీ స్రుతద్వ్యట్కరోటే
విమాకి కృతాన్ దుర్భయభ్రాంతచిత్తాన్
మహా సంకటాన్నశ్శివే పాతుమేహి.

భవచ్ఛక్తి లేశాంశజాతా ఉదారే
వయం భారతే, ప్రార్థనాం కుర్మహేతే
స్వధర్మే విధాతుం రతాన్మాతరస్మాన్
సమావిర్భవత్వం పునర్భారతేఽస్మిన్.

యుగేవా యుగేవా గతా జన్మనారం
భవేవా భవేవా క్రియాస్తే విధాయ
తతో ఽ మందమానంద ధామాప్నుమస్తే,
తథైవాధునా కార్య జాతం విధాతుమ్.

వయం దీక్షయా దేవి జాతా ఇదానీం,
స్వయం భారతేఽస్మిన్ కృతావిర్భవా త్వమ్
కురుష్వోపకారం భవత్కింకరాణాం
శివేఽస్మాక మీశప్రియే సింహవాహే.

తనుత్రాణ సంభావితాకారదీప్తం
స్ఫురద్రూప సంపత్తిమాలోకితుం తే
సముత్కంఠతే ఽసౌ జనశ్శూలపాణే
సమావిర్భవత్వం పునర్భారతేఽస్మిన్.

సదా జ్ఞానదే ప్రేమదే శక్తిదే సత్
ప్రభావాను రూపాభిరూప స్వరూపే
మహాజీవనాజౌ త్వయా ప్రేరితాస్తే
వయం యోద్ధుమంబోద్యతా, దేహి శక్తిమ్

నవేభారతాజౌ అతిక్రూర శత్రూన్
పురో యోద్ధుమాద్యస్మనస్కా నిహాస్మాన్
తనుష్వాకృతావా బలే నాసురేణ
మరేణా జనాత్మన్యపాడాన్ తనుత్వమ్.

జగత్యాం సమిద్ధాఽధునా భారతీయా
ప్రజ్ఞైషాంధకారా వృతాత్మ ప్రభావా
వ్యథామేతి దుర్గేఽధునా ప్రాచికోటి
ప్రభాభిర్విభాహి స్ఫురంతీభి రంబ !

త్వదల్పాల్పరోచిర్మహిమ్నా ప్రభాతం
భవత్యంబ ! సద్యః పరాస్తం తమోఽపి
ప్రకాశో యథాఽఽత్మన్యుదేతి ప్రకామం
తథా ప్రాచి దివ్యప్రభాభి ర్విభాహి.

ప్రసూ త్మాత్మమతే సర్వసౌందర్యభామే!
విభాతి స్త్వైషా మహాభారతోర్వీ
బలప్రేమచైతన్య దీజన్మభూమి
ర్మహానందభామి ర్భవత్యేవ దుర్గే !

విభాతి స్వరూపా మహాభారతోర్వీ
స్వశక్తిం పిధాయ ప్రసుప్తాఽధునైవ
ప్రబుద్ధాఽదివోఢుం భుజే భారతీయం
భరం దీక్షతే, త్వం ప్రకాశస్వమార్యా

త్వయైవ ప్రసూతాస్సుతాః కేవలం స్మ
వయం తే ప్రసాదాత్ వయం తే ప్రభావాత్
మహాకార్య లక్ష్యే ప్రయోగార్థముద్య
ప్రదీప్తం భజామో హృది ప్రాణశక్తిమ్.

అతిస్వార్థబుద్ధిం బహూ క్షుద్రభావం
శివే దూరయాస్మాక మంబాతి తుచ్ఛమ్
సమూఢం భయం వా విధూరీ కురు త్వం
జడత్వం హరత్వం సుతానాం తవాంబ !

కపాలాస్థిమాలే కరాళ ప్రణాదే
ప్రకాశస్వ భూమాన్నాఽస్మదంత శ్శరీరమ్
నిరస్యారి వర్గం సమం సాట్టహాసం
విశుద్ధాంతరంగాన్ కురుస్వాత్మపుత్రాన్.

అతిక్షుద్రతా స్వార్థభీత్యాప శీర్ణాం
విహీనాతి దీనాం మహాభారతోర్వీమ్
పరిత్రాతు మస్మాన్ ఉదారాన్ మహేచ్ఛాన్
సముద్ధాన్ మహాసత్త్వదీప్తాన్ కురుష్వ

యథా నాల్పకామా భవేమాత్మ శక్త్యా
ప్రదీప్తా భవామ స్తథైవాను కంపామ్
కురు ప్రాగవర్ణే మహాయోగ శక్తిం
మహాకాళి విస్తారయాస్మాసు దుర్గే !

తవైవార్య జాతౌ విలుప్తం చరిత్రం
విలుప్తాత్మ శక్తిర్విలుప్తాచ మేధా
విలుప్తా తపస్యా తథా బ్రహ్మచర్యం
విలుప్తాచభక్తి ర్విలుప్తాచ సంవిత్

విలుప్తం సమస్తం పునర్దీపయిత్వా
వికాసం నయంతీ నిజామార్య జాతిమ్
జగత్యామ్ ప్రతిష్ఠామ్ పునఃప్రాపయత్వం
స్వకం భారతం దుర్గతిచ్ఛిత్తి శూలే !

---

★ ఈ గుర్తుగల శ్లోకములు మూలములోని ౪ (౮)వ ప్రియే మాతం దుర్గే అను పదములకు వ్యాఖ్యారూపములు.

జహి క్రూర మంతర్బహిశ్శత్రువర్గం
వ్యథా మంతరాయాన్ హరంతీ చ నస్త్వమ్
కురు ప్రేమపూర్ణాన్ మహాసత్త్వదీప్తాన్
సదైకాత్మతా విత్తసంవిత్తరంగాన్.

సదా సత్యసత్త్వ ప్రభాజ్ఞాన శిల్ప
ప్రథా సాహితీ చిత్కలా దర్శనేషు
మహిష్ఠా భవామో యథా దేవి దుర్గే
తథాఽస్మానుదారాన్ కురుత్వం భవాని.

కలా కేలి వన్యాం వసంతా మయద్వత్
కలాదివ్యధున్యాం ప్రవాహా మయద్వత్
కనాశ్శైల శృంగే మహామంజుధారా
భవామో యథా, నస్తథా సంస్కురుత్వమ్.

సఖా క్షేత్రరంగే మహారాణిసత్య
న్యుదారే భవామో యథా నః కురుత్వమ్

పదాబ్జం భజామస్తవానంతశక్తే
ప్రసన్నా భవాస్మాసు రుద్రాణి దుర్గే.

సమావిశ్య దుర్గే సమస్తాకృతా నః
ప్రకాశస్వ యోగాగ్ని రత్రాణశక్త్యా
నిజేష్వాయుధేషు ప్రశస్తాః కరాళః
కృపాణో భవామో యథా నః, కురుత్వమ్.

తమో నాశనిష్ణాః ప్రదీపో భవామో
యథా, నః కురుత్వం తథా దేవి దుర్గే !
తనూజాన్ తవాస్మాన్ విపూర్ణాభిలాషాన్
కురుత్వం సదా భారతా నంబదీరాన్.

స్వశక్తి ప్రసారం కురు ప్రాణశక్తే
కరాళం కృపాణం పరిస్ఫోరయంతీ
పరిజ్ఞానదీపం సముద్ద్యోతయంతీ
సమావిర్భవత్వం పురోస్మాక మంబ !

ఇహేహి స్వయంతే సముంచామ దివ్యం
సదాబ్జం కదాపి స్వభక్త్యైక నిబద్ధమ్
సమీహామహే త్వాం హృది ప్రాణ శక్తే
ద్రుతం పాదురేహి ధ్రువం ప్రేమరేహి.

అయే వీరమార్గైక సందర్శయిత్రి
స్వయం శక్తిపూర్ణం విధాతుం సమస్తమ్
ఉపేహి ద్రుతం, నస్సదా రాష్ట్రదుర్గే
సపర్యాంకితం న స్సమస్తం శరీరమ్.

సదా మాతృసేవా పరాసః కృతిస్స్యాత్
సదా సత్య కైంకర్య సక్తం మనోఽపి
విశిష్టం విశాలం పునస్స్విష్ట మంబ!
ద్రుతం ప్రాదురేహి ద్రుతం ప్రేమరేహి.




కొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
అమృతాంజన్ ఆముదము
సుప్రసిద్ధ అమృతాంజన్ కంపెనీ వారి
మరో విశిష్ఠమైన ఉత్పత్తి.
అమృతాంజన్ ఆముదము
AMRUTANJAN
LTD'S
SPECIAL GRADE
CASTOR
OIL
SUPERIOR
PURE REFINED
AND ODOURLESS
NET CONT 200 ML LOT No
Manufactured by
AMRUTANJAN LTD.
UPPAL — HYDERABAD
MADE IN INDIA
మూడు
సైజులలో
లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి
OBM 3270 TG

# అభిజ్ఞాన శాకున్తల నాటకము

(ఆం ధ్రా ను వా దా ను శీ ల న ము)

శ్రీ మల్లాది సూర్యనారాయణమూర్తి

డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావుగారు తమ "తెలుగు నాటక వికాసము" అను గ్రంథంలో ఆ గ్రంథం ప్రకటింపబడిన 1967నాటికి కావచ్చును—మహాకవి కాళిదాసుని అభిజ్ఞాన శాకున్తల నాటకానికి ఆంధ్రానువాదం చేసిన ముప్పదిమంది కవులను ఒక పట్టికగా చూపించారు. ఆ పిమ్మట అనువదించినవారు కూడ కొందఱు ఉండవచ్చును. వారందఱు గొప్ప పండితులే, గొప్ప కవులే. అయినా నేనెఱిగినంతవఱకు ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందినవి రెండే అనువాదాలు. ఒకటి. కీ. శే. కందుకూరి వీరేశలింగంగారిది, రెండవది కీ. శే. వేదం వేంకటరాయశాస్త్రిగారిది.

ఎవరెవరో అపుడపుడు భారతి మున్నగు పత్రికలలో పై యిద్దఱి పద్యాలలో రెండింటినో మూడింటినో గ్రహించి, మూలంతో పోల్చుతూ, వారి ఆంధ్రీకరణ తారతమ్యాలను గూర్చి చర్చించిన వ్యాసాలు కొన్ని ఇతఃపూర్వమే ప్రకటింపబడినవి. అంతేకాని, ప్రతి గద్య వాక్యాన్ని, ప్రతి పద్యాన్ని మూలంతో పోల్చి, ఎవరి రచన ఎక్కడ ఏ విషయంలో ప్రశస్తంగా—(లేక అప్రశస్తంగా) ఉన్నదో అన్న సూచనలను సాహిత్యాభిమానులకు అందించవలెనన్న సంకల్పంతో వ్రాయబడిన ఒక సమగ్ర విమర్శగ్రంథం నేటి వఱకు వెలువడలేదు. ఇటీవల నేను అట్టి పనికి పూని ఒక గ్రంథాన్ని వ్రాసి ముగించగలిగినాను. (అముద్రితము.)

ఈ విమర్శ వ్రాసే సందర్భంలోనే, ఏ ఒక్క విషయంలోనైనా, పై ఇరువురు పెద్దల పద్యాలు కూడ నాకు నచ్చని అనేక స్థలాలలో, నేను కూడ ఆయా శ్లోకాలను అనువదించడానికి ఒకింత ప్రయత్నించినాను. సాహిత్యాభిమానము, రచనోత్సాహములు మాత్రమే నా యీ గ్రంథ రచనకు కారణాలు అని నా విన్నపం.

ఈ వ్యాసానికి ఉంచబడిన శీర్షికతోనే వ్రాయబడిన 240 వ్రాతప్రతులుగల నా గ్రంథంలోని అక్కడక్కడి కొన్ని అంశాలను బాగా సంగ్రహించి, మచ్చుగా, ఆఱు శ్లోకాలను, వానికి కం. వీ; వే. వేం. గారల పద్యాలను నాపద్యాలతోపాటు ఉదాహరిస్తున్నాను. పాఠక మహాశయులు సహృదయతతో చిత్తగింతురుగాక!

1. అంకం 5. శ్లో 22.

శ్లో॥ స్త్రీణా మశిక్షిత పటుత్వ మమానుషీషు
సందృశ్యతే, కిముత యాః ప్రతిబోధవత్యః!
ప్రాగన్తరిక్ష గమనాత్స్వమపత్య జాత
మన్యైర్ద్విజైః పరభృతాః ఖలుపోషయన్తి॥

మూలం మొత్తం 56 అక్షరాలుగల వసన్త తిలకావృత్తం. మూల శ్లోకం వచ్చి తెనుగు పద్యంలో ఇమిడిపోవడం అంటే, మూలంకంటె పద్యశరీరం పెరగడం అన్నమాటే. అంటే అనేక వ్యర్థపాద పూరకాలు పడక తప్పదు. ఇట్టిది ఎక్కడో ఒకచోట ఎంతటివారికైనా తప్పక పోవచ్చును. కాని సర్వసాధారణంగా, కొంచెం నిలిచి ఆలోచించి, ఏ యే పదాలను తొలగించి నప్పటికీ, మూలశ్లోక ప్రధాన భావానికి, కవి హృదయానికి, కథా సందర్భానికి, రసానికి, పాత్ర హృదయానికి, ఔచిత్యానికి, విఘాతం కల్గకుండ, మూలచ్ఛందస్సుకు వీలయినంత చేరువగా తెనుగుపద్యం ఉండేటట్లు రచన సాగించడమే అనువాదకుని లక్ష్యం కావాలని, అదే అనువాదానికి వన్నె తెస్తుంది అని నా అభిప్రాయం. అనగా అర్థవిపులీకరణంకాక అర్థసంగ్రహం (brevity) తప్పక కుదరాలని భావం. ఈ పేరాలోని వాక్యాలదృష్ట్యా క్రింది రెండు పద్యాలు పరిశీలింపబడునుగాక! ఇంతకంటె ఇతర విశేషాలున్న చోట అవి అక్కడక్కడ ప్రత్యేకంగా చెప్పబడునవి!

కం. వీ. గారి పద్యం :

చ॥ అరయఁగ మానవేతరములై తగు జంతువులందు స్త్రీలలోఁ
గరము విదగ్ధ పాటవము గన్పడఁ జెప్పఁగనేల ప్రాజ్ఞతా
తరుణులమాట? [illegible]ప్రకరం బితరద్విజాళి సం
బరమున [illegible] కన్గొనఁ [illegible]!

వే. వేం. గారి పద్యం :

మత్తకోకిల : స్త్రీ లమానుష జాతులందె యశిక్షిత [illegible] దా
మేలు బోధఁ గన్నవారల [illegible] చెప్పఁగా

లీలలాతి ద్విజాళిచేఁ దనలేఁత కందుల నింగిఁబోఁ
బోలుమున్ జెనిపించు నా పరపుష్టనేరుపుగానమే !

వీరిదే, విడిగాఁ జూపఁబడిన, ఇంకొక పద్యం :

మ॥ నరభిన్నాంగనలం దశిక్షితము పూర్ణ ప్రౌఢి సిద్ధంబుగా
వరబోధైధిత మానుషీ ప్రతిభలన్ వర్ణింపఁగా శక్యమే!
అరితిన్ లాతిద్విజాళిచేఁ దమ-యపత్యంబున్ దివిన్ బోకమున్
బరపుష్టల్ పెనిపించి ధన్యలగు నా ప్రౌఢిన్ విలోకింపమే !

నా లనువాదం :

తే. గీ. అతివల సహజ ప్రతిభ తిర్యక్కులందె
దృశ్యముగ, బోధితఁల జెప్పనేల? యాత్మ
జాత మెగురుదాఁకి తరద్విజ ప్రకర సు
పోషిత మొనర్చుఁగద పరపుష్ట సమితి !!

2. శ్లో. ఏకైక మత్ర దివసే దివసే మదీయమ్
నామాక్షరం గణయగచ్ఛసి యావదంతమ్
తావత్ప్రియే ! మదవరోధ గృహప్రవేశమ్
నేతా జనస్త్వ సమీపముపైష్యతీతి !!

కం. పి. గారి పద్యం :—

చ. దినదినమొక్కటొక్కటిగ దీనిపయిందగు నాదుపేరిటన్
దనరెడి యక్షరంబులను దప్పక యెన్నుట కెన్నినాళ్లు ప
ట్టునొ విను కుటుంబినిరో ! యిట నీదు చెంతకున్
జనులను బంపువాఁడను వెసన్ విను తంతిపురంబు చేర్చఁగాన్ !!

వే. వేం. గారి పద్యం :

చ. దినదినమొక్కటొక్కటిగ దీనఁ జెలంగు మదాఖ్య లోపలన్
దనరెడు నక్కరాలు తుదిదాకఁగ లెక్క యొనర్చు వారిరిన్
బనివడి యంత విన్ను గుణభామను నాయవరోధసీమకున్
గొనెడి నరుండు నీకడకు గొబ్బున వచ్చును జాణ్ముక్తి పేయుచీ !!

నా అనువాదం :

తే. గీ. ఇందు నాపేరి యక్కరాలెన్నో; వాని
దినదినంబును నొక్కొక్కటి గణనఁజేయు
మదిత ! తుదిఁజేరునాఁటికి మదవరోధ
గృహము నినుజేర్చునాతఁడు యిటకు వచ్చు ! !

3. అంకము 6. శ్లో 26.

శ్లో. ఏష త్వామభినవకంఠశోణితార్థీ
శార్దూలః పశుమివ హన్మిచేష్టమానం
ఆర్తానాం భయమపనేతు మాత్తధన్వా
దుష్యన్త స్తవ శరణం భవత్విదానీమ్ !!

కం. పి. గారి పద్యం :

తే. గీ. గొంతు కోవి క్రొన్నెత్తురుఁ గ్రోలఁగోరు
నేను బళువును బులియట్లు నిను వధింతు
నార్తుల భయంబు నుడుప బాణాసనంబు
పూను దుష్యంతుఁడిపుడు నిన్ బ్రోచుఁగాక !!

వీరి పద్యంలో అర్థ సంగ్రహాదులు బాగున్నవి. కాని, మూలంలో "అభినవకంఠశోణితార్థి" శార్దూలం కాగా, వీరి పద్యంలో "గొంతు క్రోవి క్రొన్నెత్తురుం గ్రోలఁగోరు" వాఁడు "నేను" (చాటున నున్న మాతలి.) ఇది మూలాను సరణం కాదు.

వే. వేం. గారి పద్యం :—

మ. నవకంఠక్షతజాశ బెబ్బులి యనూన క్రాంతిమై నాశమున్
వివశోద్దామ విచేష్టమున్ గెడపు రీతిన్ నిన్నిదే కూల్చెదన్ !
ప్రవిభీతార్తిఁదెరల్పనాత్తధను వైభ్రాజిల్లు దుష్యంత భూ
మి విభుండిప్పుడు నిన్ను గాఁచునట! నెమ్మింబేరుకొమ్మా తనిన్!

మూలం మొత్తం 52 అక్షరాల ప్రహర్షిణీవృత్తం. దాని భావం కోసం 80 అక్షరాల మత్తేభవిక్రీడితాన్ని గ్రహించి దాని కడుపు నింపడానికి దాదాపు రెండు పాదాలను వృథగా వ్రాయవలసివచ్చిన దీని యందు అర్థ సంగ్రహం విట్లు కుదరలేదో, ఈపద్యం మూలాని కెంతదూరం అయిందో వేఱుగా జెప్పవలసిన పనిలేదు.

నా అనువాదం :

తే. గీ. గొంతు క్రొన్నెత్తురుం గ్రోలఁ గోరెడు పులి
చేష్టమాన జంతువునట్లు చీల్చిచంపు
వాఁడని, స్వార్తరక్షణ పరత ధనువు
దాల్చు దుష్యంతుఁడిపుడు నీ త్రాతయగుత !!

అంకం. 6. శ్లో. 29.

4. శ్లో. సఖ్యుస్తే సకిల శతక్రతో రజయ్యా
స్తస్యత్వం రణశిరసి స్మృతో నిహన్తా !
ఉచ్ఛేత్తుం ప్రభవతి యం న సప్తసప్తి
స్తంనైశం తిమిర మపాకరోతి చంద్రః !!

కం. పి. గారి పద్యం :

ఉ. నీ చెలియైన యింద్రునకు నిక్కమజయ్యులు వారు; వారలన్
బీచమడంతు పీవు రణమేదిని నంచును వాసవుండు సం

కోచము లేకనమ్మ; రవికూర్పంగ లేనితమంబు నుర్విలో
నేచి నిశాకరుండు నశియింపఁగఁ జేయఁడె రాత్రి వేళలన్ !!

వే. వేం. గారి పద్యం :

ఉ. నీ చెలికాని కిం దునికి నెట్టన వారలజయ్యు, లాతియా
మావరపాళిఁ బోరఁ బరిమార్చుదు పీవని యాతఁడెంచెనో,
రోచిరుదంచితుండు రవి ద్రోవఁగలేని నిశాంధకారమున్
బీచ మడంపఁడే యమృత బింబ విరాజితుఁడిందుఁడుద్ధతిన్!!

మూలం ప్రహర్షిణీవృత్తం. ఇవి, రెండు పద్యాలు, మూలానికి ఎంత దూరంగా ఉన్నవో చెప్పనక్కఱలేదు.

నా అనువాదం :

తే. గీ॥ నీదు మి త్రుఁడింద్రుఁడు గెల్వనరఁడంట
వారిమూక, ననిమొనఁ బంపంగనేర్తు
వీవని తలంచుఁ, జీఁకటిఁ బోవఁజేయఁ
జాలఁడర్కుండు, చంద్రుండు చాలుఁగాదె!!

5. అంకం 7. శ్లో. 17

శ్లో॥ అలక్ష్యదన్త ముకుళా ననిమిత్తహాసై:
అవ్యక్తవర్ణ రమణీయ వచః ప్రవృత్తీన్
అంకాశ్రయ ప్రణయి నస్తనయాన్వహన్తో
దన్యాస్తదంగ రజసా మలినీ భవన్తి!!

కం పి. గారి పద్యం :

ఉ॥ హేతువులేని నవ్వుల నొకించుక చూపుచు లేఁతదంతముల్
వాతెఱచింద నందముగఁ బల్కుచు స్పష్టముగాని వాక్కులన్
భూతల ధూళిదేహమునఁ బూయుచు మైలయొనర్చు పుత్రులన్
ప్రీతిని ధన్యులెత్తి తొడమీఁదను జేర్చి, సుఖింతురెంతయున్!

వే. వేం. గారి పద్యం :

మ॥ అనిమిత్తోదయ హాసభాసురములై యంతంతవల్ గ్రొన్ననల్
కననౌ నస్ఫుట వర్ణ జల్పన మనోజ్ఞవ్యాహృతి వ్రాగులన్
అనపాయాంక సతృష్ణులన్ సుతులఁ గ్రోడావాసులంజేసి పు
ణ్యనిధుల్ తద్వపురాత్త పాంసుధృతి సంప్రాపింతు ధన్యత్వమున్!

ఇంతకు ముందు వ్రాసిన విషయాలే పై రెండు పద్యాలకు కూడ వర్తిస్తవి

నా అనువాదం :

తే. గీ॥ హేతువుంలేని నవ్వుల, నింతయ కనఁ
బడెడు పలు మొగ్గలును, గల వాక్కు లలరఁ,
దొడను గూర్చుండఁగోరు పుత్త్రుల వహించి
ధన్యులు తదంగ మలినమ్ముఁ దాల్తురుగద!!

6. అంకం 7. శ్లో. 30.

శ్లో॥ ఉదేతిపూర్వం కుసుమం, తతఃఫలమ్
ఘనోదయః ప్రాక్తదనంతరం పయః
నిమిత్త నైమిత్తిక యోరయం క్రమః
తవప్రసాదస్య పురస్తు సంపదః!!

కం. పి. గారి పద్యం

తే గీ॥ తొలుతఁ బూవును తరువాత ఫలము గల్గు;
మొదల మేఘమడరి వాన పిదప గురియు;
కార్యకారణముల కిది క్రమముమాడ,
నీ ప్రసాదంబునకు ముందె నెగడు సిరులు!!

మూలంలోని–"నిమిత్త నైమిత్తికయోః–" అను క్రమం వీరి పద్యంలో వ్యత్యస్తమై, దానివల్ల క్రమాలంకారపు సొగసు ఎట్లు చెడింటో గమనార్హం!!

వే. వేం. గారి పద్యం

ఆ. వె॥ పూవుదోఁచుముంద, పూపపుటు పిఱుంద,
వారిదంబుమున్న, వాన వెన్క;
హేతుకార్యములకు నిట్టిదౌ క్రమమెందు,
నీదు కృపకు మున్న నెగడు సిరులు!!

మూలాల మహాకవి "ఫలము" అన్నచోటున, వీరు "పిందె" అను అర్థాన్నిచ్చే "పూప" అని వ్రాశారు. సద్యోవినియోగ యోగ్యతను సూచింపగోరిన మహాకవి "ఫలము" అని వ్రాశాడేకాని, పూవునుండి మొదట పుట్టేది ఫలము కాదు, పిందెయే అని మహాకవికి తెలియదా? "పూప" అనటంవల్ల—చతుర్థపాదంలో—పూవువంటి నీ కరుణకు ముందే (వెంటనే ఉపయోగానికి రాని) "పిందె"వంటి సిరులు కలుగును అని అన్వయించుకోవలసి వస్తుంది. ఇది ఎంతవఱకు సమంజసమో ఊహ్యము.

నా అనువాదము :

తే. గీ॥ మొదటఁ గుసుమంబును ఫలంబు పిదపఁబుట్టు,
మొదట మేఘంబు, వర్షంబు పిదప కలుగు;
కారణము గార్యములకిది క్రమము సూవె!
కాని, సిరికల్గు నీ కృపకంటె ముందె!

# గురజాడను యుగకర్త అనడం సమంజసమా?

శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ఈ వ్యాసం శీర్షిక వింతగా తోచవచ్చు—ఆధునికాంధ్ర కవిత్వంలోని తొలి ప్రకరణానికి గురజాడ యుగకర్త అని కొందరు సిద్ధాంతీకరించారు. రాయప్రోలు గారని మరికొందరు సిద్ధాంతీకరించారు. ఆచార్య సి. నా. రె గారు సమన్వయ ధోరణిని అవలంబిస్తూ ఇద్దరూ యుగకర్తలేనని అన్నారు. అయితే ఈమాట పక్షపాతంతో కూడినదని కొందరు వ్యగ్రతను పొందకపోలేదు. ఇది గురజాడకు తీవ్రమైన అన్యాయమని కొందరు బహిరంగంగా అనకపోలేదు.

అన్యాయం అంటూ జరిగితుంటే ఇద్దరికీ జరిగింది. ఆధునికాంధ్ర కవిత్వానికి యుగకర్త అంటే, ఆధునికాంధ్ర కవిత్వంలో మొదటి ఉద్యమమైన కాల్పనిక కవిత్వానికి యుగకర్తలన్నట్టే. కాల్పనిక కవిత్వంలో అభివ్యక్తమైన భావచేతన, మౌలికంగా రాయప్రోలు గారి భావతత్త్వంతో ముడిపడినట్టిది. గురజాడగారి కవిత్వంలో ద్యోతకమయ్యే భావతత్త్వానికి, కాల్పనిక కవిత్వంలో బహిర్గతమైన భావతత్త్వానికి మధ్య ఏమాత్రం పొంతనా కుదరదు. ఆ భావకవిత యుగ చేతనను గురజాడ పొరపాటున కూడా ఎక్కడా అభివ్యక్తపరచనూలేదు; ఆశించనూలేదు. ఆయన ప్రతిపాదించని యుగచేతనకు ఆయన ఆద్యపురుషుడు అనడం, మౌలికంగా ఆయనకు అన్యాయం చేయడమే...అలాగే దానికి బీజావాపనం చేసిన రాయప్రోలుగారి ప్రక్కన గురజాడనూ కూర్చోపెట్టడంతోటి రాయప్రోలుగారికీ అన్యాయం చేసినట్టే. తెలుగులో భావకవితా యుగానికి నిక్కచ్చిగా యుగకర్త రాయప్రోలుగారే.

భావ కవితాయుగచేతన ఎలాటిది ? గురజాడగారి భావచేతన ఎలాటిది ? అన్న ప్రశ్నలు మొట్టమొదటగా అనుగమ్యమౌతాయి. రెంటినీ ప్రక్క ప్రక్కన పెట్టిచూస్తే గురజాడగారు, ఎలా భిన్నులౌతున్నారో అర్థమౌతుంది.

దాదాపు 1910 నుండి ఆరంభమై రెండున్నర దశాబ్దాల పాటు బలంగా వ్రేళ్ళూని నిలిచిన భావకవిత్వాన్ని ఒకసారి పరిశీలిస్తే వ్యక్తమయ్యే అంశాలు రెండు. 1. ఆదర్శ సౌందర్యాన్వేషణ 2. కాల్పనిక భావావేశం. ప్రణయారాధన, ప్రకృతిపూజ, పూర్వ వైభవస్మరణం వంటివి మొదటి దానిలో అంతర్నిహితమౌతుంటే, అతి లౌకికత, హేతు చింతన లేకపోవడం, ఆత్మనిష్ఠాతత్త్వము వగైరాలు రెండవదానిలో సమున్మిళితా లౌతున్నాయి. ఈ రెండంశాల తోటి, భావకవితాతత్త్వమన్నది ఆవిష్కృతమైంది. గురజాడగారు ఎప్పుడూ ఆదర్శ సౌందర్యాన్వేషణను చేయలేదు. హేతుచింతనకు అతీతమైన ఏ కాల్పనిక భావావేశాన్నీ వ్యక్తపరచలేదు కల్పనాదర్శితాలైన విన్యాస చమత్కారాలను చేయలేదు. 'తాతలనాటి నేతుల వాసన' లను ఎక్కడా ఒలికించలేదు. ఆయన ప్రతిపాదించని, చిత్రించని తత్త్వానికి ఆయన్ను ఆద్యుడనడం అంతగా సమంజసంకాదు.

గురజాడగారి ప్రభావం, ఆ క్రొత్తయుగంమీద అసలులేదా? అంటే — ఉంది — ఛందస్సుకు సంబంధించినంత మాత్రముంది. ఆయన ముత్యాల సరాలను రాయప్రోలుతోసహా అందరూ అందుకొని, తమ కావ్యతత్త్వాన్ని వానితో అలంకరించారు. ఏ ఇద్దరు ముగ్గురో ఆయన శబ్ద ప్రయోగంలోని సరళతను, భావచిత్రాలలోని నిరాడంబరతను అనుసరించారు. అంతే. కవిత్వంలోని బాహ్య స్వరూపానికి సంబంధించిన ప్రభావంతో, ఏ కవి యుగకర్త కాలేదు...అలా అంటే గురజాడగారిని గౌరవించడంకంటె అగౌరవపరచడమే ఎక్కువౌతుంది.

యుగకర్త అని పిలవడానికి కొలతలేమిటి? ముందుగా వ్రాయడమా? లేక వెనువెంటనే వస్తున్న జనాన్ని ప్రభావితంచేసి, తన భావతత్త్వాన్ని వాళ్ళల్లో పండించి, నిండైన ఉద్యమానికి కారణం కావడమా? అన్న ప్రశ్నల్ని వేసికొంటే రెండవదే ప్రధానమైందని ఎవరైనా చెప్పగలరు! ఆద్యతవల్ల యుగకర్త గౌరవాన్ని ఏ కవీ ఇందాకా అందుకోలేదు. యుగకర్త అన్న మాటను నిర్ధరించేది అనుయాయివర్గమే. ఒక కవి భావాల జాడలో, తాత్త్విక ప్రజ్ఞయొక్క వెలుగులో అతని వెన్నంటి అనుసరించి వచ్చే 'యుగజీవులే', యుగకర్త విషయాన్ని నిర్ధరిస్తారు. గురజాడ జాడలో ఎందరు ఆయన్ను అనుసరించి వచ్చారు? అన్న విషయాన్ని చూస్తే చింతా దీక్షితుల గారి వ్యథాపూరితమైన వాక్కులు జ్ఞాపకం వస్తాయి. 'భావంలోకాని శైలిలోకాని నేటి నవకవులు ఆయన్ను అనుసరించడంలేదు' అంటూ మూడు దశాబ్దాల క్రితమే దీక్షితులు గారన్నమాటలు నిజాన్ని బయట

పెడతాయి. గురజాడగారి 'రసగీతాల్ని రాయప్రోలుగారు అందుకొన్నారు' అన్న కవి సామ్రాట్‌గారి మాటలు వాస్తవమో కాదో చూడాలంటే, ఆ రసగీతాలలోని భావధారను గమనించాలి. అనుయాయి వర్గం బాహ్య ప్రక్రియా, ప్రయోగాల్ని అనుసరించినంతమాత్రాన చాలదు. అంతస్సరళిని, అంతశ్శక్తిని అనుష్ఠించాలి. రాయప్రోలు గారికి—గురజాడగారికిఉన్న మౌలికమైన వ్యత్యాసాన్ని చూడాలంటే ఆ ఇద్దరూ దేశభక్తికి సంబంధించి వ్రాసిన గేయాలను ప్రక్కప్రక్కన పెట్టి పరిశీలిస్తే, ఏ సహృదయునికైనా అర్థమౌతుంది—రాయప్రోలులోని కాల్పనిక ఆవేశం, మచ్చుకు కూడా గురజాడలో తొంగిచూడదు. గురజాడలోని హేతువాదచింతనకానీ, తాత్త్విక ప్రజ్ఞకాని రాయప్రోలు గీతాల్లో అణుమాత్రం కూడా కనిపించదు. మనిషన్నవాడు, ఏమట్టిమీద ఉన్నా అన్యోన్యమయ్యే గీతిక గురజాడగారిది. భారత భూమి అన్న నియతత్వం ఆయన కవితకు లేదు. భారత ప్రజల్లో నిద్రాణమైన చైతన్యాన్ని, మాతృభక్తినీ, మల్లెపూల మారుతంలా మేల్కొలిపేది రాయప్రోలుగారి గీతిక. అది భారత జనావళికి మాత్రమే నియతమైంది. అనేక విషయాల్లో ఇలాటి 'ప్రాదేశిక నియతత్వమే' కాల్పనిక కవితలో దృగ్గోచరమౌతుంది. ప్రణయంలోకూడా అంతే. సృష్టిలోని స్త్రీ-పురుషులన్న ఇద్దరినీ స్వతంత్ర ప్రతిపత్తి, సమానతా కల ప్రత్యేకమైన ఘటికలుగా గురజాడ గారు దర్శిస్తారు. ఒకచోట విద్యలోని మాయమర్మాన్ని ఒక అబల విప్పిచెబితే, ఇంకోచోట—మాయ మర్మములేని నేస్తము మగువలకు, మగవారికి ఒక్కటే అని మరో మొగాడు వివరిస్తాడు. కథాసందర్భాన్నిబట్టి ఒకరికొకరు తెలియ చెప్పినా, ఇద్దరూ సమానత కలవారే. రాయప్రోలుగారి అమ్మాయిలు అలాటివారుకాదు. చిచ్ఛక్తి స్వరూపిణులు. వాళ్ళెంత 'లేతవయసు'లో ఉన్నవారైనా మగవాళ్ళకు జ్ఞానోపదిష్టలౌతారు. ఈభావమే, తర్వాతివాళ్ళ సుప్తచిత్తంలో చేరి చివరకు తమ ప్రణయినిని అధిదేవతగా మార్చేసి, ఆరాధనా భావాన్ని మేల్కొల్పి, అధ్యాత్మికమైన సంతృప్తికి లాక్కెళ్ళింది. రాయప్రోలుగారి రమ్యాలోక సిద్ధాంతాలే భావ కవితా సామ్రాజ్యాన్ని నిర్మించాయి. గురజాడగారి అనుయాయులు అని పిలువబడ్డ బసవరాజు అప్పారావు కూడా 'ప్రేమించు ముక్తికై' అంటూ మోక్ష సాధనను చేశారు.

పందొమ్మిదవ శతాబ్దం వేకువలో ఫ్రాన్సు నిర్మించిన 'కాల్పనికవాదం', ఆంగ్లసాహిత్యంలో మూర్త రూపాన్ని పొందింది. పందొమ్మిదవ శతాబ్దం నడిభాగంలోకి వచ్చేసరికే, 'పారిశ్రామికీకరణం' యొక్క నల్లబండ అనేకుల్ని కలవరపరచి, 'విక్టోరియన్ డైలమా'ను సృష్టించింది. దాని తాలూకు ప్రభావం ఇరవై శతాబ్దపు తొలి కవితలో చిందులు తొక్కుతూ 'మనిషి ఏమౌతున్నాడు?' అన్న అలజడిని రేపింది- అచ్చమైన ఆధునికత అంటే ఆ నాటికి అదే. కాని తెలుగులో ఆధునిక కవితగా పిలువబడ్డ భావకవిత్వం తరహా వేరైంది. 'మనిషి ఏమౌతున్నాడు?' అన్నదానికి సమాధానంగా, 'సౌందర్యసీమల్ని చుంబించాలనుకొంటున్నాడు' అంటూ భావకవిత్వం గానంచేసింది. కాని గురజాడ పొరపాటున కూడా అలాటి గానం చేయలేదు. 'సంస్కరింపబడాలి, హేతు చింతనను, తాత్త్విక ప్రజ్ఞనూ పెంపొందించుకోవాలి' అంటూ బలమైన సందేశాన్నే సమాధానంగా ధ్వనింపచేశారు. కాల్పనిక సౌందర్యం ఇచ్చిన కైపులో, పరంపరాగతంగా వచ్చిన ఆధ్యాత్మిక భావన ఇచ్చిన ఆర్తిలో దాన్ని నిక్కచ్చిగా తెలుగు భావకవులు పట్టించుకోలేదు. వారి దారి వారిదయ్యింది. గురజాడగారి ఒక్కరిబాటే మాయని జాడగా నిలిచింది.

తెలుగు కవితలో ఆధునికతను గూర్చి పరిశీలిస్తే, అందరికంటే ఆచార్య ఎం. ఎస్. శ్రీనివాస్‌గారి మాటలే ఎక్కువభాగం అన్వయింప దగ్గవిగా కనిపిస్తాయి. ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త అయిన శ్రీ శ్రీనివాసన్‌గారి 'సాంస్కృతీకరణం' ('Sanskritisation) సిద్ధాంతంలోని కొంత భాగం చక్కటి ఆలంబన నిస్తుంది. వీరిమేరకు సమాజంలోని ఉన్నత వర్గాలు పాశ్చాత్యీకరణాన్ని (westernisation) అవలంబిస్తే, నిమ్నవర్గాలు సాంస్కృతీకరణాన్ని అవలంబించాయి. ఆధునిక తెలుగు కవితలో ముఖ్యంగా భావకవిత్వంలో కనిపించే వాస్తవమింతే—ఉన్నత సంస్కృతిని వ్యక్తం చేసిన కావ్యపాత్రలన్నీ ఓ విధమైన పాశ్చాత్యీకరణాన్నే వ్యక్తబరిచాయి. అందుకే కాటోలు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు నవ్యసాహిత్య పరిషత్తు సమావేశంలో ఆంగ్లవిద్యా ఫలితంగా, ఆంగ్ల నాగరికత మూలంగా ఆంధ్రులకు సంక్రమించిన మంచిచెడులను ప్రతిబింబించే సాహిత్యం నవ్యసాహిత్యం' అంటూ సూత్రీకరించారు.[1] ఇక నిమ్న సంస్కృతి అని పిలువబడ్డ జానపద సంస్కృతిని వ్యక్తం చేసిన కావ్యపాత్రలు, అచ్చమైన జానపద సంస్కృతినే అభివ్యక్తపరచలేదు. అన్నివిధాలా నాగరక సంస్కృతిలోని భావాలనే తేటయైన తెనుగు మాటల్లో, కాదంటే పల్లె పట్టుల్లోని అగ్రాంధికమైన మాటల్లో వ్యక్తం చేశారు. ఇది సాంస్కృతీకరణ ప్రభావమే.

సామాజిక సమస్యల్ని కథానాత్మక రూపంలో చిత్రించి, సందేశాల్ని ధ్వనింపచేసిన గురజాడగారు ఈ సంస్కృతీ పరావర్తన (Transformation of culture) అన్న సీమలో బద్ధులు కాలేదు. సమస్యను వైజ్ఞానికమైన అవగాహనతో పరిశీలిస్తూ, సమస్యలకోసం సమస్యాచిత్రణం కాకుండా, సరైన సమాధానాల్లాటి సందేశాల్ని అందించే "సారమతి", ఈ గుణాలకు లోబడదు. ఒక దృష్టితో చూస్తే ఆయనది కూడా ధనికవర్గపు కవితే కావచ్చు. పాశ్చాత్యీకరణ ప్రభావం కొంతవరకూ సోకి, ఆయనలోని ఆధునికతనూ నిలబెట్టనూ వచ్చు. కాని అంతకంటె భిన్నమైన అవగాహనను ఏర్పరుస్తున్నాయి ఆయన కవితలు. సూటిగా భిన్నత్వాన్ని వ్యక్తబరుస్తున్న కవి చైతన్యాన్ని నిబద్ధం చేయాలనుకోవడం విమర్శకుని పొరపాటే అవుతుందేమో.

అయితే ఈ రోజు సాహిత్య విద్యార్థులు అందరూ ముఖ్యంగా గమనించాల్సింది గురజాడగారి కవితా చేతనను భావకవిత్వం ఎందుకు అందుకోలేదు? అన్న అంశాన్ని. దీన్ని మూడు ప్రత్యేకమైన సందర్భాల్లో గమనిస్తే తప్ప, అప్పారావుగారి భావాలు ఆదర్శవంతాలుగా అగుపించినా, ఆచరణీయాలు ఎందుకు కాలేకపోయాయి? అన్న సమాధానం దొరకదు.

మొదటిది నాటి రాజకీయ సందర్భం.

పూర్వకాలంలో దేశభక్తి అంటే రాజభక్తి మాత్రమే. ఆంగ్లేయుల పాలనలో 'ఛప్పన్నారు' రాజ్యాలు ఒకే ఒక్క త్రాటి క్రిందికి వచ్చేసరికి, ఆసేతు హిమాచల పర్యంతం అందరూ తమ పీడిత స్థితిని గుర్తుబట్టేసరికి, 'దేశభక్తి' అన్నమాటకు కొత్త అర్థ వ్యాప్తి అంకురించింది. సిపాయీల పితూరీతో, ఈ కొత్త అర్థానికి అంకురార్పణ జరుగుతూ, పందొమ్మిదవ శతాబ్దం చివరిపాదంలో బలంగా వికసించింది. 'అఖండ భారతం' పట్ల స్పృహ పెరిగిపోసాగింది. అంతకు మునుపు వాళ్ళల్లో దేశభక్తి అంటే, సంకుచితార్థంలో తమ రాజ్యంపట్ల భక్తి; విశాలమైన, ఉదారమైన అర్థంలో మనిషన్నవాడున్న నేలమీదంతటా భక్తి. రెండవదాన్ని దేశభక్తి అనడంకంటె మానవతా భక్తి అనడం మేలు. కాని ఈ కొత్త జాగృతిలో, భారతదేశంలోని పీడిత హృదయాలనుండి, విముక్తి పోరాటానికి సంబంధించి, ఏకీభూతమైన దేశభక్తి ఆవిర్భవించింది. 1905లో వంగదేశంలో ఏర్పడ్డ కల్లోలం కారణంగా ఊపూ, బలమూ చేకూరాయి. భారతభూమిపట్ల ఆక్రోశభరితమైనభక్తి ఆకాశాన్ని అంటుకొంది. తెలుగు కవితారంగంలో 1895లోనే దీనికి బీజావాపనం జరిగిందని, 1905కు విస్పష్టమైన వికాసం ఏర్పడిందని ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డిగారు తమ పరిశోధనా ఫలంగా పేర్కొన్నారు.[2] ఆ వికాసమే 1907 లోని చిలకమర్తిగారి రసగీతంతో నేల నాలుగు చెరగులా ప్రతిఫలించింది. అలాంటి వాతావరణంలో 1910లో వెలువడ్డ గురజాడగారి 'దేశభక్తి' గీతం, పీడిత ప్రజలను ఎక్కువగా సంతృప్తిపరచలేకపోయింది. 'దేశమును ప్రేమించుమన్నా' అన్న చక్కటి మాటతో మొదలైనప్పటికీ, 'నీ దేశం ఇంత గొప్పది, అంత గొప్పది' అంటూ ఊపునూ, ప్రేరణనూ ఇచ్చే గీతం కాదది. మాటవరసకైనా అందులో భారతభూమి ప్రసక్తిలేదు. మునుపటి వాళ్ళలోని ఉదార మానవతా భావమే, మరికొంత హేతుదృక్పథాన్ని, సమకాలీన ఆర్థిక వ్యవస్థనూ సంతరించుకొని ముందుకొచ్చి నిల్చున్నట్లుయింది. ఆనాటి వాళ్ళకు కావాల్సిన ఆవేశపూరితమైన నినాదాలుకాని, విముక్తి పోరాటానికి అవసరమయ్యే విప్లవోత్తేజాన్ని కాని ఆ కవిత ప్రసాదించలేకపోయింది. 'వందేమాతరం' అన్న మాటతో ఉద్రూతలూగిపోయినవాళ్ళకు, 'దేశాభిమానం నాకు కద్దని వొట్టి గొప్పలు చెప్పకోకోయ్' అన్నమాటలు ఎంత నిజాలైనప్పటికీ, సుప్త చైతన్యంలో ప్రవేశించి ప్రభావితం చెయ్యలేని తాత్త్విక గీతాల్లాగే వినబడ్డాయి. అంచేతే, ఆ తర్వాతగా వచ్చిన రాయప్రోలుగారి గీతం, బహుళ జనాదరణను పొందడమే కాకుండా, ఆనాటి ఉద్యమానికి ఒక 'మార్చింగ్ సాంగ్'లా పనిచేసింది. గురజాడగారి గీతంలోని మరికొన్ని పంక్తులు కూడా గమనీయాలే. నాడు హిందూదేశ విముక్తికి సంబంధించిన జాగృతితోపాటు, హిందూ మతానికి సంబంధించిన జాగృతి కూడా అంతర్మేళనమై ఉంది. ఉప్పెనలాగ ముంచెత్తుకు వస్తున్న క్రైస్తవమత ప్రచారానికి ఎదురొడ్డి, హిందూమత పునరుద్ధరణ కోసం అనేకులు పాటు పడసాగారు. ఆ ప్రభావం చాలామంది కవులమీద వీచింది కూడాను. అలాటి సందర్భంలో "మతం వేరైతేను యేమోయి? మనసు లొకటై మనుషులుంటే"...లాంటి మాటలు, ఆ కవితా సందర్భంలో ఆణిముత్యాల్లాగు అగుపించినా, విడిగా మననం చేసికొంటే గురజాడగారి సదుద్దేశ్యం, హేతుచింతనా వెనుకబడిపోతుంటాయి. ఒక్కోసారి ఆంగ్లేయులను వ్యతిరేకించడం ఇష్టంలేకుండా, మధ్యేమార్గంలో ఈ మాటలంటున్నాడేమో అన్న అనుమానం కూడా పొటమరిస్తుంది. ఏది ఏమైనా, హిందూదేశాభిమానంతోపాటు, హిందూమతాభిమానం కూడా మిళితమైన నాటి సందర్భంలో, ఈ మాటలు అనేకుల్లో అంతశ్చేతనను స్పృశించలేకపోయాయి.

దేశభక్తి అన్నదానితో ఇంకో అంశం కూడా కలిసి ఉంది. నిద్రపోతున్న జాతిని మేల్కొల్పడానికి, నిష్కారణమైన భయంతో వెనుకంజ వేస్తున్న వాళ్ళను ఉసికొల్పడానికి, నిన్నటి ఘనతను కీర్తించడం చాలా ఉపయోగపడుతుంది. దేశభక్తిని ప్రబోధిస్తూ సామూహికమైన విప్లవచేతనకు జాతి జాతినే సమాయత్తపరచడంలో ఈ పూర్వవైభవ సంకీర్తనం ప్రముఖ పాత్రను వహిస్తుంది. భావకవిత్వం ఈ రహస్యాన్ని గుర్తుపట్టి బహుముఖంగా గానంచేసింది. ఈ పూర్వవైభవ స్మరణ మన్నది కేవలం గత ప్రేమిక తత్త్వంకాదు. దీనికెప్పటికీ నిర్దిష్టమైన వర్తమాన సామాజిక ప్రయోజనం ఉంటుంది. దాన్ని గుర్తించకుండా కొందరు విమర్శకులు కాల్పనిక కవితలోని ఈ సుగుణాన్ని దుమ్మెత్తిపోయడం, గురజాడగారి మాటలను శిఖరాగ్రానికెత్తడం హర్షించదగ్గ విషయంకాదు. నిర్దిష్టమైన సామాజిక ప్రయోజనంగల ఈ పూర్వవైభవ సంస్మరణ కవితలు, దేశభక్తి కవిత్వంలో ఒక భాగం మాత్రమే. అలాటి సందర్భంలో "వెనుక చూసిన కార్యమేమోయి? మంచిగతమున కొంచెమేనోయ్!" వంటి గురజాడ మాటలు ఎంత అర్థవంతాలైనప్పటికీ అభిమానపాత్రాలుగా, అనుసార్య యోగ్యాలుగా అగుపించకపోవడంలో ఆశ్చర్యంలేదు. వీటికి తోడుగా గురజాడగారు ఆంగ్లేయ దొరలను పొగడడం (1912లో జార్జి చక్రవర్తిని ఉద్దేశిస్తూ వ్రాసిన గేయం) స్పష్టంగా కనిపిస్తుంది. 'దించులంగరు' కవితలోని

"వచ్చెనిదె బంగారు కాలము
వాంఛలెల్లను తీరు సుజనుల

కాంగిలేయుల ధర్మరాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్య మిచ్చుచ
నెంతతము వర్ధిల్లు గావుత"

వంటి పంక్తులు ఇంకా స్పష్టంగా గురజాడను దూరం చేస్తాయి. లంగరెత్తుము అన్న కవితలో కూడా ఆ ఛాయ కనిపించక పోదు. ప్రాసంగికంగా అన్నప్పటికీ తోకచుక్కలోని "కన్నుకావని వస్తు తత్త్వము, కాంచనేర్చిరి అంగిరీజులు, కల్లనొల్లరు; వారి విద్యల, కరచి సత్యము నరసితిన్" అన్న మాటలు నాటి దేశభక్తులనుకరిచే ఉంటాయి. ఈ మాటలు కేవలం హేతుదృక్పథంతో వెలువడినట్టివే. సహృదయంతో చూస్తే ఆ మాట నిజమనే అనిపిస్తుంది. "వెఱ్ఱి పురాణగాథ"లనడాన్ని త్రోసిపుచ్చలేము కూడా. కాని ఎలాటి నిస్సంగ వాస్తవికదృష్టి (objective perspectivism) అయినా దేశ–కాలాలవ్వ ప్రత్యయాల ప్రభావం సోకకుండా ఉండలేదు. అంచేతే దాన్ని ఆంగ్ల విద్యావ్యామోహంగా కొందరు అన్వయించుకొన్నారు. ఆయన వాస్తవికతాదృష్టి వెనుక, కించిన్మాత్రంగా 'రాజభక్తి' తొంగి చూస్తున్నదనే అనుమానం తొలగిపోదు. పీడిత ప్రజలందరూ దేశభక్తి చేసి సాగిపోతోంటే, రాజరికాల నీడలో ఉన్న గురజాడ 'రాజభక్తి' అన్నపట్టుగొమ్మ నుంటేనే దేశభక్తిని ప్రబోధిస్తున్నాడన్నమాట తెల్లమౌతుంది. తనకు నచ్చిన ఇజమ్‌నే కవిత్వంలోకి అనువదిస్తున్నాడన్న ప్పటికీ, చైనాను తిట్టాడన్నభావంతో గజ్జల మల్లారెడ్డిని పూర్తిగా హర్షించలేని శ్రీ శ్రీ గారి తత్త్వంలోకి మనం ఎదిగితే తప్ప, గురజాడగారి పై మాటల్ని నేటికీ స్వారస్యమైనవిగా మనం భావించలేము.

గురజాడగారి దేశభక్తిని గురించి కావాల్సినంత దుమారం ఏనాడో చెలరేగింది. వాదాలు, ప్రతివాదాలూ అనేకం నడిచాయి. వ్యతిరేకాల్తో బాటు, సమర్థనలూ రాకపోలేదు.[3] వాటన్నిటినీ ఇప్పుడు మనం త్రవ్వి తలకెత్తుకోవాల్సిన పనిలేదు. ఆంగ్లేయ రాజభక్తిని ప్రకటిస్తూ ఆయన వ్రాసిన రెండు మూడు కవితల్తో, ఆదర్శ కవిగా ఆయన స్థానం క్రిందికి దిగిపోనూలేదు. అయితే ఆనాడు దేశభక్తి పేరిట గురజాడగారు వెలిబుచ్చిన భావాలెలాటివి? ఎందుకు అవి తర్వాత రేఖామాత్రంగానైనా పోషింపబడలేదు? అన్న ప్రశ్నను గమనించాలి. ఆయన భావధార ఒక్క భారత దేశానికి నియతంకాక విశ్వైక కుటుంబాన్ని ప్రవచిస్తోంటుంది. స్వదేశీ ఉద్యమం పెరగాలని, ప్రపంచపు మార్కెట్‌లో దేశీయ వస్తువులు బాగా అమ్ముడు పోవాలని, దేశానికి బాగాధనం చేకూరాలని, జాతిమతాలు మరచి అందరూ ముందడుగువేసి, దేశమన్న దొడ్డవృక్షంలో ప్రేమలపూలను పండించాలని ఆయన పేర్కొన్నారు. పై మాటల్తో ఆర్థిక తత్త్వవేత్తగా, మానవతా వాదిగా ఆయన దర్శనమిస్తారు. వాటి కవితా వేగంలో ఈ రెండూ అంత ప్రాధాన్యానికి రాలేదు. లౌకికమైన విషమ సమస్యలకు అతీతంగా, ఆదర్శ సౌందర్యసీమ తయారుకావాలన్న కాల్పనికులకు ఈ రెండూ ఆవేశమివ్వని తాత్త్విక ప్రతిపాదనలే అయ్యాయి. పై పెచ్చు ఆదర్శ సౌందర్యసీమలో, ఉదాత్తమైన స్నేహానికీ, ప్రేమకూ మాత్రమే స్థానంకాని, ధనం అన్నది–తత్త్వం బంధమైన భావన అన్నది అందమైన గులాబీ కింద అగుపించే ముల్లు వంటిది. అంచేతే అది వారిని కదలించలేదు పోతే దేశభక్తి కవిత్వం వ్రాసిన కాల్పనికులకుకూడా ఆయన మాటలు ఎందుకు ప్రీతివంతం కాలేదన్నది ముందుగానే చూశాము.

అయితే ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. ఎంతటి మానవతా వాదమైన 'దేశ' మన్న తాత్త్విక ప్రత్యయానికి లోబడేఉంటుంది. ఒక దేశంలోని జనుల బాధలు ఎలాటివి, బంధనాలు ఎలాటివి అన్న దాన్ని వివక్షలోకి తీసికొంటూ, మానవతావాదాన్ని నిర్మిస్తే ఎక్కువ ఉపాదేయమౌతుంది. ఏదేశమైనా మనుషుల విలువలు ఒక్కటే కావచ్చు. మనుషులూ ఒక్కటే కావచ్చు. కాని మానవ కల్పిత సమాజం, సమాజంలోని తీరుతెన్నులు తేడాగా ఉంటాయి. సమాజానికి అతీతంగా మనిషిని చూడడం సమంజసంకాదు సామాజికమైన సమస్యలమధ్య మనిషి ఎలా నలుగుతున్నాడు అన్నదాన్ని గమనించి, ఓర్పునూ, వికాసాన్ని, ఉదారతనూ ప్రబోధిస్తూ మానవతా కవిత వెలువడాలి. ఇరవై శతాబ్దంలో–అందులోనూ ఆరంభ కాలంలో అమెరికాలోని, బ్రిటిషులోని మానవుల సమస్యలు వేరు. హిందూ దేశంలోని మానవుల సమస్యవేరు. ఇక్కడ శిఖరాగాన్ని చుంబించిన సమస్యలు రెండే. ఒకటి–బానిసత్వం, రెండు-మతధర్మం పేరిట పెచ్చు పెరిగి పోయిన దురాచారాలు–గురజాడగారి కవితలో కనిపించే మానవతావాదం, రెండవ సందర్భంలో మహత్తరంగా ఉంటుంది కాని, మొదటిదాని సందర్భంలో, మెత్తగా వెనుకనుండి దెబ్బకొడుతున్నట్టు ఉంటుంది. దేశానికి బాగా ధనం రావాలనడం, ఏదో ఒకవిధంగా దేశమేలే రారాజుకు సంపదను కాంక్షించడమే. జాతి మతాలు మరచి దేశంలో ప్రేమ పుష్పించాలనడం, ఒకవిధంగా ఆంగ్లేయులను సమర్థించడమే. ఈ గీతం ప్రక్కనే, ఆయన ఆంగ్లేయ భక్తిగీతాలను పెట్టిచూస్తే ఆంగ్లేయ వ్యతిరేకతను ప్రకటించలేని గురజాడ, తన సమర్థననే బాగా 'ఫిలసఫైజ్' చేసి, సర్వదేశాన్వయతను ఆపాదించి ప్రతిపాదిస్తున్నారేమో అనిపిస్తుంది. అంటే ఆయన దేశభక్తివరకు వెలిబుచ్చిన మానవతావాదం ఒక నెపం మాత్రమే. అందరూ బానిసత్వపు ఆందోళనతో కొట్టుకు చస్తున్నప్పుడు, తనదేశాన్ని, దేశంలోని ప్రజల ఆవేదననూ మరచి 'అందరూ కలసి దేశంలో ప్రేమను పుష్పింప చెయ్యండ'ని చెప్పడం ఆకాంక్షనీయంకాదు. అదెంత హద్దు లెరుగని మానవతా వాదమైనా, ఆదర్శనీయంకాలేదు. చక్కటి మాటల పొందికతో, ఆణిముత్యాల్లాగు వెలువడినా, సుప్తచైతన్యంలో ప్రవేశించి ప్రేరేపించగలిగే భావం కాబోదు. నిదానించిచూస్తే ఆ "మానవతావాదం" ఓ విధమైన నెపంలాగు, హిపోక్రసీలాగు కనబడకపోదు. ఆదే కవిత

ఈ రోజులో చాలా గొప్పగా ఉండవచ్చు. కాని—ఆ నాటి సామాజిక, రాజకీయ సందర్భంలో వ్యగ్రత మాత్రం మిగిలించేదిగా ఉంటుంది.

గురజాడ కవితను మిగిలిన సామాజిక సందర్భాల్లో గమనిస్తే నిక్కచ్చిగా చాలా గొప్ప కవితే. ఆయన భావ చేతనలో రవ్వంత వెలితి కాని, వెనుకబాటు కాని కనపడవు. రాజకీయ సందర్భంలో కాకపోయినా, మిగిలిన సామాజిక సందర్భంలో అయినా, ఆయన భావ చేతనను తర్వాతివారు ఎందుకు అందుకోలేకపోయారు? అన్న ప్రశ్న చాలా బాధాకరంగా ఉంటుంది. అడుగడుగునా గొప్ప సంస్కారి అగుపడుతూంటే, క్రొత్త సంస్కారంపట్ల కాంక్షకలవారు కూడా ఎందుకు అనుసరించలేదు అన్నది అర్థంకాదు.

''లవణరాజు కల''లో కులవ్యవస్థను బాగా దెబ్బతీస్తూ ఆయన వ్రాసిన మాటలు ఆయనకే చెల్లును. 1933లో నవసాహిత్య పరిషత్తు నిర్మితమై, నెమ్మదిగా భావకవిత్వంలో ఒక మార్పిడిని తేవడం మొదలు పెట్టాక కాని, శాంతినికేతన సౌందర్యధామాల్లో విహరిస్తున్న భావకవులకు గాంధీగారి అసౌందర్యవాదం అర్థంకాలేదు. గాంధీజీగారి హరిజనోద్ధరణ తెలుగుకవుల్లో కొందరినైనా ఆకర్షించడం ఆనందదాయకమే. అయితే అంతకుపూర్వం దాదాపు రెండు దశాబ్దాలకు ముందే గురజాడగారన్న మాటలు ఆయన దార్శనికతను నిరూపిస్తున్నా, ఆనాడు ఆ భావం ఎందుకు ఆకట్టుకోలేదు? విస్పష్టంగా చెప్పాలంటే నాటి నవకవుల 'బ్రాహ్మణికత' మాత్రమే దానికి కారణం. బ్రాహ్మణికత అన్నమాట బ్రాహ్మణ కులమన్న ఒక్క కులాన్ని మాత్రమే ఉద్దేశించడంలేదు. ఆచారాలతోటీ, కట్టుబాట్లతోటీ, అగ్రవర్ణాధిక్యతను చూపించే అందరి తత్వానికీ ఆ మాట ఒక సంకేతం. చాలామంది ఈ మూసలోనే తయారయ్యారు. గాంధీగారి గొప్పతనం హృదయంలో నిల్చాక కాని, ఈ 'బ్రాహ్మణికత' యొక్క మంచు పొరలు నెమ్మది నెమ్మదిగా కరగడం వదలలేదు. కాటూరి లాంటి సత్కవి గుడిగంటలను మ్రోగించింది ఆ క్రొత్త వేకువలోనే. ఆ మెలుకువ గురజాడగారి వెన్నంటి వచ్చిన భావకవులకు అర్థం కాలేదు. 'మలిన దేహాలను మాలలంటూ, మలిన చిత్తులను...' అన్న మాట తమకేమోనని భుజాలను ఎగరవేయడం కూడా జరుగుతుంది. 'మాలవారన్న వారి మందబుద్ధికి వగవవలె' నన్నమాటలు, కటువుగా వినబడి ఉంటాయి. 'మంచి యన్నది మాలయైతే మాల నేనగుదు' నన్నమాట ఆయన్ను వారినుండి దూరం చేస్తుంది...అంచేత విలువైన భావచేతన అయినా, అనుసార్యం కాకపోయింది. అందుకు ఆశ్చర్యపడవలసిన పనిలేకపోయినా, ఆవేదన మాత్రం పడకతప్పదు.

గురజాడగారు వ్రాసిన 'డామన్-పితియస్,' 'కాసులు'లోని భావాన్ని అనేకులు అనుసరించారన్న అనుమానం ఉంది. అది అనుమానం మాత్రమే. అందులోని ఆదర్శమైన స్నేహం అన్న ధ్యేయం రూపాన్ని మార్చుకునే కాల్పనికుల్లో కనిపిస్తుంది కాని, యాధార్థ్యతత్వంతో దృగ్గోచరం కాదు. ఆయన ప్రతిపాదించిన స్నేహంలోని ఆదర్శత, మానవతాసీమను దాటిందికాదు. మానవతాసీమకు బద్ధమౌతూనే, సంస్కారాన్ని కాంక్షిస్తున్నట్టిది. తర్వాతి వాళ్ళల్లో కనిపించే ఆదర్శం, మానవతా సీమకు అందుబాటులో ఉన్నట్టిది కాదు. ఒక ఊహాలోకంలో, ఒక బంగారు మేఘాల అంచుల్లో ఉండేది. దాన్నందుకోడానికి అవసరమైన రెక్కల్నిచ్చేది కాల్పనికతే. కాల్పనికత (Romanticism) అంటే సృజనాత్మకశక్తికి మారు పేరంటాడు హెర్బర్ట్ రీడ్.[4] వాస్తవమే అనిపిస్తుంది. అప్పటికే సృష్టింపబడ్డ దాన్ని అంగీకరించలేనివాళ్ళు, దాన్ని సంస్కరించుకోడానికి బదులు, ఇంకో క్రొత్తలోకాన్ని సృష్టించుకొంటారు. అయితే అలాటి క్రొంగొత్త సృజనతో, సృష్టిలోని మానవులకు కలిగే లాభం స్వల్పమే.

'కన్యక', 'పూర్ణమ్మ'లలో గురజాడగారు ఆవిష్కరించిన భావచేతన అనన్య సదృశమైంది. కన్యక కథలో ఆయన రాజరికానికి వ్యతిరేకభావాల్ని వెదజల్లాడని అనేకులంటారు. కాని అంతకంటె, మానవతాబద్ధమైన విప్లవ భావాలకు ఆయన విత్తనం వేశాడనడం న్యాయమేమో. అధికారం చెలాయిస్తున్న సమాజంలో, సంస్కారవంతంగా ఉండాలనే మానవ వ్యక్తిత్వానికి ప్రతీక 'కన్యక.' ఆ 'కన్యక'ను బలదర్పంతో అధికారులు బట్టబయల చెరపట్టనూ వచ్చు, అందుకు సంబంధించిన కుహనా ధార్మిక సూత్రాలను వల్లించనూ వచ్చు. 'నీ సొమ్ముకానిది ఏమున్నద'ని పెద్దలు, ధర్మబుద్ధులు, వత్తాసు పలకనూవచ్చు. ఆ వత్తాసుతో పవిత్రమైన 'గుడి' దాకా తరలి వచ్చిన అధికారదర్పాన్ని చూసి, ఓ మానవతా సత్యం ఆహుతైపోనూ వచ్చు. అయితే ఆ మంటను మరో పదిమంది తమ గుండెల్లోకి తీసికోకనూపోరు. ఏదో నాటికి, చారిత్రక పరిణామఫలంగా ఆ రాజు మంటిపాలు గాకనూపోదు...అయితే ఆ మంటను అందుకొనే పదిమంది...

> "......కాను వీసం
> కలిగివుంటే చాలుననుకొని
> వీర్యమెరుగక, విద్య నేర్పక
> బుద్ధి మాలిన......"

వారు కాకూడదు. ఇక్కడ వీర్యమంటే విధ్వంస బీభత్సంకాదు. విద్య అంటే నాలుగు దేశాల వార్తలూ, పరిణామాలు తెలిసికోవడంకాదు. వీర్యమన్నది ఉత్సాహానికి, దీక్షకూ సంబంధించినటిది. విద్య అన్నది ఆత్మికమైన వివేకానికి సంబంధించినట్టిది. ఈ రెండూ వాని అసలైన అర్థంలో వికసించినప్పుడే, ఇక్కట్లుతప్పి ఫలం సిద్ధించేది. "మేల్కొని బుద్ధిబలమును, బాహుబలమును పెంచి..." మాన, ప్రాణ త్రాణం చేసుకొమ్మన్న కన్యకమాట మరీ అర్థవంతమైంది. బాహుబలంకంటె ముందు పెరగాల్సింది బుద్ధిబలం. ఆత్మికమైన వివేకాన్ని సరైన అన్వయంతోటీ, ఆచరణస్థాయికి తెచ్చేది బుద్ధి. ఆ బలం

లేనప్పుడు, పరిసరాల్లో దాన్ని కలిగించనప్పుడు, వట్టి బాహుబలం ఏ ప్రయోజనాన్నీ, ఫలితాన్నీ సాధించలేదు. ఇది కన్యక ఉపదేశంలో ఏనాటికైనా దర్శించాలన్న సత్యం. అధికారదర్పంముందు మానవతలోని సుకుమారం, సంస్కారం యావత్తూ 'కన్యక'రూపమై ఆహుతైపోతుంది కాని, ఆ ఆహుతితో అనంతరం ఆవేశం అందుకోవాల్సినవాళ్ళు అర్థం చేసికోవాల్సింది, దేవత మాటల్లోని అంతస్సారాన్ని. దాన్ని నాటివారు అర్థంచేసికొని, అందుకోకపోవడం అటుంచి, నేటివారు కూడా పట్టించుకోకపోవడమే మరీ ఆశ్చర్యంగా ఉంటుంది.

ఇక 'పూర్ణమ్మ'. ఆధునిక కవితా సముద్రంలో దొరికే అనర్ఘ రత్నాల్లో ఒకటి పూర్ణమ్మ. ఇందులో సంస్కర్తగానే కాక, కవిగా కూడా పరిపూర్ణమైన వ్యక్తను కనబరిచారు గురజాడగారు. మిగిలిన గీతాల్లో కనిపించే తాత్త్విక సందేశాలు మచ్చుకుకూడా ఇందులో కనిపించవు. నిండైన కళా సౌందర్యంతో, రసశక్తితో తొణికిసలాడే కవిత ఇది. ఇందులోని మూలభావచేతన, ఆయన సంస్కరణాభిలాషను చూపించేదే. కనీసం ఇలాటివైనా కాల్పనికులను ప్రభావితం చేసి, ఆ ఆదర్శ ప్రణయతత్త్వంనుండి ఎందుకు తప్పించలేదు? అన్నది ఓపట్టాన అర్థంకాదు.

భావ కవిత్వం అన్నది అంతకు మునుపున్న కవితా తత్త్వానికి తిరుగుబాటుగావచ్చిన ఉద్యమం—అన్నమాటను అందరూ ప్రాథమికంగా అంగీకరించేదే. అంతకు మునుపటి కవితాతత్త్వం ఏమిటని చూస్తే మన కగుపించేవి మూడే. 1. హద్దులుదాటి జుగుప్సను కలిగించే శృంగారం. 2. అన్నిగుణాలకు, రూపాలకు అతీతమైన పరమాత్మపట్ల భక్తి. 3. శబ్ద పాండితీ ప్రయోగ చాపల్యం. ఈ గుణాలతో నిండిన కవితకు రసజ్ఞత' ను కోల్పోయి, దానికి తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం, ఆ గుణాలలోనే మార్పును తేవాలని ప్రయత్నించింది. వాటినుండి వైదొలగి, ఇంకో గుణాలతో కొత్త శకాన్ని ఆరంభించాలన్న స్పృహ, ఆ తిరుగుబాటు దారులకు రాలేదు. అతి వేలా శృంగారం స్థానంలో 'రమ్యాలోక శృంగారతత్త్వము,' నిరాకారమైన నిర్గుణ బ్రహ్మారాధనకు బదులు, ప్రకృత్యారాధనమూ, కాదంటే రవీంద్రుల సౌందర్య బ్రహ్మారాధనమూ; పాండిత్య చాపల్యానికి బదులు అర్థవంతమైన పాండితిని ప్రదర్శించడం ఆనాటి యువకవుల దృక్పథాలు అయ్యాయి. ఆంగ్ల విద్యాఫలితమైన హేతు దృక్పథం వాళ్ళల్లో అంతదాకే పనిచేసింది—వారిదృష్టి తిరుగుబాటుతో కొత్తదనాన్ని తేవడంలోతప్ప, సమాజాన్ని సంస్కరిస్తూ, అందులో కొత్తదనం నెలకొల్పడంకాదు. వారుతేవాలనుకొన్న కొత్తదనానికి, గురజాడగారి ఛందస్సు కాని, పలుకుబళ్ళు కాని కొంతవరకే సహకరించాయి. అంతదాకే వాడుకొని తమ దారిలో తాము సాగిపోయారు. గురజాడగారి భావచైతన్యంలోని సిసలైన వ్యక్తిత్వం వాళ్ళను ఆకట్టుకోలేదు.

కళాదృష్టిలో అయినా గురజాడగారి వ్యక్తిత్వాన్ని వాళ్ళెంత దాకా అనుసరించారు ? ఆయన నవచేతన, నాటికాలంలో ఎంతవరకు ప్రతిఫలించింది? అన్నదాన్ని గమనిస్తే అక్కడా మనకు సమాధానాలు మృగ్యమే. గురజాడగారు కథనాత్మక గేయాల్లో (పూర్ణమ్మలోతప్ప) అధికంగా సంభాషణారీతిని ప్రవేశపెట్టారు ద్రావిడదేశానికి అత్యంత సహజమైన (indigenous) గుణంగా ఇది మనకు అగుపడుతుంది. 5 ఆర్యసాహిత్యంలో వర్ణనాత్మక ఫణితికే ప్రాధాన్యంహెచ్చు. ఈమాట స్పష్టం కావాలంటే ఒకసారి ఆర్యులకు సంబంధించిన వేదసాహిత్యాన్ని, ద్రావిడులకు సంబంధించిన సంగవాఙ్మయాన్నీ పరిశీలిస్తే చాలు. ద్రావిడ తత్త్వాన్ని (తెనుగునాడు తత్త్వాన్ని) బాగా ఆకళింపు చేసికొన్న తిక్కన్న అంచేతే నాటకీయశైలిని అంత సజీవంగా తొణికిసలాడించగలిగారు. చాలామంది తెనుగు కవులు, పూర్వకాలంలో, ఆధునిక కాలంలోనూకూడా ఆర్య సాహిత్య ప్రభావాన్ని తమ అంతశ్చైతన్యంలో భద్రపరచుకొన్నవాళ్ళే. అంచేతే ఆ నాళ్ళల్లో తిక్కన్న తీరు తక్కువగా అనుసార్యమైనట్లే, ఈనాళ్ళలో గురజాడ రీతికూడా బహుళ ప్రజాదరణను అందుకోలేకపోయింది. గురజాడగారు ప్రవేశపెట్టిన సంభాషణలన్నీకూడా చాలా 'ప్రిసిపిటేటెడ్'గా ఉన్న సిద్ధాంత తత్త్వాలే. అవి కళాదృష్టితో ఎక్కువ ఉత్తేజాన్ని ప్రసాదించలేవు. ఏవో తత్త్వాల్లాగా చెల్లుబాటైపోతాయి. అలాటి తాత్త్విక ప్రతిపాదనలు లేని కవిత పూర్ణమ్మ ఒక్కటే. అయితే ఇందులో అగుపించేది సరికొత్త మార్గరీతి (classicism) మాత్రమే. కొత్త రకాల భావచిత్రణకాని, పలుకుబళ్ళ నిర్మాణంకాని, ఊహాపోటిమలుకాని లేవు. 'భాష్యజ్ఞేయ విద్యార్థి' త్వముతో ప్రభావితమైన కొత్తతరం, కొంగ్రొత్త ఊహల కసరత్తుకే ఉద్యమించిందికాని, ఈమామూలు. మాటలను ఎక్కువగా గుర్తుపెట్టుకోలేకపోయింది.

ఈవ్యాసంలో ముఖ్యంగా ఉద్దిష్టమైన విషయం—'యుగకర్త' అన్నమాట ఎప్పుడు ఎవరికి అన్వయమౌతుంది? అన్నదే. గురజాడగారిని యుగకర్త అనడం, ఒకవైపు రాయప్రోలుగారికి అన్యాయం చేయడమే అయినా, ఇంకోవైపు నాటినుండి, నేటిదాకా ఎవరూ అందుకోలేని భావచేతనను చిత్రించిన గురజాడగారికీ అన్యాయం చేయడమే. ఆయనకు ఆయనే ఒక విశిష్టశైలి. విశ్వనాథగారిని అనుకరించి చెప్పాలంటే — 'ఒక్కరు గురజాడ'.

## — అధోజ్ఞాపికలు —

1 ఆధునికాంధ్ర కవిత్వము. సంప్రదాయములు: ప్రయోగములు — డా. సి. నా. రె. గారు. పుట 174.

2 సాహిత్య వివేచన — డా. ఎస్. సుబ్బారెడ్డిగారు.

3 'మహోదయం' — శ్రీ కె. వి. రమణారెడ్డిగారు.

4. The philosophy of Modern Art. Herbert Read.

5. Land scape and poetry. S. Thaninayagam.

# బసవ పురాణములో జానపద కళాధర్మములు

## డా. తిమ్మావజ్ఝల కోదండరామయ్య

జానపద సాహిత్యమునకు చెందిన వీరగాథల (ballads)లో కానవచ్చు సామాన్యలక్షణములలో కొన్ని పాల్కురికి సోమనాథుని బసవపురాణ పండితారాధ్య చరిత్రములందు కానవచ్చుచున్నవి. వీరగాథలయందు సాధారణముగా పునరావృత్తి లేక దరువు (Refrain) అభివర్ధిత పునరుక్తి (Incremental Reptition), వారాను వర్ణనములు (Ballad common places) అను మూడు లక్షణములు ప్రధానముగా నుండునని పాశ్చాత్య విద్వాంసులు చెప్పుదురు. ఈ మూడు లక్షణములును పాశ్చాత్య వీరగాథలయందు వలెనే భారతీయ భాషా గ్రథితము లయిన వీరగాథలయందును కలవు వీరగాథా రచనములో పునరావృత్తి (Refrain) ఒక ప్రధాన లక్షణము. ప్రాచీన కాలమునందలి పాశ్చాత్య వీరగాథలలో ప్రధాన గాయకుడు వీర గాథా చరణములను గానము చేయుచుండగా అతనికి సహాయభూతులయిన తక్కిన గాయకులు ఈ పునరావృత్తితో అతనితో గొంతుకలిపి పాడెడివారు. ఇది వీరగాథల (Ballad) లో విరళముగను, వీరగాథానికల (Ballad lings)లో తఱచుగను కానవచ్చును. వీరగాథా చక్రముల (Ballad cycles)లో ఇది పరిత్యజింపబడినది. తెలుగున తుమ్మెద పదములు, వెన్నెల పదములు మొదలగు గేయరచనలలో ఈ పునరావృత్తి కానవచ్చును. తందానతాన, భళి భళీ, మేలు భళీ, భళానోయి భాయి తమ్ముడా మొదలగు పునరావృత్తములు వీరగాథలలో నేటికిని కానవచ్చును. పలనాటి వీరచరిత్ర, కాటమరాజు కథ అను వీరగాథా చక్రములలో ఈ పునరావృత్తి లక్షణము దృగ్గ్యము.

పునరావృత్తిగా పలుకబడు పదమునకు అర్థముండవలయునను నియమము లేదు. తఱచుగా నిది అర్థరహితముగనే యుండును. ఒక్కొక్కప్పు డది అన్యభాషలనుండి యెరవు తెచ్చుకొన్నది కూడ కావచ్చును. ఇది బహుశః సంగీతవాద్యములవలన నుత్పన్నమగు మధుర శబ్దమునకు పర్యాయముగా పాడుకలోనికి వచ్చియుండును. ఆంగ్ల విమర్శకులు దీనిగూర్చి తెలిపిన ఈ వాక్యములు తిలకింపుడు.

'This refrain often appears to be non-sence. but it probably had some sence originally—it was perhaps meant to represent the sound of musical instruments or some action on the part of the dancers.

—Mrs. Margaret L. Woods : Essays by Diverse hands.

Vol VI. P. 27.

సుదీర్ఘములయిన వీరగాథలలో ఈ పునరావృత్తి పూర్తిగా పరిత్యజింపబడి ఆఖ్యాన కథనము మాత్రమే ప్రాధాన్యము వహించును. సోమనాథుని బసవ పురాణ పండితారాధ్య చరిత్రములు ద్విపదచ్ఛందమున నిబంధింప బడుటచేత - సుదీర్ఘములయిన యితివృత్తములు కలవి యగుటచేత వీరగాథా చక్రములయందువలెనే యిందును పునరావృత్తికి అవకాశము లేకపోయినది. కాని యిట్టి పునరావృత్తిని పాదాంతములయందు చేర్చి పఠించినచో అవియు వీరగాథలవలె గానానుకూలమ్మై, వీరగాథా గానమున కలుగు నానందావేశముల నొసగ జాలి యుండును. బసవ పురాణమునందలి యీ క్రింది పంక్తులను తందాన తాన అనియో, భళి భళి అనియో పునరావృత్తిని చేర్చి పఠించిన వీర గాథాగానానుభవము కలుగును. చూడుడు :

శివరాత్రి నిత్యంబు చెల్లించు బాస—తందాన తాన
శివభక్తు లెల్లను శివుడను బాస—తందాన తాన
భక్తుల యెగ్గులు పట్టనిబాస—తందాన తాన
భక్తుల కులమెత్తి పలుకనిబాస—తందాన తాన
వృద్ధుడైన నొకమాటి యడుగని బాస—తందాన తాన
అడిగిన యర్థంబు గడపనిబాస—తందాన తాన

—బస. 2–70 పుట.

ఇట్లే యీ ఘట్టమున నెన్ని పంక్తుల నయినను పాడుటకు వీలగును.

వీరగాథలయందు కానవచ్చు మఱొక లక్షణము అభివర్ధిత పునరుక్తి (Incremental Repetition) వీరగాథలలోని కథా కథనము ఒక విచిత్ర పద్ధతిలో సాగును. మునుపు పాడిన ఖండికనే

సుటుల విత్తుకొని పాడె, తత్సంబంధమైయున నూతన ఖండికము చేర్చు కొనుచు పోవుట వలన కథ ముందునకు నడచుచుండును. పాశ్చాత్య వీరగాథలలోను, భారతీయ భాషలయందలి వీరగాథలలోను కూడ ఈ పద్ధతి కలదు. ఆంగ్ల విమర్శకులు దీనిగూర్చి తెలిపిన యీ క్రింది వాక్యములను తిలకింపుడు :

'The main structural feature of popular ballads is simple repetition with incremental changes, utterly void ot metaphor which advance the statement of fact and help narrative, however slowly, on its way'.

—F. B. Gummere: The popular Ballad, p 42

'The successive addition of new bits of fact as the bits alreaday familiar are repeated' —

—Bliss Perry : A study of poetry. P. 280.

ఇట్టి అభివర్ధిత పునరుక్తి కల క్రింది యాంగ్లేయ రచనలను కాంచుడు:

I started up the trial October twenty third
I started up the trial with 2-U herd,

ఇది అమెరికాలోని 'cowboy Ballad's లోని రచనా పద్ధతి. అట్లే మఱొకటి.

Christine, Christine, tread a measure for me
A silken sark I will give to thee
A silken sark I can get me here
But I'll not dance with the prince this year

Bliss perry : A study of poetry. p. 280.

కన్నడ బాషయందలి 'కెరెగెహార'[1] అను జానపదగేయము నందుకూడ ఈ యభివర్ధిత పునరుక్తి కానవచ్చును. చూడుడు :

'కల్లనకేరి మల్లన గౌడ కెరె యొంద కట్టిస్యాన
కెరె యొంద కట్టిస్యాను సెరె ముక్కా నీరిల్ల
సెరెముక్కా నీ రిల్ల హోత్తిగ తగస్యారు
హోత్తిగ తగ స్యారు జోయిసు కేళ్యారు '

*　　*　　*

'నణ్ణాసాసి భాగీరథి జళకవ మాడ్యాళు
జళకవ మ్యాడ్యాళు బంగారబుట్టి తుంబ్యాళు
బంగారబుట్టి తుంబ్యాళు సింగారసింబి మాడ్యాళు
సింగారసింబి మాడ్యాళు ముంద ముంద హొంటాళ'

*　　*　　*

'గండ మాదేవరాయ దండి నాగైదాను
దండి నాగైదాను కండనుకట్టి కనస'

తెలుగులోని వీరగాథలలోను, వీరగాథాని కలలోను, కొన్ని గేయ రచనములలోను కూడ ఇట్టి యభివర్ధిత పునరుక్తి కలదు. బొబ్బిలి యుద్ధము అను వీరగాథలోని యీ అభివర్ధిత పునరుక్తు లను చూడుడు :

మొదటిరకము :

నూటికి పొడిచి సెల గంటాడు భూపతిరాయడు
నూటికి పొడిచి సెల గంటాడు మల్హారాయడు
నూటికి పొడిచి సెల గంటాడు ధర్మారాయడు
నూటికి పొడిచి సెల గంటాడు పడాలరాముడు

1. 'కెరెగెహార' — కన్నడ జానపద గేయము, 'కన్నడద బాపుట' అను సంకలనమున కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగుళూరు — వారిచే పకటితము. దీనినిగూర్చి 'సాహిత్య సమితి వ్యాసావళి' లో శ్రీ రాళ్లపల్లి జయంతగారు ఒక వ్యాసము వ్రాసిరి. ప్రచురణ : తిరుపతి సాహిత్య సమితి, 1967.

నూటికి పొడిచి నెల గంటాడు గుమ్మళ్ళ బుచ్చయ్య

*　　*　　*

నూటికి పొడిచి సెల గంటాడు మహ్మదు ఖాసీము
నూటికి పొడిచి సెల గంటాడు తులసీరామైతే ...

— బొబ్బిలికథ. పుట 81.

రెండవరకము :

గోలకొండ యేరభూపతికే జాబు లంపినారు
కిమిడి నున్న నారాయణ దేవుకు జాబు లంపినారు
ఆటగర్ల హరిచంద్రునికైన జాబు లంపినారు
మాడుగు లేలే లింగారావుకు జాబు లంపినారు
మన్య మేలే మన్యభూపతికి జాబు లంపినారు
కోయ నున్న కోయభూపతికి జాబు లంపినారు
వొంటి మీసపు భూపతిరాజుకు జాబు లంపినారు
కొప్పాడ రామయ్యగారికి జాబు లంపినారు
దూసరి వెంకప్పారావుగారికి జాబు లంపినారు
బొగ్గులూరి మరి జగ్గిరెడ్డికి జాబు లంపినారు
హసన్ బేగుకు భైరవరాజుకు జాబు లంపినారు

ప్రతి పాటి పాపయ్యరాజుకు జాబు లంపినారు
సూర్యరాజుకు చందరాజుకు జాబు లంపినారు
కడపాల బుచ్చయ్యగారికి జాబు లంపినారు
చిత్తార సూరయ్యగారికి జాబు లంపినారు
అనకాపల్లి పాపారావుకు జాబు లంపినారు
రాజ శ్రీరామమూర్తి నీలాద్రిరావుకు జాబు లంపినారు

— బొబ్బిలికథ — పుటలు 23,24.

మూడవ రకము :

పూలతోట మజిలీలన్నా భీమసింగిలోను
భీమసింగి మజిలీలన్నా ఆలమందాలోను
ఆలమంద మజిలీలన్నా కసిమికోటలోను
కసిమికోట మజిలీలన్నా యెలమంచిలిలోను
ఎలమంచిలి మజిలీలన్నా యేటికొప్పాలోను
ఏటి కొప్పాక మజిలీలన్నా గుడిచెర్లాలోను
గుడిచెర్లా మజిలీలన్నా సత్యారములోను
సత్యారము మజిలీలన్నా సబ్బారములోను
సబ్బారము మజిలీలన్నా చోడారములోను
చోడారము మజిలీలన్నా ఆలవెల్లిలోను
ఆలవెల్లి మజిలీలన్నా పిరాపురములోను — ఆ
పిరాపురము మజిలీలన్నా పెద్దాపురములోను
పెద్దాపురము మజిలీలన్నా రావుల చెరువేమి
రావుల చెరువు మజిలీలన్నా నల్లచెరువుకాడ
నల్లచెరువు మజిలీలన్నా రాజానగరము
రాజా నగరంలో దిగి వున్నాడు కళింగ మహరాజా

— బొబ్బిలికథ. పుట 27.

'కెరెగెహార' అను కన్నడ జానపదగేయమునుండి అభివర్ధిత పునరుక్తి కుదాహరణముగా మును పుదాహృతము లయిన పంక్తులు ఈ మూడవ రకమునకు చెందును. 'రాములపాట' అను జానపద గేయమునందలి యీ యభివర్ధిత పునరుక్తిని గుర్తింపుడు :

'నారసీరలు గట్టి ఎలియ బానము తొడిగి
అడవులకు పయన మయిరీ
ముందరా రాములూ వినక జానకిదేవి
ఆరెనుక లచ్చుమన్నా
ముంతలా రాములూ వినక జానకిదేవి
ఆరెనుక లచ్చుమన్నా
అడుగడుగు వెడతాడు అటుమళ్లి సూత్తాడు
ఆగ్రకోపము జేయుసూ —

ఇట్టి యభివర్ధిత పునరుక్తి వీరగాథలం దంతటనుగానరాదు. అచ్చటచ్చట మాత్రమే యీ పద్ధతి కానవచ్చును. ఇది వాగ్రూప ప్రచారము మాత్రమే కల వీరగాథలను గానము చేసెడి గాయకులకు తరువాతి పంక్తులు జ్ఞాపకము వచ్చుటకును—గానము చేయబడు వీర గాథయందలి యానుపూర్వి శ్రోతలకు బాగుగా గోచరింప జేయుటకును తద్రచయితలు అవలంబించిన విధానమయి యుండును. ప్రౌఢ కవిత్వమునందును — పాఠ్యములయిన శ్రవ్య కావ్యములయందును ఇట్టి యభివర్ధిత పునరుక్తికి అవకాశము లేదు. అవి విషయ ప్రధానముగా మాత్రమే సాగును. గాన ప్రధాన మయిన వీరగాథలయందు విషయ మల్పము; పునరుక్తి యధికము. ఈ వాక్యములు తిలకింపుడు :

**'The maturer the stage of poetry the less repetition and more facts; reversed the fewer facts the greater amount of repetition.'**

**— F. B. Gummere ; The popular ballad, P. 86**

వీర గాథలకు సంబంధించిన యీ అభివర్ధిత పునరుక్తి సోమనాథుని బసవపురాణ, పండితారాధ్య చరిత్రములయందు కానవచ్చుచున్నది. బసవపురాణము ప్రథమాశ్వాసములోని యీ క్రింది పంక్తులను తిలకింపుడు :

'బసవని శరణన్నఁ బాపక్షయంబు
బసవని శరణన్నఁ బరమపావనము
బసవని శరణన్నఁ బ్రత్యక్ష సుఖము
బసవని శరణన్న భవరోగహరము
బసవని శరణన్న భక్తి సేకూరు
బసవని శరణన్న బంధము ల్వాయు
బసవని శరణన్న భాగ్యము ల్వొందు
బసవని శరణన్నఁ బరఁగు శీలంబు
బసవని శరణన్నఁ బాయు నాపదలు
బసవని శరణన్నఁ బ్రబలు సంపదలు
బసవని శరణన్న నసలారుఁ గీర్తి
బసవని శరణన్న ఫలియించుఁగోర్కి
బసవని శరణన్న నెసగు వాక్సిద్ధి
బసవని శరణన్న భ్రాజిల్లు బుద్ధి —

— బస 1-10 పుట.

* * *

'బసవా యనఁగ విన్న బానఁ లొండేల ?
పసులకు నైనను బబలదే భక్తి
బసవా యనఁగ విన్నఁ బాన లొండే ?
పసిబాలురకు నైన నెసగదే భక్తి

బసవా యనఁగ విన్నఁ బొన లొం డేల ?
యసమాక్షునకు నైన నలరదే భక్తి
బసవా యనినఁ జాలుఁ బొనలొం డేల ?
యసలార విషమైన నమృతంబు గాదె
బసవా యనినఁ జాలుఁ బొనలొం డేల ?
పసిగమైఁ గులిశంబు గుసుమంబు గాదె
బసవా యనినఁ జాలుఁ బొన లొండేల ?
వసుధ శత్రులు మిత్రవర్గంబు గారె
బసవా యనినఁ జాలుఁ బొన లొం డేల ?
వెనఁగాలు కార్చిచ్చువెన్నెల గాదె.

బస. 2-87 పుట.

సోమనాధుని పండితారాధ్య చరిత్రమునందుకూ యభివర్ధిత పునరుక్తి కలదు. ఈ క్రింది పంక్తులు తిలకింపుడు ;

'పండితారాధ్యులఁ బ్రస్తుతించినను
నిండారు శివభక్తి నియతి వ్రటిల్లుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించినను
దండతండములు పాతకములు వొలియుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించినను
బండిన సద్భక్తి భాగ్యంబు వొందుఁ
బండితారాధ్యులఁ బస్తుతించినను
మండెడి దావాగ్ని మంచయి పోవుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించినను
జండోరగాది విషంబులు గ్రాఁగుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించినను
దుండగంబులు బహుదుఃఖముల్ వాయుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించినను
దండి భవాంబుధి దరతర మింకుఁ
బండితారాధ్యులఁ బ్రస్తుతించిన వ
ఖండితైశ్వర్య ప్రకాశత దనరు......

పండి 1-4 పుట

అందే మఱొక స్థలమునందలి యీ అభివర్ధిత పునరుక్తిని తిలకింపుడు.

'వారక దాపయ్య వస్త్రంబు గట్టి
యూరగింపక పోయినట్లు పోరాదు
కోరి చిర్తొండని కొడుకుఁ జంపించి
యూరగింపక పోయినట్లు పోరాదు
ఆరయ బల్లహు నాలంబు సేసి
యూరగింపక పోయినట్లు పోరాదు
కూరంగ జలముల గుండయ్య ముంచి
యూరగింపక పోయినట్లు పోరాదు
కూరిమి నంబెన కొడు కని పట్టి
యూరగింపక పోయినట్లు పోరాదు
చేరమ ముందఱఁ జెలువుగా నాడి
యూరగింపక పోయినట్లు పోరాదు
సారంపు టణుమూర్తి నందనం బలఁది
యూరగింపక పోయినట్లు పోరాదు
ఆర నిహిళుని ధూపావసరమున
నారగింపక పోయినట్లు పోరాదు
ధీరు డౌ నమినంది దీపముల్ సూచి
యూరగింపక పోయినట్లు పోరాదు
చేరి పిళ్ళయి నారిచే భూతిఁ గొంచు
నారగింపక పోయినట్లు పోరాదు

పండి. 1-137, 138 పుటలు.

బసవ పురాణములో మఱొక రకమైన యభివర్ధిత పునరుక్తి యిది :

'రుద్రాక్ష శైలముల్ రుద్రాక్ష తరులు
రుద్రాక్ష గనులును రుద్రాక్ష నదులు
భసి తంపుగిరులును భసితంపు దరులు
భసితంపు గనులును భసితంపు నదులు
లింగ పర్వతములు లింగవృక్షములు
లింగాకరంబులు లింగతీర్థములు
జంగమ శైలముల్ జంగమ తరులు
జంగమ గుల్మముల్ జంగమ లతలు
సల్లాప శైలముల్ సల్లాప తరులు
సల్లాప గుల్మముల్ సల్లాప లతలు
గాయక శైలముల్ గాయక తరులు
గాయక గుల్మముల్ గాయక లతలు

బస. 3-211 పుట.

ఇందు గిరులు, తరులు, గనులు, నదులు—గిరులు, తరులు, గుల్మములు, లతలు అనువరుసను అభివర్ధిత పునరుక్తి బోధింపబడి నది. తరువాతి పంక్తులలో కడపటి నాలుగింటికి తోడు మఱి నాలుగు చేర్చబడినవి. అవి మృగములు, అలులు, పకులు, ఫణులు. ఇప్పుడు చూడుడు :

'గాయక శైలముల్ గాయక తరులు
గాయక గుల్మముల్ గాయక లతలు
గాయక మృగములు గాయకాలులును
గాయక పక్షులు గాయక ఫణులు
నాట్యపర్వతములు నాట్యవృక్షములు
నాట్య గుల్మంబులు నాట్యవల్లరులు
నాట్యమృగంబులు నాట్యపక్షులును
నాట్యోడగంబులు నాట్యవానరులు'

బస-3-212 పుట.

తొలి యెనిమిదింటిలోని అలులకు మాఱుగా తరువాతి యెనిమిదింటిలో 'వానరులు' నిలుపబడినది. తక్కినవి యట్లే యున్నవి. తొలి యెనిమిదింటిలోని 'గాయక'కు మాఱుగా తరువాతి యెనిమిదింటిలో 'నాట్య' నిలుపబడినది.

'ఎక్కి వీక్షింప నీ రేడు లోకములు
నక్కజంబుగఁ గాంచునట్టి శైలములు
ఎక్కి వీక్షింప నీ రేడు లోకములు
నక్కజంబుగఁ గాంచునట్టి వృక్షములు
ఎక్కి యూఁగించిన నెక్కడికైనఁ
జక్కనఁ గొనిపోవఁ జాలు శైలములు
ఎక్కి యూఁగించిన నెక్కడికైనఁ
జక్కనఁ గొనిపోవఁ జాలువృక్షములు
ఎక్కి తలంచిన నే రూపమయిన
గ్రక్కున నప్పుడ కాఁజేయు తరులు.

బస. 3-214 పుట.

ఇందు వీక్షింప, ఊఁగించిన, తలంచిన అనుపదములు నాలుగేసి పాదముల కొకమాఱు మార్చఁబడినవి. తక్కిన పాదభాగము లట్లే పునరుక్తము లయినవి. ఒకే విషయము, ఒకే రకమయిన రచనముతో అట నట చిఱుమార్పులతో క్రమాభివృద్ధిని సాధించుచు ప్రతిపాదింపబడినది.

ఒక్కొక్కచో పాటకు పల్లవివలె కథాసందర్భములో మొదట చెప్పిన ద్విపద చరణములనే కథాంతమున చేర్చుచు మూలకథా సూత్రమునకు సమన్వయించు విధానము కూడ చూపట్టును. పండితారాధ్య చరిత్రమునందలి పురాతన ప్రకరణమున వెల్లగొండ మహదేవయ్య అను భక్తుడు శివోపకరణములు తాకిన కారణముచే తన పాదములను ఖండించుకొనగా ఆతనికి మరల ఆ పాదములను పండితారాధ్యుడు పరమేశ్వరుని కరుణచే నిప్పించెను. ఆ సందర్భమున అట్టివే యగు మఱికొందఱు శివభక్తుల కథలను అనుసంధించెను. ప్రతి కథాంతమునను అవే ద్విపదపంక్తులు పునరుక్తములు నేయబడి యుండుట యీ సందర్భమునందు గుఱుతింపదగ యున్నది. చూడుడు:

కళియంబ పిళ్ళనైనారు కథ:

అప్పాట నీ పండితారాధ్య దేవుఁ
డిప్పించెఁ బాదంబు నీశుచే నేడు
తెల్లంబుగా మహాదేవయ్యగారి
కెల్లవారును జూడ నిల నట్లుగాక

—పండి-2-295 పుట.

దసరయ్య కథ:

అప్పాట దసరయ్య యూయయ్యో కిచ్చెఁ
జెప్పఁ జిత్రము గాఁగఁ జేతులు రెండు
నప్పుగా నీ పండితారాధ్య దేవుఁ
డిచ్చెఁ బాదములు దా నిప్పు డొప్పారఁ
దెల్లంబుగా మహాదేవయ్యగారి
కెల్లవారును జూడ నిల నట్లుగాక

—పండి. 2-314 పుట.

గురు భక్తయ్యకథ, గురుభక్తాండారి కథ, చెలిదేవి వేమ నారాధ్యులకథ సకలేశు మాదిరాజయ్య కథ, కదిరె వేమయ్యకథ, చేటల వేమయ్యకథ యను తరువాతి కథలం దన్నిట కూడ కడపట నిట్లే 'తెల్లంబుగా మహాదేవయ్యగారి, కెల్లవారును జూడనిలనట్లుగాక' అను ద్విపద చరణములు పునరావృత్తములై ప్రధాన కథతో సమన్వయము కుదుర్చుకొనుచు మఱొక కథకు ఉపక్రమణము కలిగి యున్నది. కడపటిదగు చేటల వేమయ్యకథలో మాత్రము దాని తరువాత మఱొక కథ యేదియు చెప్పబడక పోవుటచే ఆ పంక్తులలో 'అట్లుగాక' అను టకు మాఱుగా 'ఎలమి, దుల్కాడ' అని మార్చబడి యున్నది. ఇదియు ఒకవిధమయిన అభివర్ధిత పునరుక్తియే యగును. వీరగాథా లక్షణమగు నిట్టి అభివర్ధిత పునరుక్తి (Incremental Repetition) సోమనాథుని బసవ పురాణ పండితారాధ్య చరిత్రములందు పెక్కు స్థలములలో వివిధరీతుల ప్రదర్శింపబడినవి.

వీరగాథలలో కానవచ్చు మూడవ గుణవిశేషము వారాను వర్ణనములు (Ballad common places). వీరగాథలలో ఆ యా రచనముల కనుగుణముగా కొన్ని పడికట్టు పదములును, వాక్యములును మాటిమాటికి ప్రయోగింపబడుచుండును. ఆంగ్లేయ వీరగాథలలో ఇట్లు మాటిమాటికిని ప్రయోగింపబడు పడికట్టు పదములను పద బంధములును, వాక్యములును (Ballad common places) అందురు.

తెలుగువీరగాథలలో కూడ ఇట్టి వారోక్తులు లేక వారానువర్తనములు పదింబదిగా కానవచ్చుచుండును. అవి యా యా కవీశ్వరులకు మిక్కిలి ప్రీతిపాత్రములయిన వానిగా మనము భావింపవచ్చును. ఆ యా సందర్భాను గుణముగా అవి యాతని నోట సర్వసాధారణముగా—అప్రయత్నముగా—వెలువడుచుండును. ఒక వీరగాథలోనే కాక-ఒకే కవి రచించిన పెక్కు వీరగాథలలోను అతని కిష్టములయిన పద, పదబంధ, జాతీయ, వాక్య ప్రయోగము లుండును. ఇట్లు కాక భిన్నకవి విరచితము లయినను వీరగాథాకథలు సర్వసాధారణముగా ఆ యా సందర్భముల కథనములోను, వర్ణనములోను ఒకే రకమయిన పదాదులను ప్రయోగించుటయు కలదు. తెలుగు వీరగాథలలో కోపమును వర్ణించునపుడు సాధారణముగా 'ఆగ్రగుడ్డై మండి', తెల్లని గుడ్లకు తెచ్చె రకతంబు, ఎర్రనిగుడ్లకు ఎక్కె రకతంబు, అని వర్ణించుట పరిపాటి. శోకమును వర్ణించునపుడు -'కుడికంటి వుదకాలు కుంబవరుషములాయె. ఎడమకంటి వుదకాలు యేరులై పారె' అని వ్రాయుట, పాడుట పరిపాటి గళ్ళున నవ్వుట, కిలకిలారించుట అను జాతీయములు పెక్కు చోట్ల కానవగును. 'వినుము కాటమరాజ! విశదంబుగాను' — వినుము కాటమరాజ! విన్నపం బొకటి—ఇత్యాది వాక్యములు వీరగాథలలో కోకొల్లలు.

ఆంగ్ల విమర్శకులు ఈ వారానువర్తన లక్షణమును గూర్చి యిట్లు నుడివి యున్నారు. చూడుడు :

'They make shameless use of 'common places', that is, stock phrases, lines or stanzas which are conveniently held by the memory and which may appear in dozens of different places. They also contain many words and phrases such as 'gay lady' and 'proud porter' which are used again and again and are called 'Ballad common places.'

G. F. Whicher, The World Book Encyclopaedia.
Vol. 2, p. 616.

ప్రపంచమునందలి వీరగాథ లన్నిటియందును సర్వసాధారణముగా కానవచ్చు ని 'వారాను వర్తన' లక్షణము సోమనాధుని రచనలయందును కానవచ్చుచుండుట గమనింపదగి యున్నది. ఇవి చూడుడు:

ఇది యెంత వెద్క ?
నీ ప్రాప్తియే
కల గని మేల్కొన్న కరణి
పూసలలోన దారంబు కియ
కన్నుల నవ్వి
మెఱుగులఁ గన్నులు మిఱుమిట్లు వోవ
వీరమాహేశ్వరాచార వ్రతుండు
త త్ప్రస్తవమున
పరిచ్ఛేదియై
మందున కైన
ముంజేతి కంకణంబున కద్ద మేల?
కన్నుల వీక్షించు
నిలుకాల నిలువ నేరక
కల నైన.

సోమనాధుని బసవపురాణ, పండితారాధ్య చరిత్రములు రెంటను ఇవి తఱచుగా ప్రయోగింపబడియున్నవి. ఇందుచే వీరగాథా సహజమగునీ 'వారానువర్తన' లక్షణముకూడ సోమనాధుని గ్రంధములలో నుండుట సిద్ధాంతిత మయినది. ఇట్లు సోమనాథుడు వీరగాథాసహజములగు అభివర్ధిత పునరుక్తి (Incremental Repetition), వారానువర్తనములు (Ballad common places) లను లక్షణములను తన కావ్యములందు పదింబదిగా పాటించి యుండుటచేతను—పునరావృత్తి (Refrain) లక్షణము వీరగాథలలో విసర్జింప బడినను—అది చేర్చినపుడు వీరగాథలవలెనే బసవపురాణ, పండితారాధ్య చరిత్రములు పఠింపనగుచుండుటవలనను సోమనాథుని రచనా విధానము సంపూర్ణముగా దేశిలక్షణ లక్షిత మనియు, జానపద కళాధర్మములందు గోచరించుచుండుననియు, మార్గ రచనావిధానమునకిది పూర్తిగా భిన్నమనియు సిద్ధాంతితమగుచున్నది.[1]

1 వీరగాథాలక్షణములు, తల్లక్ష్యములు డా. తంగిరాల వేంకట సుబ్బారావుగారి 'తెలుగులో వీరగాథా కవిత్వము' అను సిద్ధాంత వ్యాసమునుండి గ్రహింపబడినవి. వారికి కృతజ్ఞుడను.

# ఆంధ్రుల సాంఘిక చరిత్ర

[ఆంధ్రుల సాంఘిక చరిత్ర. రచయిత బి. ఎన్. శాస్త్రి (ప్రథమ ముద్రణము 1975) సరస్వతీ నిలయం, నారాయణగూడ హైదరాబాదు-29. పేజీలు 402 వెల : రు 25.]

ఆంధ్రుల చరిత్ర గురించిన పరిశోధన నేటికీ సమగ్ర ధోరణిలో జరగలేదు. దీక్షాపరులైన వ్యక్తుల ప్రయత్నాల ఫలితంగానే నిలిచిపోయింది. ఇప్పుడిప్పుడే సంస్థాపరమైన ప్రణాళికలు ప్రారంభమౌతున్నాయి అదీగాక చరిత్ర పరిశోధనము రాజవంశాలు, రాజుల కాలనిర్ణయాలు, యుద్ధాలు, వాని కారణ ఫలితాలు, కొంతవరకు పరిపాలనా పద్ధతులు, వాని విషయాలు వర్ణించడం, చర్చించడానికి పరిమితమైంది. ఈనాడు చరిత్రకారుల దృక్పథం మారింది. ఈ విషయాలు ప్రాముఖ్యం తగ్గింది. నిజంగా చరిత్రలో ప్రధానమైన విషయాలు. సాంఘిక, సాంస్కృతిక, వైజ్ఞానిక పరిణామాలుకాని మత రాజకీయ సంఘటనలు కావనే చరిత్ర పరిశోధనాలక్ష్యం గుర్తింపులోనికి వస్తున్నది. ఆంధ్రుల సాంఘిక వ్యవస్థ ప్రాచీన కాలంనుండీ ఎంతో పరిణితి నందినది. ఆంధ్రుల సంస్కృతి దేశంలోను, విదేశాలలోను పూర్వకాలంనుండీ పెంపొంది విశిష్టంగా నిలిచింది కాని ఆ విషయాలను చర్చించి వివరించే ప్రామాణిక గ్రంథాలు ఇంకా రాలేదు. వీనిని ఆంధ్రుల చరిత్ర గ్రంథాలలో, వ్యాసాలలో అచ్చటచ్చటా స్థూలంగా పేర్కొనడం మాత్రం జరిగింది. ఆంధ్రుల సాంఘిక చరిత్రను ప్రత్యేక గ్రంథంగా ఆంధ్రలోకాని కందించిన ప్రథమ గౌరవం కీ శే. శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారికి దక్కింది. కాని ఆయన రచన తూర్పు చాళుక్య యుగంనుండి నేటి కాలంవరకు పరిమితమైంది. "ఇకముందు ఈ సాంఘిక చరిత్ర పూర్వభాగమును శాలివాహన కాలమునుండి రాజనరేంద్రుని కాలమువరకు వ్రాయుటకు పూనుకొందు"నని శ్రీ రెడ్డి వ్రాసినారు. కాని అది జరుగలేదు. ఆ కొరత తీర్చుటకు శ్రీ బి. ఎన్. రెడ్డి పూర్వాంధ్ర సాంఘిక చరిత్ర 'అశోక చక్రవర్తి కాలమునుండి రేనాటి చోళుల కాలము వరకు" వ్రాసినారు.

ఈ గ్రంథములో పది ప్రకరణములున్నవి. అవి సాతవాహనులకు పూర్వ యుగము, సాతవాహన యుగము, ఇక్ష్వాకుల యుగము, పల్లవయుగము బృహత్ఫలాయన, ఆనందగోత్రిక, శాలంకాయనుల కాలము, విష్ణుకుండిన యుగము, కళింగాంధ్ర యుగము, రేనాటి చోళయుగము. చాళుక్యయుగము, చాళుక్య చోళయుగము.

మవి రెండు విధములు. నిత్యజీవితము (1) వ్యక్తిగత జీవితము (2) సంఘజీవితము అని రెండు తెఱగులు' అనే విశేషణ ప్రాతిపదికపై వీరు ఆంధ్రుల సాంఘిక జీవిత విషయాలను పాలక వంశాల యుగ విభజననుబట్టి వివరించారు శ్రీ సురవరము ప్రతాపరెడ్డి విశేషంగా వాఙ్మయాధారాలను ఆధారంగా చేసికొని చరిత్ర రచించారు. శ్రీ బి. ఎన్. రెడ్డి ఎక్కువగా శాసనాలను ఆధారంగా చేసికొని విషయ పరిశోధనకు పూనుకొన్నారు. ఆ యా కాలములందా జనుల వేషభాషలు, ఆహార విహారాది ఆచారములు, పరిశ్రమలు వినోదములు ఆటపాటలు, రాజధర్మములు, పాలనా విశేషములు, ఆర్థిక వ్యాపార వినిమయములు, వైదిక జైన బౌద్ధమత ప్రభావ పరిస్థితులు, విద్యా వైదుష్యములు, వాస్తు నిర్మాణములు, శిల్పవైభవము, సాతవాహన, ఇక్ష్వాకు, పల్లవ, విష్ణుకుండిన, చాళుక్య చోళ పరిపాలనా కాలముల వారీగా పేర్కొన్నారు. ఈ కాల విభాగాలను "యుగాలు"గా పేర్కొనడం అంత ఉచితం కాదేమో. యుగశబ్దం వాడినప్పుడు ఆ కాలానికి ఒక వైశిష్ట్యం ఉండడం అవసరం. ఈ సాంఘిక పరిస్థితులు పైన పేర్కొన్న కాలంలో కాలోచితమైన స్వల్ప బేధాలతో మౌలికకమైన మార్పులు లేకుండానే సాగుతూ వచ్చినాయి. అయినప్పటికి శ్రీ శాస్త్రి ఆ యా కాలములలోని వివరాలను చాల విపులంగా పేర్కొన్నారు. ఆంధ్రుల సాంఘిక జీవితాన్ని తెలిసికోడానికి ఈ వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇక యుగ విభాగము ఆ సురవరం అనుసరించిన విభజన ధోరణిలోనే శ్రీ రెడ్డి చేసి ఉంటారు.

మత విషయాలలో, వైదికాచారాల విషయాలలో బోధాయన ఆపస్తంబుల ప్రభావం, బౌద్ధమత విషయంలో నాగార్జున దిఙ్నాగుల ప్రభావం, ఆంధ్రుల సాంఘిక జీవితాన్ని, సంస్కృతిని ఎట్లు ప్రభావితం చేసిందో వివరించారు. అట్లే జైనమత ప్రభావాన్ని కొంత విపులంగా పేర్కొని యుండవలసింది.

పరిపాలనా వ్యవస్థ గురించి శాసనాలవల్ల ఇప్పటివరకు లభ్యమైన అంశాలు వివరించారు. ప్రాచీన భారతదేశంలో, అలాగే ఆంధ్రభూమిలో వ్యక్తి, సాంఘిక జీవితాలు, సాంస్కృతిక జీవనము దేవాలయాలు వానికి సంబంధించిన సంస్థలకు ఎక్కువగా అనుబద్ధమై ఉండేదన్న మాట చాలమందికి తెలిసినదే. అందువల్ల ఆంధ్రదేశంలో నేటికీ నిల్చి ఉన్న ప్రాచీనశిల్పం చైత్యాలకు, దేవాలయాలకు. తదితర కట్టడలకు ఎక్కువగా పరిమితమైనది. వీనిలో ముఖ్యంగా గుహాలయాలు

'జాతి జీవిత చరిత్ర (1) నిత్యజీవితము (2) శాశ్వత జీవితశాశ్వతంగా నిలిచిపోయినవి. వీని వివరాలను ఈ గ్రంథంలో ఇచ్చినారు.

దేవాలయాల గురించి వివరిస్తూ గ్రంథాంతమున ద్రాక్షారామ భీమేశ్వరాలయ శిల్పాన్ని గురించి క్లుప్తంగా చెప్పినారు. అచ్చట పేర్కొన్న నరసింహస్వామి విగ్రహం ఇతరారామాలలో కూడ కనపడుతుంది. చాళుక భీమవరం (సామర్లకోట) ప్రాకారం గోడ లోపలివైపున అటువంటి నరసింహ విగ్రహం ఫలకం ఉన్నది. ద్రాక్షారామ భీమేశ్వరాలయం శిల్పం చాలభాగం దురదృష్టవశాత్తు ఆలయ పునరుద్ధరణ చేయాలనే సద్భావంతోనే గోడలకు, స్తంభాలకు సిమెంటు పూసి అప్పటి ఆలయాధికారులు శిల్పకళకు, చరిత్రకు సవరించరాని శాశ్వత మహాపకారం చేసారు.

శ్రీ శాస్త్రి గ్రంథాన్ని సాతవాహనులకు పూర్వయుగము అనే ప్రకరణంతో సరాసరి ప్రారంభం చేసిరి. గ్రంథంలో ప్రతి ప్రకరణం చివర గ్రంథవిషయానికి సంబంధించిన మౌలిక, ద్వితీయశ్రేణి ఆధారాలు పేర్కొన్నారు. కాని, మొత్తము వీటి నన్నిటిని విశ్లేషణ పూర్వకంగా ఆదిలోనే పేర్కొనిఉంటే గ్రంథరచన ఇంకా శాస్త్రీయంగా సాగేది. ఆలాగే ఆంధ్రుల సాంఘిక జీవితానికి సంబంధించిన విషయాలను విపులంగా పేర్కొన్న గ్రంథకర్త ఆంధ్రజీవిత పరిణామంపైన వాటి ప్రభావాన్ని చర్చించివుంటే అమూల్యంగా ఉండేది.

శ్రీ శాస్త్రి ఆంధ్రుల సాంఘిక చరిత్రం క్రీ. శ. 4వ శతాబ్దం నుండి క్రీ. శ. 11వ శతాబ్దం వరకు ఆంధ్రుల జీవితాన్ని గురించి అనేక విషయాలు చాల విపులంగా పేర్కొన్నది. ప్రతి పుటలోను శ్రీ శాస్త్రి పరిశోధనాదృష్టి, అవిరళకృషి ద్యోతకమౌతాయి. ఈ గ్రంథంద్వారా ఆంధ్రుల సాంఘిక చరిత్ర ప్రథమంగా వాఙ్మయంలో శ్రీ సురవరంవారి ప్రయత్నానికి సంపూర్ణత కలిగించారు. ఈనాటికి ఆంధ్రుల సాంఘిక చరిత్ర విషయంలో క్రీస్తుపూర్వంనుండి నేటివరకు ప్రథమ గ్రంథాలు లభించాయి. ఈ గ్రంథం ఆంధ్ర చరిత్ర పరిశోధకులకు చిలుకూరి, మల్లంపల్లి వారి గ్రంథాల శ్రేణిలో ఉపకరిస్తుందని చెప్పడానికి సందేహంలేదు. ఈ గ్రంథం విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో, లైబ్రరీలలో ఉండదగిన రెపరెన్సు పుస్తకం. దీనికి అంత్యపదసూచి అవసరం. ద్వితీయ ముద్రణలో శ్రీ శాస్త్రి చేర్చవచ్చును.

— శ్రీ వై. వి. రమణ



# కలగూరగంప

## అపహ్నుతా ? రూపకమా ?

ఇష్టదేవతాస్తుతి సందర్భంగా రామరాజభూషణుని, వసు చరిత్రలో "సకల లోకాభినంద్య" అనే పద్యం, భంగ్యంతరంగా సీతారూప సాక్షాత్కారోపస్కారకం. పై పద్యంలో కవి సీతను, సీత అనకుండా "సిరి"గా ప్రస్తావించడం విశేషం. ఇందులో అలంకారం "శ్లేష సంకీర్ణ రూపకం" అన్నారు వ్యాఖ్యాతలు. 1976 జూన్ భారతి కలగూరగంపలో "నాగార్జునశ్రీ" అనేవారు పై పద్యంలోని అలంకారం అపహ్నుత్యలంకారమేకాని శ్లేష సంకీర్ణ రూపకమన్న వ్యాఖ్యాతృ నిర్ణయం అవితర్కితమన్నారు. భవతునామ—"ప్రమాదోధీ మతామపి" అని సరిపెట్టుకోవచ్చు.

అయితే శ్లేష సంకీర్ణ రూపకమన్న వ్యాఖ్యాతృ నిర్ణయం ప్రమాదం కాదేమో! అని నా అనుమానం. ఈ అలంకార నిర్వహణలో కవి చేసిన చమత్కృతిని మనం ఓపికగా అర్థంచేసుకోవాలి.

సీతకి, లక్ష్మికీ, అభేదాధ్యవసాయం, దానికి పరిపుష్టి నిచ్చిన శ్లేషధర్మం, సహజంగా ఉన్నాయి. అపహ్నవం కనబడడంలేదు. సీతాలక్ష్ములకు సాదృశ్యాలుగా వర్ణించిన వస్తువులు, చంద్ర, మాణిక్య, సుధాపూర్ణకుంభ, కల్పలతలు, క్షీరాబ్ధి జాతకు పౌర్వాపర్యక్రమంలో ఉద్భవించాయి. ఇక్కడ అవయవాంతర్భూతాలయాయి. పృథక్త్వం, పౌర్వాపర్యవ్యవస్థా ఆ లక్ష్మి విషయంలో అవయవాంతర్భావం, ఏకత్రావస్థానం. ఈ లక్ష్మి విషయంలో—ఈ భేద భావన భావనామాత్ర నిష్ఠమై సావయవశ్లిష్ట, విశేషణాలవల్ల, రూపక పదాలవల్ల, సాధర్మ్యం సాధితమై,—అభేదం పరిపుష్టమైంది. అపహ్నుతి, రూపక లక్షణాలు మనం జాగ్రత్తగా పరిశీలిస్తే ఇక్కడ ఏ అలంకారం, పొసగుతున్నదో గమనింపవచ్చు—

విద్యానాథుడు ప్రతాపరుద్రీయంలో అపహ్నవ లక్షణం ఇలా చెప్పాడు—

"నిషిధ్య విషయం సామ్యాదన్యారోపేహ్యపహ్నుతిః"

సామ్యాత్, విషయం, నిషిధ్య, అన్యారోపేహి, అపహ్నుతిః

అని సమన్వయం. సామ్యమువల్ల ఉపమేయమును నిషేధించి ఉపమానారోపం జరిగినప్పుడే అపహ్నుతి. వాచ్యంగాగాని, గమ్యంగాగాని, నిషేధం భాసిస్తోందా ఇక్కడ? అదల్లా ఉంచి, అపహ్నవం కూడా రూపకంలో అంతర్భావం చెందుతుందని విద్యానాథసూక్తి—

రూపకలక్షణాన్ని నిర్వచిస్తూ ఇలా అంటాడు—

ఆరోప విషయస్య స్యాదతి రోహిత రూపిణః

ఉపరంజక మారోప్యమాణం తద్రూపకం మతం

వివరణలో...

"అతిరోహిత రూపిణ ఇత్యనేన భ్రాంతి మదపహ్నుతీనాం వ్యావృత్తిః" అనీ, అపహ్నుత్యలంకారే అపహ్నవేన ఆరోప విషయ తిరోధానం అనీ, విద్యానాథుడన్నాడు. ప్రస్తుతంలో ఆ తిరోధానం ఉన్నదా? అపహ్నవం కాదనేది నిస్సందేహం. ఏకదేశ వివర్తి రూపక లక్షణాలు సరిపోతుండడంవల్ల రూపకమన్న వ్యాఖ్యాతృ నిర్ణయం పరియైనదేమో! ఏకదేశ వివర్తిరూపకం గురించి చెబుతూ విద్యానాథుడు "యత్ర అవయవ నిరూపణాత్ అవయవినో నిరూపణం గమ్యతే తదేక దేశ వివర్తి రూపకం" అన్నాడు.

అవయవిగా రూపించదగిన, సీత "సిరి" పదంలోనే ధ్వన్యమానమవుతుంది. నాగార్జునశ్రీగారు అన్నట్లు కారక వైచిత్రి లక్ష్మ్యభిన్నయైన సీతను ధ్వనింపచేయడంలో బాగా ఉపకరించింది.

తాద్రూప్య రంజనం, అభేదభావం, "సిరి" పదంలో శ్లిష్ట విశేషణాలున్న రూపక పదాలవల్ల, బలంగా పోషింపబడుతున్నందువల్ల, నిషేధం అపహ్నవంలో గమ్యమానం కావలసియున్నందువల్ల, అపహ్నవాన్ని రూపకం అంతర్భవింపజేసికొనే శక్తి కలిగియున్నందువల్ల, ఏకదేశ వివర్తిరూపకంగా గుర్తింపదగి వ్యాఖ్యాతృ నిర్ణయం పొరపాటు కాదేమో! అని అనిపిస్తోంది.

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు.

## ధూర్జటి మహాకవి - శంఖఫలకము

ధూర్జటి మహాకవి వ్రాసిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము అనే కావ్యంలో మూడవ ఆశ్వాసంలో నత్కీరుని కథ వస్తుంది. ఆ మూడో ఆశ్వాసంలో 131 వ పద్యంలో "ద్రవిడభాషా పీఠతల" "శంఖఫలకంబు" గల కనకాబ్జపుష్కరిణి కిరవు" అన్నచోట, అదే ఆశ్వాసంలో 141 వ పద్యంలో "అష్టాదశాక్షర మాతృక వ్రాసి విర్సలిన "శంఖఫలకంబు" గొని వచ్చి పాండ్యభూపతికిచ్చి" అన్న రెండవచోట, మళ్లీ 144 వ పద్యంలో "తత్కవితా శ్రీ విపుల "శంఖఫలకముపై వసియింపంగ దగు" అన్న మూడవచోటనున్ను ఈ పదాన్ని ప్రయోగించి యున్నాడు.

ఇవి చదివినమీదట "శంఖఫలకం" అంటే ఏమిటి ? అన్న ప్రశ్న కలిగింది. శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు వ్రాసిన లఘుటీకలో చూస్తే "శంఖఫలకంబు-శంఖనిర్మితమగు పలకః" అని అర్థం కనపడింది. ఈ అర్థాన్నిబట్టి చూస్తే, శంఖం ఉపాదాన కారణమైన పలక అనుకోవలసి వస్తుంది. బంగారంతో చేసిన గొలుసు; మట్టితోచేసిన ఘటము; అన్నట్లు. అలాగే శంఖంతో చేసిన పలక అని అనుకోవలసి వస్తూ ఉంది. ఇక్కడ ఈ సమస్య కలుగుతుంది. శంఖంతో పలక ఎలాగ చేసారు ? ఎన్నో శంఖాలను తెచ్చి గుండచేసి —సిమెంటులాగ—దాంతో చేస్తారా ?

కథా సంవిధానం చదివిచూస్తే ఆ పలక మనుష్యులు కూచోడానికి ఉపయోగించే గానూ, అద్భుత శక్తి కలదిగానూ ఉంది. ఎందరు కూచుంటే అందరికి చోటు ఇస్తుంది. ఒకడు కూచుంటే ఆ ఒకడికీ చాలినంతచోటు ఇస్తుంది. ఇలాగ చెబుతూ అగస్త్యమహాముని ఆ రాజు పూర్వపురుషులలో ఒకనికి ఇచ్చాడట. అనేకుల తరములు గడచిన తర్వాత ఈ కలియుగంలో ఈ రాజు తరాన నత్కీరుడు మొదలైన పన్నెండుగురు కవులను దానిమీద కూచోబెట్టినాడట.

ధూర్జటి ఈ కథను తమిళభాషలోనుంచి తీసుకున్నాడు నత్కీరుడు శివుని ధిక్కరించి ఆపద పొంది, కడకు శివుని అనుగ్రహం వల్లనే కాళహస్తిని దర్శించి శాపవిమోచనం పొందుతాడు. ఇదంతా తమిళంలో ఉన్న "తిరువిళయాడల్ పురాణం" అనే గ్రంథంలోంచి తీసుకొని ఉండును. మదురలో పరమశివుడు సుందరేశ్వరుడు అనే పేరితో వెలసి, ఆయన చేసిన లీలలన్నిటినీ, వైష్ణవులకు శ్రీకృష్ణ లీలలవలె శైవులకు "తిరువిళైయాడల్" అని వ్యవహరిస్తారు. పరంజ్యోతి మునివర్ అను మహనీయుడు అరవంలో 'తిరువిళైయాడల్ పురాణం" అని వ్రాసినారు. దానిలో మూడు కాండములు ఉన్నవి. మొత్తం 3363 పద్యాలు. వానిని మళ్లీ విషయానుసారంగా 64 పటలములని విభజించారు. 3వ కాండమైన తిరువాలవాయి కాండంలో 51 వ పటలంగా "శంగప్పలగై క్కొడుత్త పటలం" అన్నది వస్తుంది. ఆ పటలంలో 20 యవ పద్యంలో సోమసుందరేశ్వరుని గుడికి పశ్చిమోత్తర దిశలో సంఘమండపమును నిర్మించి దానిలో సంఘపు కవులను నిలిపిన వృత్తాంతము ఉన్నది. ఆ పటలం లోనే 25 వ పద్యంలో రెండు జానలు చతురంగా ఉండి చంద్రుని కంటే తెల్లగాఉన్న ఒక బల్ల, ఆ కవులు కూచోడానికి ఇచ్చినట్లు వ్రాసియున్నది. "ఇదియే మీకు కొలత బద్దయై (మీశక్తి సామర్థ్యములకు, జ్ఞానమునకు) ఉండును. ఒక్కొకరికి మూరెడు చొప్పున పెరుగుతూ ఎంతమంది కూచుంటే అంతమందికిన్నీ చోటు ఇస్తుంది" అని సుందరేశ్వరుడు వారితో అన్నాడు. దీనికే "శంగప్పలగై" అని పేరు ఇచ్చారు. ధూర్జటి దీనికి "శంఖఫలకం" అని పేరు పెట్టాడు.

ధూర్జటి వ్రాసిన మూడో ఆశ్వాసంలోని 141 వ పద్యం అయిన "మలయాచలంబున కలశ తనూజుండు" ఇత్యాదిగాఉన్న పద్యంలోని వృత్తాంతానికీ, తిరువిళైయాడల్ పురాణంలోఉన్న వృత్తాంతానికీ ఏమీ సంబంధం కనబడటం లేదు.

తమిళ భాషలోని "శంగం" అన్న మాటను "శంఖం" అని అనుకోటానికి వీలు ఉండవచ్చును అని కొందరు తలంపవచ్చును. అక్షరసామ్యం అలాగ అనిపించుతుంది. అయితే అరవ భాషలో శంఖం అన్న మాటను "శంగు" అని పలుకుతారు గాని శంగం అని అనరు. శంఖం అనే మాటను "శంగు" అని అరవంలో పలుకుతారు అన్నందుకు "తిరుప్పావై" లో 14 వ పాశురంలో "శంగొడు శక్కరమేందుం" అన్న ప్రయోగం ఉంది. అనగా శంఖముతోకూడ చక్రమును ధరించిన అని అర్థం. అదే పాశురంలో "తంగళ్ తిరుక్కోయిల్ శంగిడువాన్ పోగిన్నార్" అన్నది ఇంకొక ప్రయోగం. మీ గుడిలో శంఖం ఊదటానికి పోతూ ఉన్నారు అని దాని అర్థం. కూప్పు + ఇడు= కూప్పిడు అవుతుంది. తెలుగులో "కూత పెట్టు" అంటారు. అలాగే "శంగు + ఇడువాన్=శంగిడువాన్ అవుతుంది. శంఖం ఊదటానికి అని దాని అర్థం. దీనివల్ల శంఖం అనే మాటను అరవంలో "శంగు" అని పలుకుతారు కాని శంగం అని పలకరు, అన్నది విశదంగా తెలుస్తూ ఉంది.

శంగత్తమిళ్ (ఈ 'ళ్' ఇంగ్లీషు measure లోని su వలె ఫ్రెంచి 'J వలె పలకుతారు. తెలుగులో సూచించటం కష్టం. సం.) అన్నది ఉన్నత స్తరంలో ఉన్న అరవానికి వర్తిస్తుంది. అనగా సంఘము వారు ఆమోదించిన ఉత్తమ ద్రవిడభాష అన్నమాట. శ్రీ ఆండాళ్ అరవ భాషలో రచించిన "తిరుప్పావై" అనే ముప్పై పాశురముల లఘు కావ్యంలో ఆఖరి పాశురంలో "శంగత్తమిళ్ మాలై ముప్పదుం తప్పామే" ఇత్యాదిగా ఉంది. అది ఫలశ్రుతి వంటిది. ఆ కాలంలో అరవభాషయొక్క సాధుత్వానికి ఇది ఒక కొలత బద్దగా ఉండేది. సంఘపు తమిళము చాలా శుద్ధమైనది. "సంఘపు తమిళంలో రాశిన మాలికవంటి ఈ ముప్పదిన్ని తప్పకుండా ఎవరు పఠించుతారో..." ఇత్యాదిగా దానికి అర్థం. ఇలా ఉండగా శ్రీ పరవస్తు రంగాచార్యులు అయ్యవారలుగారు "సంఘముగా ఉన్న ద్రవిడ మాలిక యయిన ఈ ముప్పై పాశురములు" అని తెలుగులో అర్థం రాశారు. ఇక్కడ "శంగత్తమిళ్" అన్నమాటకు భావం శుద్ధమైన తమిళభాష అని చెప్పవలెను గాని సంఘంగా ఉండే ద్రవిడమాలిక అని చెప్పటం సరి కాదు.

ఏతావతా, ధూర్జటి ఎక్కడెక్కడ "శంఖఫలకం" అన్నమాట ప్రయోగించినాడో అదంతా "సంఘఫలకం" అని దిద్దుకుంటే ధూర్జటిమీద నేరం తీరిపోతుంది. కాని "శంఖనిర్మితమగు పలక" అని వివరణ వ్రాసిన శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు చిక్కుపడతారు.

శ్రీ విశ్వనాథవారి క్రమపీఠికలో "అగస్త్య మహర్షి...బీజములువేసి ఒక శంఖపు బల్లమీద వ్రాసి దానిని తెచ్చి యా రాజున కిచ్చెను" అన్న వాక్యములో ధూర్జటి మాటలనే అనుకరించుతూ "శంఖపుబల్ల" అని కంఠోక్తిగా చెప్పుతున్నారు. తిరువిళైయాడల్ పురాణంలోని కథయే దీనికి ఆధారం అనుకుంటే అగస్త్యుని మాట ఎలాగ సరిపడుతుంది? మరి ఈ శంఖపుబల్ల ఎలాగ కుదురుతుంది?

ద్రావిడ దేశంలో ఈ సంఘముల కథలు ఇప్పటికీ చెప్పకుంటారు. ఆదికాలంలో మొదటి సంఘం ఏర్పడిందనిన్నీ, అది జలప్రళయంవల్ల నశించిపోగా మరి కొంతకాలానికి రెండవ సంఘం ఏర్పడిందనిన్నీ, అది కూడా ఏ కారణం చేతనో నష్టమైపోగా

ఈ మూడవసంఘం ఏర్పడిందనిన్నీ చెప్పుకొంటారు. ఈ మూడవ సంఘం కాలంలోనే ఆ నక్కీరుడు మొదలైన కవులున్ను, వారికి సంబంధించిన ఈ కథయున్ను ఏర్పడియుండును.

ధూర్జటి ఈ విషయంలో అనాలోచితంగా అంగీకరించాడన్నది ఒప్పుకొనక తప్పదు.

శ్రీ న చ వరదాచార్యులు అయ్యవార్లగారు

[రచయిత దక్షిణ ఆఫ్రికాలోని డర్బన్ విశ్వవిద్యాలయంలో హిందీ, తెలుగు, తమిళ శాఖలకి అధ్యక్షులుగ ఉంటున్నారు.]

## లేఖలు

### విప్రవర్యుఁడెవరు?

పై శీర్షికతో శ్రీ శిరివెళ్ల యూసోబుగారు భారతి జులై 76 సంచికలోని "కలగూరగంప"లో ఒక చర్చచేశారు. అందులో వారు ఉదాహరించి చర్చించని గీతావాక్యానికి ఇది వివరణ.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రముఖులచేత పీఠికలు వ్రాయించి శ్రీమదాంధ్ర మహాభారతంలో చాలా పర్వాలు ప్రకటించారు. ఆ పీఠికాకర్తలు తమ వ్యక్తిత్వం స్పష్టమయ్యేటట్లు విభిన్న పద్ధతులతో పీఠికలు రచించారు. కర్ణ పర్వానికి శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు సువిశాలమైన పీఠికను వ్రాసారు. అక్కడక్కడ పద్యాలలో ఉండే విశేషాలను foot noteలో వివరించారు. 236వ పేజీలో పాదటిప్పణిలోని రెండు వాక్యాలు ప్రస్తుతం చర్చనీయాలు.

(సంజయుడు) "...భగవద్గీతలో 1 అ–7 శ్లోకములో "ద్విజోత్తమ" అని పిలువబడియున్నాఁడు. గీతారహస్యములో లోకమాన్య తిలకు సంజయుని సూతుఁడనియే చెప్పిరి."

భగవద్గీతలో సంజయుడు 'ద్విజోత్తమా' అని పిలువబడ్డాడు అని వారి అభిప్రాయం. కాని ఎవరిచేత అలా పిలువబడినాడో వారు వ్రాయలేదు. భగవద్గీతలో వారు ఉదాహరించిన సంఖ్యగల శ్లోకానికి పూర్వాపరాలను పరిశీలిద్దాము.

"సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో నా వాళ్ళు పాండవులు ఏం చేశారు" అని ధృతరాష్ట్రుడడిగితే సంజయుడు ఇలాగ చెప్పాడు: "వ్యూహంగా పన్నబడిన పాండవ సైన్యాన్ని చూచి దుర్యోధనుడు ద్రోణాచార్యుని వద్దకువెళ్ళి 'ఆచార్యా! నీ శిష్యుడు ధీశాలి అయిన ధృష్టద్యుమ్నుడు వ్యూహంగా పన్నిన ఈ పాండవ సైన్యాన్ని చూడండి" అని ప్రారంభించి పాండవుల సేనలో ఉన్న మహావీరుల పేర్లను 4, 5, 6– మూడు శ్లోకాలలో చెప్పాడు. తరువాత తమ సైన్యంలో ఉండేవారినిగూర్చి చెప్పటంమొదలు పెట్టాడు.'

అస్మాకంతు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ!
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే.

భగవద్గీత. 1. అ. 7. శ్లో.

ద్విజోత్తమా! మన పక్షంలో విశిష్టులైన వారినిగూర్చి తెలుసుకోండి. నా సైన్యానికి నాయకులైన వారిని మీకు గుర్తుకోసం చెపుతున్నాను అని ఈ శ్లోకంలోని భావం. ఈ సందర్భాన్ని గుర్తిస్తే దుర్యోధనుడు ద్రోణుడిని 'ద్విజోత్తమ' అని సంబోధించాడు అని మనం గ్రహించగలుగుతాం. సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పే మాటలివి అలాంటప్పుడు సంజయుడు "ద్విజోత్తమ" అని పిలువబడియున్నాఁడు అని వ్రాయుటం పొసగదు. ఇందువలన లోకమాన్య తిలకుగారి వాక్యానికి వైరుధ్యం ఏర్పడదు.

శ్రీ మరుపూరువారు ఈ గ్రంథానికి పెట్టిన 'తలపేరు' దగ్గరనించీ అనేక విషయాల వింతలు విడ్డూరాలు. అవన్నీ చర్చిస్తే పెద్ద గ్రంథం అవుతుంది. వాటిని మరొకసారి సావకాశంగా పరిశీలిదాము.

—"కాశ్యప"

76 సెప్టెంబరు భారతి కలగూరగంప 54వ పుటలో శ్రీ కే. రామాచార్యులుగారు నా పొరపాటు చూపినందుకు చాలా కృతజ్ఞుణ్ణి. "వాక్యం–రసాత్మకం కావ్యం - రసాత్మకమైన వాక్యమే కావ్యం" అని విశ్వనాథ పండితుడు, రమణీయార్థ ప్రతిపాదక శబ్దమే కావ్యం రమణీయార్థ ప్రతిపాదకమైన శబ్దమే కావ్యమని జగన్నాథ పండితుడు నిర్వచించారు." అని ఉండాలి. ఇది నేను వ్యాసం ఎత్తి వ్రాయునపుడు చేసిన పొరపాటు. సహృదయతా నా తప్పు తెలిపిన శ్రీ రామాచార్యులవారికి మరొకమారు కృతజ్ఞుణ్ణి.

—శ్రీ తిరుమల రామచంద్ర

# గ్రంథ విమర్శలు

## కాంతి రేఖలు

[ సంకలనం : శ్రీ మన్నవ–గిరిధరరావు, ఎం ఏ, క్రౌన్ సైజు 10+128 పుటలు. వెల రూ 4. ప్రతులకు – యువ భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ, శ్రీకృష్ణనగర్, గుంటూరు–522004. ]

నేటి బాలురే రేపటి పౌరులు. దేశం భవిష్యత్తు వారిపైనే ఆధారపడిఉంది. వారు చిన్నప్పుడే సక్రమమైన మార్గంలో పురోగమించడానికి తగిన దోహదం చెయ్యడం అవసరం. ఈ విషయాన్ని గ్రహించి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు మున్నగు ఉదారులు గుంటూరులో "యువభారతీ ఎడ్యుకేషనల్ సొసైటీ" అనే సంస్థను స్థాపించి "యువభారతి" పత్రికను నడుపుతూ అందులో విలువైన వ్యాసాలు ప్రకటిస్తున్నారు. యువకులకు మార్గదర్శకాలయిన గ్రంథాలను వెలువరించబూనుకున్నారు. ఈ సంస్థకు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖామాత్యులు రంగారెడ్డిగారే అధ్యక్షులుగా ఉండడం దీని అభివృద్ధికి కారణం.

'యువభారతీ' సంపాదకులు మన్నవ–గిరిధరరావుగారు యువభారతిలో ప్రచురితాలైన వ్యాసాలలో విశిష్టమైనవాటిని కొన్నిటిని ఏర్చి యీ పుస్తకంగా సంకలనం చేశారు. ఉదారుల ఆర్థిక సాహాయ్యం ఈ ప్రచురణకు సహాయపడింది.

ఇందులో 'ఐకమత్యమే జీవనసూత్రం' అనే రెండు పేజీల విషయమే కాకుండా, స్వరాజ్యం గురించిన అవగాహన, పనిలోని మాధుర్యం, ఎందరో మహనీయులు, చిన్నకథలో పెద్ద గుణపాఠం, మాటా-మంతీ, దేశంయొక్క 'ప్రాతిపదికలు' అనే శీర్షికలో 35 చిన్న చిన్న వ్యాసాలు ఉన్నవి. కొన్ని చక్కని కథలతో వివరించబడినవి. వ్యాసకర్త లందరూ చక్కని అనుభవంతో వీటిని రచించినట్లు పాఠకులకు స్పష్టమవుతున్నది. కేవలం యువకులే కాక, అందరూ గ్రహించవలసిన విషయాలివి !

'జాతి పునరుజ్జీవనమునకు తోడ్పడే ఆలోచనా పరంపర, వ్యక్తికి సమాజంయెడల గల బాధ్యతలు, నిరంతర క్రియాశీలత ఇత్యాది మౌలిక సత్యాలను వెల్లడించి వివరించే అగత్యం నేడు అత్యధికంగా వున్నది' అని శ్రీ రంగారెడ్డిగారు చెప్తున్నది అక్షరాలా సత్యం. ఆ సత్యాలను ఈ పుస్తకం చక్కగా వివరిస్తున్నది.

ఆచార్య యస్వీ జోగారావుగారు 'మనసు తలుపులు తెరిచి చూస్తే కాంతిరేఖలు కొన్ని లోపల ప్రవేశింపాయి' అని చక్కగానే దీన్నిగురించి తెలిపారు. నిద్రాణావస్థలో వున్నవారి కన్నులు తెరిపించడానికి యీ 'కాంతిరేఖలు' బాగా పనిచేస్తాయి. జోగారావుగారన్నట్లు జాతికి మార్గదర్శకుడు కావలసినవాడు ఉపాధ్యాయుడు. భావికి రాచబాట వేయవలసినవాడు విద్యార్థి. ఆ యుభయుల హస్తాలను ఇది అలంకరించవలసి ఉన్నది.

హస్తభూషణంగా వుండడమే కాదు. దీనిని అవగాహన చేసుకుని ఇందులో చెప్పిన రీతిని కొంత వరకయినా ఆచరణలో పెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

— *శ్రీ బులుసు వేంకటరమణయ్య*

## వేణుగోపాల శతకము

[ గజెల్లి శివరాజముగారు కౌను 1/16 – 55 పొరటలు; ధర రు. 2/– ప్రతులకు : గజెల్లి శివరాజము, ఊటుపల్లి, భూషణరావుపేట పోస్టు, మెటుపల్లి తాలూక, కరీంనగరుజిల్లా ]

కరీంనగర మండలంలో ఒక కుగ్రామం–ఊటుపల్లి ఎక్కడ? బొంబాయిలో నేతపని (వస్త్ర రచన) ఎక్కడ? భక్తి – ప్రపత్తి రసాబ్ధిలో మధురాంధ్ర కవితా సుమస్తవ విహార మెక్కడ? హేతువాదానికి అందనందున పూర్వ సంచితమని సరి పెట్టుకొందాం పూర్వం తిక్కయజ్వకాలంలో, తమిళనాట మూడవ కుళోత్తుంగ చోళుని (కుమార మహీధర; మన రాజరాజ నరేంద్రుని ప్రపౌత్రుడు) ఆస్థానంలో, సాలెకులంలో (నేత) బుట్టిన కంబన్ (స్తంభ) తమిళ రామాయణము వ్రాసి, ద్రావిడ మహాజనులచేత భారత ప్రశస్తిని పాడిస్తున్నాడు. ఆత్మ పవిత్రతకు క్షుద్రకుల భిత్తికలు అడ్డురావని గదా భారతీయ చరిత్ర చెప్పేది.

వేణుగోపాల శతకమని, 1850 లో కార్వేటి నగరంపాలించిన వెంకట పెరుమాళ్ళ ప్రభువు ఆస్థానకవి – పోలిసెట్టి వెంకటరాయకవి వ్రాసి ప్రసిద్ధికెక్కినది ఒకటి ఉన్నది. ఎత్తిపొడుపులు ఎగతాళి భక్తి సామెతలతోనిండి, ఆ సీసపద్యాలు జనంనోట నానిపోతున్నవి. అందువల్ల చదువరి ఆ శతకమే ఇది అనుకోకుండా, పేరుకుముందు ఏదైనా ఒక పదం చేర్చి ఉండే బాగుండేది.

ఈ శతక ప్రక్రియ ఆంధ్రుల ప్రత్యేక సాహిత్యనిధి. క్రీ. శ. మొదటి శతాబ్దం మొదట వెలసియుండిన ఆంధ్రశాతవాహన చక్రవర్తి—హాలుడు సంకలనం చేసిన గాథలవలె, వేరువేరు అంశాలుగలవే ఈ శతక పద్యాలు. ఆంధ్రులకు హాలుని సంపదే సంక్రమించినది కాబోలు! వీటిలో కవి మానసిక ప్రవృత్తి వివిధ పార్శ్వాలు దర్పణంలోవలె ప్రతిబింబిస్తుంటవి. కవి తన ఆత్మగత రసాన్ని వెలువరించే దానికి ఎంతగానో ఇవి ఉపకరించి, నీతులు బూతులు భక్తి వైరాగ్యాలతో నిండిఉన్నవి. ఆంధ్ర వాఙ్మయంలో శతకానికి ఒక విశిష్ట స్థానమున్నది. ఆత్మ ప్రతిబింబ ప్రాయమైన ఈ బాణిని ఈకవి చేపట్టి, తన సంస్కారిత హృదయాన్ని భక్తి ప్రపత్తి వేదాంతాల తట్టుకు మరలించి, బుగ్గజాలువలె తేరిపారే శయ్యతో, భావాలకు మెరుగుబెట్టే సహజ భాషలో సీసాలువ్రాసి పాఠకునికి ఆనందం కలిగిస్తున్నారు. కవికి, కంసాలికి సీసం తేలిక అన్నారు. అయినా, శివరాజంగారు సౌఖ్య—మధురానుభూతులు భావ పూర్ణమైన మంచి కవిత్వ చెప్పినారు. భక్తి తన్మయతతో పద్యం బాగా నడపిస్తారు. చిత్త సంస్కారం భావుకత ఉపమాన సౌభాగ్యం ధార ఈ కవితా కుసుమానికి సురభిళ దళాలు.

ఈ కవితా మాధురిని వివిధ భంగులలో కొంత చవిచూడండి; అవతల గ్రోలుదురుగాని :— 95 పద్యం — జలజ మిత్రునివేత జనియించి మేఘంబు జలజ మిత్రుని గప్పివేయుచుండు; 89—అంబికేశ్వరు వాహనంబైన నందియున్ తృణభక్షణముచేసి పృథివి బ్రతుకు…దీనికి కర్మగతి నాను జీవించు కంబుకంఠఅని ప్రారబ్ధవాదాన్ని తేలికగా చెపుతున్నారు; 79—వృద్ధిక్షయాలనుగూర్చి మంచి ఊరటమాటలు; 76—వేశ్యనుబాగా కడిగినాడు; 73—పరమ దీనుల గన్న కరగును. హృదయంబు కమలారిచే చంద్రకాంతమట్లు — అన్న పద్యం కవితాకళాస్ఫూర్తి కలిగిఉన్నది; 67—ఆపాత వేణుగోపాల శతకంవలెనే దెప్పొడుపులతో నిండిఉన్నది; 65—అన్నపూర్ణాదేవియను భార్య గలిగియు మృత్యుంజయుడు భిక్షమెత్తవలసె అని నిందాస్తుతిలో, శ్లేష కవితా చక్రవర్తి—రామభూషణుని "తానను పూర్ణాభిదానయయ్యును మాప్పదొకనాడు తనరేడు చికిరమెత్త" అనే పద్యాన్ని జ్ఞప్తికి దెస్తున్నది; 54—చదువు సంస్కారం కలిగి దేవుని తెలును కోమంటారు; 37—పోతన కవులాక్క నర్పించు-పద్యంవంటిదైనా ఎంగిలికాదుగాదు; 30—భక్తుని గాథ విశ్వాసాన్ని పోతన త్యాగరాజుల వలె వెలువరిస్తారు; 23—దేవేంద్రాదులు తప్పుచేసినా నీకు గొప్పలైనారని, తన్నూ క్షమించి కడతేర్చమంటారు. క్రింది పరయ (మాల) పైనున్న బ్రాహ్మణుడగుట మన వేదాంత మహిమో పేత సందేశమని, వివేకానందస్వాములవారు చేసిన పవిత్ర శంఖారావాన్ని 14లో ప్రతిధ్వనింపజేస్తున్నారు. "మురవైరి నీ పాదస్మరణ చేసెడివాడు పాపిమానవుడైన బాపడగును" అని సర్వ ప్రాణి సమత ను అనుభవించి చెపుతున్నారు. 11—"నిర్మల జాహ్నవీ నీరమిచ్చెడనన్ను నీ పాదమున బుట్టె నెలతగంగ" అన్నది హృద్యమైన పోకడ; 8 కవితాంధ్ర భారతి కన్నీరు తుడువగ పోతనార్యుడగాను పూత చరిత! ఇదేగదా సహజ కవితాగుణం!

ఇట్లా ఈ నేత పనివాడు. తెనుగు చదువుల రాణికొక సొంపైన ఇంపైన పలువన్నెల చీరనేసి కట్టబెట్టి, చూచి చదువరికి చూపించి, ఆనందిస్తున్నారు.

# సామాన్యుని సందేశము

[శ్రీ బి. ఎస్ రెడ్డి (ఎం. ఎస్; యు. ఎస్. ఎ) 1/8 డెమ్మీ 135 పేజీలు. వెల రు 4-50 ప్రతులకు : విర్గో, 6-3-1063/బి/3; లక్డీకాపూల్; హైదరాబాద్-500004.]

"బాగున్నవారిని చూచి అసూయపడకుండా, ఎక్కగలిగిన మెట్లన్నీ ఎక్కి, మెట్లక్రింద వారిని మరచిపోకుండా, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసికానందం పొందాలె" (నా గురించి) అని అంటూ, ఐహిక జీవితాన్ని సుఖవారాశిగా చేయగలిగిన ధర్మ చింతతో జీవితాన్ని ప్రారంభించే యీ ఇంజనీరు కవి—సామాన్యుడుగా ఒక అసామాన్య సందేశాన్ని అందజేస్తున్నారు. రైతుగాబుట్టి, వాస్తు శిల్పి అయి, ఆత్మానందానికి కవితా విహంగాన్ని ఎక్కే యీ రెడ్డి గారి ఆదర్శం పొగడ దగినదే! పని తీరిక వేళలలో ఇట్లాంటి వ్యాసంగం సాగించడం అందరికీ ముదావహమే.

"ఒక చెంపమీద కొట్టితే రెండోచెంప త్రిప్పు" అన్న ఏసుక్రీస్తు నపుంసకవాదాన్ని ఒప్పుకోకుండా, దెబ్బకు దెబ్బ తీయమంటాడు—భగవద్గీత కృష్ణునివలె. ఈ చచ్చు సిద్ధాంతమే—ఈ బౌద్ధ అహింసే మన దేశాన్ని అనర్థంలో ముంచినది. ఈ రచయిత మానసం వేదాంత

భాసనా బంధురము; యోచనలు ఆధ్యాత్మిక సందేశ వైతాళికులు. విదేశాల చదువు తలకెక్కినా, ఆర్యసంప్రదాయం ఈయన రక్త నాళాలలో పారడం, ప్రపంచ సమైక్యతా భావానికి యీనాడు అవసరం. ఈ సమున్నత భావం ఈ గ్రంథమంతా వెల్లువ బెట్టినది. నేటి క్లిష్ట కల్మష సమస్యలన్నిటికీని నైతిక పరిష్కారాన్ని సూచించి, ప్రపంచాన్ని బాగుపడమంటారు – ఈ ఆర్కిటెక్టు; స్పష్టేగదా ఆర్కిటెక్టు పని!

ప్రతివానికి ఒక సమస్య–చిక్కు ఉంటుందని (జీవిత ధ్యేయం) దాని పరిష్కారం అసూయా ద్వేషాలు కావని. మన ఋషుల దివ్య సందేశమే మార్గదర్శకమంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత "పొందిన ఉత్సాహం హారతి కర్పూరంలా హరించుకపోతున్నది" (స్వాతంత్ర్యదినం) అని నిర్వేగంపొందే దేశభక్తుడుగా, ఒక రమ్య కవితా రీతిలో ఆశావాణినే వెలవరిస్తున్నారు. 'వాస్తుశాస్త్రం'లో మంచి ఎగతాళి ఉన్నది: తల వాతను, వచ్చిన బిడ్డ–కొన్నగొడ్డు–కట్టినకొంప మార్పులేవని ప్రారబ్ధాన్ని తగిలీ తగలనట్లుగా వ్రాస్తారు.

మిఠాయి పులారెడ్డిని తీపు (స్వీట్) పుల్లన్నగా–కాయకష్టంతో శ్రీమంతుడైన సానుభూతిపరుడుగా మిత్రుడుగా–త్యాగిగా వర్ణించడం బాగున్నది. ఇది కర్మయోగానికి ఒక నూలుపోగు కాని, వ్యక్తిగత సంబంధం "విద్యార్థి సోదరులు" అన్న శీర్షికలో కొంత ఎక్కువైనది–అనాలి. "నా గురించి" సొంత సంగతి అయినా విషయ గౌరవం వ్రతధర్మ నిర్వచనం కలిగి ఉన్నది. వరకట్నాల బాధకు పరిష్కారం–కూతుళ్ళకు తండ్రి ఆస్తిలో భాగం కల్పించడమే అన్నది ఆచరణయోగ్య సూత్రం.

గ్రంథమంతా కొత్త పోకడలతో భౌతిక జీవిని ఆధ్యాత్మిక పథానికి ఎక్కించేటట్లున్నది. వ్రాత ఇంకా సానలు దీరగలదు. ఈయన 'నా గురించి' అన్నట్లు గాక స్వమాండలికాలనే వాడితే భాష నానా ముఖాల ఎదుగుతుంది గదా! హైదరా భాషలో జీవమున్నది. నా గురించి ఏంది? నన్ను గురించి గామాల. ఈ కవి కట్టించిన భవనాలు బాగున్నట్లే గంధము దణ మంచిగా ఉన్నది గాని, టైటిల్ పేజి రూపం ఏమీ బాగులేదు. అర్థం కాకుండా ఉండే మర్మకవిత్వం అవుతుందేమో !

## నన్నిలా వుండనియ్యండి :

[కవితా సంపుటి. ఎదిరె చెన్నకేశవులుగారు. డెమ్మీ 1/8 80 పుటలు; మూల్యం రు. 3 ప్రతులకు : శ్రీసాయి పబ్లికేషన్సు, 4 2-739; రామకోటి; హైదరాబాదు 1]

చెన్నకేశవులుగారు "నన్నిలా వుండనియ్యండి" అనడం విందుకో తెలియడంలేదు. ఇది అపూర్వ అకారణ అలౌకిక వాంఛగా ఉన్నది—తృప్తితోనా? లేక ఇంతకంటె బాగుపడేది లేదనా? సజ్జనత్వం, దయ మొదలైన మానవతా గుణాలున్నా అసూయా ద్వేషాలు రాజుకొంటూ, రచయిత తిక్కన చెప్పినట్లు "తెవులులేని వేదన"లో పడుతున్నారు. ద్వేషించకపోయినా తృప్తిలేకపోతే జీవి మనజాలడు. లోకవంచకులను తిట్టినా, మంచివారిని పొగడే మనసు ఈయనది. అందువల్ల సంయమనమే ఈ ఆర్తికి మందు.

నైజాము కసాయి పాలనలో తెనుగుపై అభిమానం చూపిన వీరాంధ్రుడు వీరు. ఆ స్వాతంత్ర్యకాంక్ష ప్రతి పాటలో నిక్కి చూస్తున్నది. కాని వ్రాతగాడుగా— ఎండిపోయిన కాయసవంటి వార్తలందించే పత్రికా విలేకరి స్థాయిలోనే ఉన్నారు. వచనమైనా మాటలకు పొందిక ప్రాణం ఉండాలగదా, అంతగా అవి లేవు. రచనా కౌతూహలాన్ని రచనా పాటవానికి ఉపయోగించుకొని మున్ముందు కవితా లక్షణ స్ఫోరకంగా వ్రాయగలరని ఆశ.

మిత్రుడు కాబట్టి బోయి భీమన్నగారిపై ఒక చణుకు: పద్మశ్రీ కళాప్రపూర్ణ మొదలైన బిరుదావళి (వీటికి ఈయన అన్నిటా తగినవాడు; ఈ గౌరవానికి నేనూ మురిసిపోతున్నా) లెటర్ హెడ్సుపైన పేరును తగిలించడం సముచితాచారం. తొలి పలుకు చివరన పేరుకు ఈ బిరుదాలు తగిలించడం–శ్రీ మరుపూరు కోదండ రామరెడ్డి గారు అని వ్రాలు (సంతకం) చేసినట్లుండదా? తిరుమల రామచంద్రగారు జైలుకుపోయిన స్వాతంత్ర్య యోధుడు. స్వరాజ్య ఫలితాలు ఇప్పుడు ఎవరో భోజనం చేస్తున్నారన్నది సహేతుక ఆవేదనే కాని, ఆయనకు నిష్కామ కర్మయోగం సంగతి తెలియనిదా ఏమి?

—*శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి*

## వేడిగాలి (కవితా సంపుటి)

[రచన : శ్రీ నలింద్ర; ప్రచురణ : ప్రజాసాహితి, యువ రచయితల వేదిక, నిజామాబాద్. ప్రతులకు : అరుణా బుక్‌హౌస్, స్టేషన్‌రోడ్, నిజామాబాద్. 1/8 డెమ్మీ 46 పేజీలు; వెల రు 2–50]

యువకవి శ్రీ నలింద్ర తొలి కవితా సంపుటి 'వేడిగాలి' నలభైమూడు సంక్షిప్త శబ్ద చిత్రాల కూడలి అన్నీ వచన కవితా ఖండికలు. అన్ని ఖండికల్లోనూ సామాజిక స్పృహ జీవనాడిగా ధ్వనిస్తోంది. తను నమ్మిన విశ్వాసాల ప్రకటనంతో కవి చిత్తశుద్ధికీ, ఉద్దేశానికీ సంపుటిలోని ప్రత్యక్షరమూ నిదర్శనంగా నిలుస్తోంది.

అయినా, 'మస్తిష్కనేత్రమీద', 'భారీతర వెలుక్కోసం', 'కురుసే వర్షం', వచ్చేసెళ్ళేసెయ్', 'నువ్వానలేదు', 'తపస్సాలోచనలు' వంటి ప్రయోగాలు పళ్ళేరుల్లా గుచ్చుకుంటున్నాయి; శైలీ మార్దవాన్ని హరించేస్తున్నాయి. అలాగే, 'ఈ దేశం ఆలోచనా ఆలింగనల పరిత్తులో-దూరం, నూదూరం ఒక సృజన' అన్న పంక్తుల్లోని 'పరిత్తు' పాఠకుడికి ఏ అనుభూతినీ కలిగించటంలేదు.

అభ్యుదయ భావన నిండుగావున్న శ్రీ సలంద్ర భాషగురించీ, శైలిగురించీ తగిన శ్రద్ధతీసుకుని భవిష్యత్తులో గొప్ప కావ్యాలు వెలువరిస్తారని ఆశిస్తున్నాం.

'పత్రికల్లో పుస్తక సమీక్షలు రాసేవాళ్ళంతా పుస్తకాన్ని పూర్తిగా చదవకుండానే రాసేస్తారనేది జగద్విదితం'అన్న అమూల్యాభిప్రాయం (!) కూడా కలిగిన 'ముందుమాట'ను శ్రీ శ్రీ గారు వ్రాసేరు.

## నడుస్తున్న చరిత్ర (కవితా సంపుటి)

[రచన: శ్రీ బోయ జంగయ్య; ప్రచురణ: సాహితీమిత్రులు, నల్లగొండ; 1/8 క్రౌన్ 30 పేజీలు; వెల రు 1-50]

నల్లగొండ సాహితీ మిత్రులు 29 పేజీల్లో 20 కవితలు కూర్చి ప్రచురించిన సంపుటి ఇది. చాలా ఖండికల్లోని వస్తువు- మనిషి ఎదలో పేరుకుపోయిన మూఢవిశ్వాసాలపై అవహేళన, సమాజంలో పెచ్చు మీరిన అన్యాయాలపై తిరుగుబాటు. 'హోటల్ గేటుముందు ఎల్లరసు మోస్తున్న చినిగినగుడ్డ, చెమట చారలు గీచిన పాలిపోయినముఖం దానికి కాపలా' — అన్న ఆరు పంక్తుల 'కాపలా' ఖండిక శ్రీ జంగయ్యగారికి వచన కవితా రచనలో ఒక పట్టు చిక్కినట్టు చెప్పటానికి చక్కని నిదర్శనం. నల్గొండ సాహితీ మిత్రుల కృషి ఇతోధికంగా ఫలప్రదం కావాలని ఆకాంక్ష!

## జ్వలిత జ్వాల (కవితా సంపుటి)

[రచన : శ్రీ టి. రామాంజనేయులు; ప్రచురణ: ఆం. ప్ర. అ. ర. సం. గుంటూరు జిల్లాశాఖ; ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయం, ఏలూరురోడ్డు, విజయవాడ-2; 1/8 డెమ్మీ 104 పేజీలు; రు వెల: 3-50]

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి శ్రీ టి. రామాంజనేయులుగారి 'జ్వలితజ్వాల'లోని ప్రతి ఖండికలోనూ భావోత్తేజం కదను త్రొక్కింది. వివిధ సందర్భాల్లో ఆ యా సంఘటనలూ, సంభవాలూ చూడగా కలిగిన కవి హృదయ స్పందనకు ప్రతిబింబాలు ఈ ఖండికలు పద్యాలు, పాటలు, గేయాలు, వచన కవిత-ఇలా అన్ని రూపాల్లోనూ భావం ఆవిష్కరింపబడింది.

శ్రీ రామాంజనేయులుగారి కవిత్వ తత్వాన్ని 'పరామర్శ' చేస్తూ డా॥ వి. వి. ఆర్. ప్రసాదరావుగారు ఆధునిక కవిత్వాన్ని గురించి ఆలోచనీయమైన చాలా అంశాల్ని స్పృశించారు శ్రీ కాంచనపల్లి చిన వెంకటరామారావుగారు కవి మిత్రునికి -'పద్యాల రాసే పుబలాటాన్ని అపుకోంటూ, ప్రజాకవిగా పది కాలాలపాటు నిలవాలని' శుభాకాంక్షలు తెలిపేరు.

ప్రజా జీవితంలోనుంచి పుట్టుకొచ్చిన 'అనుభవాలు తల పండడం' వంటి చక్కని జాతీయాలూ, నుడికారాలూ కలిగిన సరళమైన శైలిలోసాగింది శ్రీ రామాంజనేయులుగారిరచన. అయితే, ప్రతిపాదితమైన వస్తువు —ఉత్తమ కవితారూపంలో సాక్షాత్కరించటానికి— భావన-వ్యంగ్య విలసితం కావటం అవసరం. ఈ గుణం సంపుటి మొత్తంలో ఎక్కడోగాని దర్శన మివ్వడంలేదు.

'క్రొత్తగ వేరొక ప్రొద్దు వియత్తలాన పొడిచిందా-ఎక్కడిదీ ఉదయారుణ దీప్తి, మిట్టమధ్యాహ్నాల'వంటి విశుద్ధ కవిత్వం మరింతగా వెలయించి తెలుగు సాహితీ ప్రియులకు పంచాలి-శ్రీ రామాంజనేయులుగారు!

## కావ్యాంజలి (కవితా సంపుటి)

[రచన శ్రీ కొండేపూడి సుబ్బారావు; ప్రాప్తిస్థానం : గ్రంథకర్త, 47 10-5, ద్వారక నగర్; విశాఖపట్నం 530004; 1/8 క్రౌన్ 82 పేజీలు వెల రు 3-50]

ప్రణయాంజలి, బాష్పాంజలి పూజాంజలి అనే మూడు ప్రత్యేక విభాగాలుగల కావ్యాంజలి ఖండకావ్య సంపుటియే అయినా; నిర్దిష్టమైన ప్రణాళికతో, లక్ష్యశుద్ధితో విరచితమైన మూడు శీర్షికలలోను భిన్న వస్తు ప్రతిపాదనము జరిగినా, భూమికలో శ్రీ మధునాపంతుల వారన్నట్లు "మనుష్య జీవితారోహణమునకు సాధన సోపాన త్రయమైన— ప్రేమ, కరుణ, భక్తి భావములే" రసానుభూతిని సిద్ధింప జేయుటలో ఏకసూత్రత సాధింపబడింది.

పదాల పోహళింపులోని లాలిత్యం, అక్లిష్టమైన శైలి, భావ సౌకుమార్యం వీటితో కృతి రస నిష్యంది అయినది. ప్రసాదగుణ

భాసురమైన "బమ్మెర పోతన", భద్రాచల రామదాసు'వంటి ఖండికల్లోని ప్రతి పద్యమూ రసోదంచితమై వున్నదనటంలో అతిశయోక్తి లేదు.

కవిగారి పలుకు సుడికారానికి 'బారలు కొల్చుకొంచు చనుభాను' నీ, 'భూధర పక్షముల్ నరికిపోసిన యింద్రుని వజ్రధార' నూ ఉదహరించవచ్చు.

'మరణ కాలమ్మునను లసన్మధుర మధురమందహాసమ్ము విడని తిమ్మరుసు మంత్రి శవము శివమయి యెదుట సాక్షాత్కరించె, ప్రజల గుండెలు రక్తబాష్పములు నించె' —రసపోషణమున వీరికిగల సామర్థ్యాన్ని చూపేందుకు ఈ పద్యం చాలు.

'కావ్యాంజలి'లోని కవితాశక్తినీ, కవిగారి ప్రతిభా వ్యుత్పత్తులనీ ప్రశంసిస్తూ ప్రసిద్ధులైన కవిపండితుల అభిప్రాయాలు అనుబంధంగా వెలువరించబడినాయి.

శ్రీ కొండేపూడివారు సమగ్రసుందరమైన ఇలాంటి రసవత్కావ్యాలు మరిన్ని వెలయించి తెలుగువాణికి అలంకారాలుగా చేసే యాలని కోరుకుంటున్నది—సాహితీలోకం !

—వి. శా.

# 'జాయసి' పద్మావతి

[ మూలం : మాలిక్ మహమ్మద్‌జాయిసీ హిందీ (అవధీ) భాషలో రచింపబడిన యీ కావ్యానికి తెలుగుసేత. నేలనూతల కృష్ణమూర్తి (తులసీదాసదాసి) పుటలు : 360. మూల్యం : రు. 15–00 ప్రతులకు : నేలనూతల పార్వతీ కృష్ణమూర్తి, మూలప్పేట-నెల్లూరు. ]

నాటినుండి నేటివరకు మన భారతీయ తత్త్వం ఐహికాధ్యాత్మికాలకు సేతువులాంటి సంస్కృతీప్రభలు కల్పినట్టిది. పాశవిక ప్రవృత్తులనుండి నరుడు పరమార్థతత్త్వం అందుకోవడానికి ఆధారభూతాలైనట్టివే సర్వత్రా ఆవరించిన మన కావ్యపురాణ విజ్ఞాన సంపద. పాశ్చాత్య పండితులచే సైతం ప్రశంసలనందుకున్న మన తత్త్వంలోని మౌలికాంశాలను విశ్లేషించి చూపే విశిష్ట కావ్యాలనెన్నింటినో మనీషులైన మన కవులు మన మనుగడకు గడించి పెట్టారు. మనదేశంలోని విభిన్న భాషా సంస్కృతుల స్రవంతుల ద్వారా మన విజ్ఞాన సాగరం యెన్నో అనర్ఘరత్నాలను నేటికీ అందిస్తూనేవుంది.

అలాంటి ఉత్తమ కావ్యరత్నాలలో 16 వ శతాబ్ది పూర్వార్థంలో వర్ధిల్లిన మాలిక్ మొహమ్మద్ జాయసీ కవిచే రచింపబడ్డ పద్మావతీ కావ్యం ఒకటి. ఆయన ఆఖిరి కలామ్, అఖ్రావట్ అనే యితర కావ్యాలు రచించినప్పటికీ పద్మావతి కావ్యం మాత్రం ఆయనకు యావద్భారత ఖ్యాతిని సంపాదించి పెట్టి మహా కవిత్వ పీఠానికి పట్టాభిషిక్తుణ్ణి చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ కావ్యం అత్యున్నతమైనధ్వనికావ్యం. ఆనంద వర్ధనాచార్యులవారిచే అభిభాషింప బడిన కావ్యాత్మయైన ధ్వని తత్త్వాని కవ్యమైన, మెచ్చుగొలిపే మనోహర లక్ష్యం.

అద్వైతభావన, భగవత్తత్త్వం సార్వకాలికమైన, సార్వజనీనమైన సిద్ధాంతాలు. హిందూమతంలో కానివ్వండి, తక్కిన మతాల్లో కానివ్వండి, అవే సూత్రాలు కించిద్భేదాలతో మాత్రమే మానవుని మోక్షపథాలకు చేరుస్తాయి. ఈ కావ్యం ఆవిధంగా సర్వమతాల సిద్ధాంతాలకు ఏకత్ర సమన్వయ రూపం గల్పించిన మహా గ్రంథమని చెప్పవచ్చు.

లోక వ్యవహారంలోవున్న చారిత్రక వృత్తాంతాన్ని కథావస్తువుగా స్వీకరించి, స్వీయకల్పనలతో, ఇస్లాంమతంలోని సూఫీ సిద్ధాంతాల కనుగుణంగా, ఆ యితి వృత్తాన్ని ప్రబంధోచితంగా రంగరించి, పటిష్ఠమైన ప్రేమ కావ్యంగా అక్షరాకృతిని మలిచాడు. తులసీదాస రామచరిత మానస కావ్యంకన్నకూడ యిది పూర్వమైనదిగా తలపబడుతోంది. తదుపరి అనేకమైన మనోహర కావ్యాలు హిందీభాషలో వెలువడటానికి ఇది ఆధారమైంది. అందుకనక్త, ప్రవక్తయైనాడు జాయసీమహాకవి.

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, అధ్యాత్మవిదులు వేదాంతమనియు" అని మన ఆదికవి భారతాన్ని భావించినట్లుగా ఈ కావ్యానుశీలనం గావించిన సరసులకు సుందర ప్రబంధంగాను, ధర్మవాసనగలవారికి ధర్మాద్వైత దీపికగాను, కర్మయోగులకు, ముముక్షువులకు పారమార్థిక ప్రచోదితమైన ప్రశస్త పురాణ గ్రంథంగాను...యిలా లోనారసిన కొద్దీ యిందులో అనంతమైన మార్మిక భావాలు, ప్రభావాలు మనోహరమైన మస్నవీ శైలిలోకూర్చబడ్డాయి.

ఈకావ్యమంతా 58 ఖండాలతో కూర్చబడిన కమనీయాకృతి. ఇతివృత్తం మనదేశంలో చారిత్రకంగా ప్రసిద్ధమైన భీమసింగు, పద్మిని, అల్లావుద్దీన్ ఖిల్జీల వాస్తవికోదంతం. అయితే ఆ ప్రసిద్ధవస్తువును స్వీకరించి, దానికి పౌరాణిక, ప్రబంధ కావ్యాల మెరుగులివ్వడంలోనే మహాకవి ప్రతిభద్యోతక మవుతుంది. "ఏకాక్షి లోకభక్షకాః" అని మన నానుడి. కాని ఈ కవి ఏకాక్షియయ్యును, వికృతరూపుడయ్యును, "ఏకాక్షి లోకరక్షకాః" అన్నసూక్తిని లోకంలో

నిలిపాడు. కవి కులగురువు చెప్పినట్లుగా మాలిన్యంగల చందుడు లోకాలకు పండువెన్నెల విందుల పసందుల నిచ్చినట్లు హిందూ ముస్లిం సంఘర్షణల కాలవాలమైన ఆనాటి మధ్యభారతానికి తన పద్మావతీ కావ్య నిర్మాణంద్వారా సమన్వయ సాధనము, సమదర్శన సందేశాన్ని ప్రసాదించి, చిరస్థాయినందుకొన్నాడు.

హిందీ సాహిత్య రంగంలో సాటిలేని ప్రజ్ఞాపాటవాలు కలిగిన ఈ కావ్యాన్ని వచన రూపంలో తెలుగువారి కందించిన తొలిఘనత వేలనూతల పార్వతీకృష్ణమూర్తి (తులసీదాసదాసి) గారికి దక్కుతుంది. "మహాజనోయేన గతస్సపంథాః" యన్నట్లుగా ఆమహాకవి నడచిన రాజమార్గాన్ని రస వన్మధురంగా ఆంధ్రరసజ్ఞ లోకానికి ఆకళింపుగావించిన అనువాదకురాలు నిస్సందేహంగా అభినందనీయురాలు.

ఈ పుస్తకానికి పటిష్ఠమైన పీఠిక వ్రాస్తూ జాయసీకవిని గూర్చిన సర్వాంశాలను సమగ్రంగా తేటతెల్లంచేస్తూ గ్రాంథిక గ్రంథం కలిగివున్న శైలితో నడచిన యీ అనువాదం వింత గాంభీర్యాన్ని సంతరించుకొని సద్యో హృద్యంగావున్నదని హిందీ, తెలుగు కావ్యాల గుణదోషాల నిర్ణయాల కధికారార్హతలుగల శ్రీ భీమ్‌సేన్ నిర్మల్‌గారు నిరూపించటం చాల అర్థవంతంగా వున్నది.

పేరుకు అనువాద కావ్యమే అయినప్పటికీ రచయిత్రి యిందులో రసనిర్భరత్వాన్నిచ్చే వర్ణనలపట్ల స్వతంత్ర దృక్పథాన్ని అనుసరించారు. మూలంలోవున్న 58 ఖండాలను యథాతథంగా చేపట్టినప్పటికీ "అనౌచిత్యాదృతేనాన్యద్రస భంగస్య కారణమ్" అన్నట్లుగా రస భంగాన్ని కావించే వర్ణనలను, అనౌచిత్యాలను పరిహరించి పాఠకునకు రసానందం పవిత్రతాను భూతిగా కలిగేటట్లు చేశారు.

ఈ కావ్యంలో పూర్వార్థపుకథ జీవాత్మ పరమాత్మల అద్వైతాన్ని సాధించే సూఫీ మత వేదాంతలక్ష్యంగాను, ద్వితీయార్థం చారిత్రక సత్యాల ప్రాతిపదికపైనా నిర్మింపబడింది. స్థూలంగా యిందులోవున్న కథయిది: సింహళ రాకుమారి పద్మిని. ఆమె చిలుక హీరామన్ వేటకై బయలుదేరి చిత్తోడు రాజు రత్నసేనుని చేరుకొని అతనిని ప్రేమోన్మాదంలో పడవేస్తుంది. రత్నసేనుడు తన రాణి నాగమతిని, రాజ్యాన్ని వదిలి హీరామన్ మార్గదర్శకత్వంలో సింహళ ద్వీపం చేరుకుంటాడు. అక్కడ పరమ శివుడు, తదితర భగవద్భృత్యుల సహాయంతో సింహళ ప్రభువు నోడించి పద్మినిని చేబట్టి, స్వీయరాజ్యం చేరుకుంటాడు—ఇది పూర్వార్థం.

ఉత్తరార్థంలో రాఘవ సేనుడనే పండితుడు రత్నసేనునివల్ల అవమానితుడై, ఢిల్లీ వెళ్ళి అల్లావుద్దీన్ ఖిల్జీని ప్రేరేపించి, చిత్తోడు దుర్గంపై దండెత్తేటట్లు చేసాడు. అద్దంలో పద్మినినిచూచి ముగ్ధుడవటం, రత్నసేనుని మోసగించి బందీకావించటం — ఇవన్నీ ఖిల్జీపట్ల చారిత్రక సత్యాలే. కాని చివరకు అతని చేతిలో కావ్య నాయకుని మరణం కవికి సముచితంగా తోచక సాదుగు రాజుతో జరిగిన పోరాటంలో ఉభయులూ మరణించినట్లు జాయసీ చూపాడు. చక్కని ప్రతీకాత్మకత అంతర్గర్భితంగా చెప్పబడిన యీ కావ్యంలో శరీరం చిత్తోడు దుర్గమనీ, రాజు మనస్సనీ, సింహళం హృదయమనీ, పద్మిని బుద్ధియని, చిలుక గురువనీ, నాగమతి ప్రాపంచిక మాయాజాలమనీ, రాఘవ చేతనుడు అరిషడ్వర్గమనీ, అల్లావుద్దీన్ మాయ యనీ సమన్వయం చేసుకుంటే, జీవుడు మాయావాగురల నంతంచేసి, పద్మినియనే బుద్ధి సహాయంతో కైవల్యసిద్ధి నొందాలని, లేకపోతే మాయచేతిలో మాసిపోవాల్సి వస్తుందని భంగ్యంతరంగా నివేదింపబడుతుంది. కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయ కావ్య ఛాయలు, బనియన్ కవి "పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్" కావ్యఛాయలు ఇందులో వ్యక్తావ్యక్తంగా గోచరిస్తాయి. లౌకిక ప్రేమ, భగవత్ప్రేమ భావనను సమగ్రంగా ఇందు మేళవింపబడిన తీరు నాన్యతో దర్శనీయమని చెప్పవచ్చు.

ఈ కావ్యాన్ని కవయిత్రి చక్కని శైలిలో సామాన్యుల హృదయ స్పందన కలిగేట్లుగా అనువదించారు. ప్రశస్తమైన ప్రబంధాల

శ్లోకాలలో వీరు తమ అనువాదంలో చూపిన నగర వర్ణనలు, నాయికా వర్ణనలు వియోగ, సంయోగాల అంగనా శృంగారాలు అతి స్నిగ్ధంగా పుటిపడి అలరిస్తున్నాయి. నడుమ నడుమ చక్కని ఛాయాచిత్రాల నిగారింపులతో పూవుకు తావి యబ్బిన రీతి గ్రంథం సుందరంగా ముద్రింపబడిందికూడ అనువాదంలోని వీరి ఉదాత్త శైలికీ క్రింది వచనములు మచ్చుతునకలు.

"పండితుల ముఖము జ్ఞానపూర్ణమగుటచే అరుణ తేజో భాసితమై యుండును. ఆ ఎరుపు ఘాతుకులకు దుఃఖరూపమైన రక్తమువలె కన్పించును."

"ఆమె జన్మించిన ఆ రాత్రి పగలువలె తేజోపూర్ణమాయెను. ఆ శిశువును జూచి పూర్ణచంద్రుడు లజ్జాకలిత మానసుడై మరునాటి నుండియే క్షీణింపసాగెను" పౌర్ణమి తదుపరి వచ్చు చంద్రుని వ్యాఖ్యానించిన ఈ భాష, భావం రెండూ చమత్కార చారువుగా వున్నాయి.

"కేరాకేలి కర్లైకా, బోంభాబ్బైరి పరోసా" అన్న మూలానికి "రేగు నీడన అరటి నిలచి పెరుగజాలదుకదా" అన్న యనువాదం ద్రాక్షాపాకంగా వున్నది. ఎడనెడ ఈ కావ్యంలో కానవయ్యే విశేషాలను తెలుగు సాహిత్య సంబంధమైన వాటిని అనుసంధించి తులనాత్మకంగా చెప్పటం రచయిత్రి మతి ప్రతిభా నిదర్శనం. కాని పద్మావతిని ఈశ్వరునితో పోల్చి చెప్పట సబబుగా తోచదు. భగవతిగా భావిస్తే బాగుండేదేమో! అయినా వేదాంత గ్రంథాలను కావ్యదోష ప్రమాణంతో చూడగూడదేమో! అటులే నఖశిఖ ఖండనమని శీర్షిక యిడి శిఖతో పద్మావతి సౌందర్య వర్ణన నారంభించటం శీర్షికకు భిన్నం. ఆంగిక వర్ణనలోవక్షోజవర్ణన విడనాడటం ఔచిత్యంగా రచయిత్రి భావించారా? అనుకోవాలి. పద్మావతి కామరహిత అని చెబుతూ, అతఃపూర్వము ఆమె మదన పీడితురాలుగ చెప్పుకోవటం పరస్పర విరుద్ధంగా తోస్తాయి.

"మోసమును మోసముతోడనే యెదుర్కొనవలె; నిప్పులో ఉప్పువలె" వంటి చక్కని సుడికారాలు కొకొల్లలు. అత్తవారింటి మెట్టుట్ను, పతి వ్రతా ధర్మాలు మన మహిళల మనసుల కెక్కే విధంగా చెప్పబడ్డాయి. అనువాదంలోని భాష మరింత వ్యావహారికమై పోదుగుకుంటే సామాన్య స్త్రీలకి గ్రంథం యింకా శిరోధార్యమై వుండది.

ఈ గ్రంథాన్ని చదివినంతసేపూ ఒక వచన ప్రాచీన ప్రబంధాన్ని, చారిత్రకాధ్యాత్మిక దీప్తితో వెలుగొందే సుందర కథా మందిరాన్ని; రసానంద స్ఫూర్తిని ఏక ప్రస్రుతంగా పాఠకుడు పొందుతాడు. చారిత్రక నవలా నిర్మాణం అరుదైన యీరోజుల్లో అందుకు పూనుకొన్న యీ విదుషీమణి దీక్షా దక్షతలు ప్రశంసనీయాలు.

హిందీ సాహిత్యంలో మరుగునపడివున్న మాణిక్యాలనిట్టి వారే వెలికి తెచ్చి ఆంధ్ర భాషాయోషను అలంకరింపగలరు. అస్తు.

— "సుభద్ర"

## అనుచితాలు - అనురాగాలు

[రచన : శ్రీలింగం వీరభద్రయ్యచౌదరి; సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : త్రివేణి పబ్లిషర్సు మచిలీపట్నం—1; 92 పేజీలు వెల : రూ. 6]

సాహిత్య విమర్శకు సంబంధించిన వ్యాసములు, వ్యాససంపుటములు వెలువడినంతగా తెలుగులో ఇతర విషయాలపైన వ్రాసిన వ్యాసాలంతగా రావటంలేదు. జీవితానుభవాలను పురస్కరించుకొని, వివిధ విషయాలపైన వ్యక్తిగతమైన అభిప్రాయాలను వెల్లడిస్తూ రచించిన వ్యాసాలు 'అనుచితాలు-అనురాగాలు' అనే యీ వ్యాస సంపుటంలో ఉన్నాయి. రచయిత శ్రీలింగం వీరభద్రయ్య చౌదరి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బి. ఏ. డిగ్రీని, లినోకలేన్సి ఇనోనుండి బారిస్టర్ పట్టాను పొంది, ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటులో ఉద్యోగం చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటున్నారు. తమ 76వ ఏట వారీ గ్రంథాన్ని రచించారు.

శ్రీ వీరభద్రయ్య చౌదరి తమ రచనలకు ప్రేరణను గురించి 'ప్రస్తావన'లో "అవీ ఇవీ పుస్తకాలు కొంటున్నాను. వానిని కొంత వరకైనా చదువుతున్నాను. లయితే ఎక్కువసేపు చదువలేక పోవుచున్నాను. విసుగెత్తి, ఏదైనా వ్రాస్తే విసుగు తగ్గిపోతుందనే ఊహకు లోనౌచున్నాను. పైగా, విశ్రాంతిగా కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, పుస్తకాల్లోని విషయాలు, రేడియోలో వినిన సంగతులు గుర్తుకు, మనసానికి వస్తుంటవి. ఆలోచనలు రగుల్తుంటవి. ఊహలు రేకెత్తుచుంటవి. భావవికాసం కల్గుచుంటుంది. అందువల్ల ఏవో గిల్కటం జరిగింది. ఆ గిల్కినవే ఇందులోని రచనలు. గొప్పగా చెప్పుకో వలసినవి కావు." అని చెప్పారు.

హనుమంతుడు ఆటవికుడుకాదు. బాగా శాస్త్రాలు చదువుకొన్నవాడు. కాబట్టి "హనుమంతుని కోతిగా గాక, ఈ భక్తులు గొప్ప గుణములున్న మహా పురుషునిగా ఎందుకు పూజింపకూడదు? నిస్వార్థపరుడు. నిగర్వి, సేవాతత్పరుడు, కార్యసాధకుడు అని ఏందుకు కీర్తించకూడదు?" అని 'రామతురంగం' అనే రచనలో పేర్కొన్నారు. ఆంజనేయోపాసకులలో కొందరు ఈ విధంగానే ఆంజనేయుని పూజిస్తున్నారు. దీనిని కొత్తగా నొక్కి చెప్పవలసిన అవసరం కన్పించదు.

పాండవులు ద్రౌపదిని వివాహమాడిన ఘట్టాన్ని "పండు పడతెలుగ" అనే వ్యాసంలో వివరించారు. కొత్త విషయమేమీలేదు. "మాయల మాటకారి వ్యాసుడున్నాడు కదా!" వంటి వాక్యాలు ఉదాత్తంగా లేవు. భారతంలో సభాపర్వంలో ద్రౌపది సభవారి నడిగిన ప్రశ్నలు సమంజసంగా ఉన్నాయని వీరు తలంచారు "పేరు ధర్మరాజు పెనువేపవిత్తు" అనే మాట వాస్తవమని నమ్ముతున్నారు.

జాలిపడి ఆపదలో ఉన్నవారికి సహాయంచేస్తే, వారు పబ్బం గడిచాక ద్రోహచింతనతో, పగవారుగా మారేవైనాన్ని 'రక్తి—విరక్తి'లో చెప్పారు.

పల్లెటూళ్ళలో ఎక్కడో గేదెల దగ్గర వచ్చిన పోటాట చినికి చినికి గాలివానై స్త్రీలు తమ మాన మర్యాదల్ని మరచి తిట్టుకోవటం ఎంత ఘోరమో 'రంధి, రట్టడి, రొష్టు' అనే వ్యాసంలో వెల్లడించారు. ఇద్దరు ఆడవాళ్ళ మధ్య వచ్చిన పోరు శతపోరై మొత్తం గ్రామాన్ని రెండు 'పార్టీ'లుగా చీలదియ్యటాన్ని 'పోరు, శతపోరు'లో వివరించారు.

ఒక భూస్వామి సహాయం చెయ్యటం వలన కాలేజీలో చదువుకొని, తహసీల్‌దారు ఉద్యోగంపొంది, ఆ భూస్వామికి చిన్న మాట సాయం చెయ్యవలసివస్తే చెయ్యక, తన ఉద్యోగ దర్పాన్ని చూపించి, భూస్వామి తన దగ్గరకు రావాలిగాని, తాను మాత్రం కృతజ్ఞతతో ఆయనను చూడకపోవటం 'కృతఘ్నత' అనే రచనలో వెల్లడించారు. శ్రీ వీరభద్రయ్యగారీ రచనలో వాస్తవాన్ని ఒకవైపునుండే చూచారు. ఎప్పుడో చేసిన సహాయాన్ని గుర్తుచేస్తూ, బ్రతికినంతకాలం తనకు కృతజ్ఞుడిగా ఉండవలెనని కోరే భూస్వామి తత్వాన్ని వీరు పట్టించుకోలేదు.

'రంగు, రుచి, వాసన' అనే వ్యాసంలో వివిధ రకాల వంటకాలను తయారుచెయ్యటాన్ని వివరించారు. 'వెణుకులు' అనే శీర్షిక క్రింద ఘాటైన కొన్ని అభిప్రాయాలను వెల్లడించారు. మచ్చుకొకటి : "సౌందర్యోపాసకుడైన తండ్రి తన రక్తం పంచుకొన్న కూతురు పరపురుషుని వల్లనైనా చక్కని బిడ్డలను కంటే సహించగలడు. కాని కోడలు వ్యభిచరించి, దేవతా మూర్తులను కన్నా సహించలేడు. కూతురు బిడ్డలను మురిపెం చేయగలడు. కోడలి బిడ్డలను దగ్గరకు రానీయలేడు"—ఈ అభిప్రాయం ఎంతఘోరమో నను కుంటే, 76వ ఏట శ్రీ వీరభద్రయ్య చౌదరిగారీ విషయాన్ని ఎలా చెప్పారని చదువరులు దిగ్భ్రాంతి పొందుతారు.

ఈ పుస్తకంలో "ప్రబోధాలు, ధార్మిక చింతనలు, సాంఘిక ప్రయోజనాలు" లేకపోయినా వెణుకులలో వెల్లడించిన పై అభిప్రాయంవంటి అభిప్రాయాలు లేకపోతే పదివేలు వికారంపెట్టే కొన్ని కొన్ని భావాలు వీరి వ్యాసాలలో కనుపించి మనస్సు వికలమౌతున్నది.

## ఆదర్శాలు - అనుమానాలు

[ రచయిత : శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి; సోల్ డిస్ట్రిబ్యూటర్: త్రివేణి పబ్లిషర్సు, మచిలీపట్నము—1; 82 పేజీలు; వెల : రూ. 6 ]

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరిగారు లోకానుభవంతో వివిధ విషయాలపై వ్రాసిన వ్యాసముల సంపుటి 'ఆదర్శాలు అనుమానాలు'. 'సహధర్మచారిణి'; 'ఉత్తమ ఇల్లాలు' అనే వ్యాసాలు కీ॥ శే॥ భారతీదేవి రంగా; చల్లగళ్ల రామాయమ్మ (సి. నరసింహంగారి భార్య)గారల స్మృతికి సంబంధించినవి. రచయితకు వారితో గల వ్యక్తిగత పరిచయాన్ని వెల్లడించేవి.

మొపాసా వ్రాసిన 'ది నెక్లెస్'కథకు రచయిత చేసిన స్వేచ్ఛానువాదం 'వజ్రాలహారం' అనువాదంవలెకాక కథను క్లుప్తంగా, సరళంగా చెప్పినట్లున్నది. ఫ్రెంచి రచయిత బర్నియేర్ "సగభాగం చేసిన గుర్రంమీద గుడ్డ" అనే కథానికను రచయిత తెలుగులో చెప్పారు. ముసలివాడైన తండ్రిని బాధించిన గృహస్థును, అతడి కొడుకు అదే విధంగా ప్రవర్తించి బుద్ధిచెప్పిన కథఇది. ఇటువంటికథ ఒకటి మనలోకూడ ప్రచారంలో ఉన్నది. ముసలి తండ్రికోసం కొడుకు గొయ్యితవ్వుతూంటాడు. అతడి కొడుకు ఆ పక్కనే మరొక గొయ్యి తవ్వుతూంటాడు. ఎందుకని అడిగితే "నీ తండ్రికి చేసిన సత్కారం నేను నీకు చెయ్యవద్దా" అంటాడు. బైబిల్ లోని 'ప్రాడిగల్ సన్' కథానికకూ, బర్నియేర్ వ్రాసిన ఫ్రెంచి కథానికకు వ్యత్యాసాన్ని రచయిత చక్కగా చెప్పారు.

సోమర్‌సెట్‌మామ్స్ రచించిన "శాశ్వతమైన భార్య" అనే కథానికనుగూడ క్లుప్తంగా తెలుగులో చెప్పారు. శ్రీ వీరభద్రయ్య గారు స్త్రీ పతివ్రతా ధర్మాన్ని అనుసరించటాన్ని అంతగా ఇష్టపడరు. "మన భారతీయుల్లోకూడ పతివ్రతాధర్మం సన్నగిల్లుచున్నది భార్యాభర్తల అనుబంధం, ఒకరి నొకరవగాహన చేసుకొనటం, స్నేహ పూర్వకంగా మెలగటం, సామరస్యం పెంపొందించుకొని సుఖ సంసారం గడుపుకొనడం ముఖ్యంగా ఎంచుకొంటున్నారు ఇది చాలా మంచి పరిణామం" అంటారు.

వృద్ధాప్యంవలన కలిగే లాభనష్టా లను ఆసక్తి కలిగే విధంగా 'వృద్ధాప్యం' అనే రచనలో చెప్పారు. అయినదానికీ, కానిదానికీ కృతజ్ఞతలు చెప్పే అలవాటును రచయిత ఎగతాళి చేశారు 'కృతజ్ఞత' అనే రచనలో. అపకారికి ఉపకారము చేయటం సంస్కారంకాదంటారు. "కన్నుకు బదులు కన్నూడగొట్టమని కాదుగాని, ఒక చెంపపేళ్లమనిపిస్తే, చిరునవ్వుతో రెండో చెంప అందించటం మిక్కిలి తెలివి తక్కువవని" అని వీరిభావం. అంతేకాదు, చెంపపగుల గొట్టిన వానిని ప్రోత్సాహించట మౌతుంది. అందుకే కృష్ణభగవానుడు "వినాశాయచ దుష్కృతాం" అని చాటాడని భగవద్గీతను తమ వాదానికి సాయంగా తెచ్చుకొన్నారు.

మనకిప్పుడున్న స్వతంత్రత, స్వేచ్ఛ, నాగరికత యించుమించు బూటకమని కొన్ని దృష్టాంతాలను చూపారు. వర్ణాంతర వివాహాలు సఫలం కావాలంటే ఏ కులం వారైనా, ఏ జాతివారైనా, సమాన ప్రతిపత్తి ఉన్నవారితోనైతే వివాహాలు కొంత వరకైనా చక్కగా నడుస్తూయుంటారు. సమాన ప్రతిపత్తి పూర్తిగా లేకపోయినా అభ్యంతరంలేని సాలె, కుమ్మరి, గొల్ల వంటి కులాలవారితో కమ్మ, రెడ్డి, వెలమ, తెలగ తేర బలిజ కులాలవారు వివాహమాడవచ్చునని వీరు సూచిస్తున్నారు. ఇటువంటి సూచనను సంఘం ఎంతవరకామోదిస్తుందో వేచి చూడాలి.

రైతుల సాధక బాధకాలను 'గతిలేక వ్యవసాయం'అనే వ్యాసంలో తెలిపారు. కొంత ప్రకృతిలోపం, కొంత ప్రభుత్వలోపం, కొంత రైతులోపం, కొంత వ్యవసాయ కూలీల లోపం యివన్నీ కలిసి వ్యవసాయదారుల్ని క్రుంగదీస్తున్నాయి. వీటిలో వ్యవసాయ కూలీల విషయంలోమాత్రం వీరు రైతువలెగాక సంపన్న భూస్వామివలె ఆలోచించారు. వ్యవసాయ కూలీ పరిస్థితి ఎంత దుర్భరంగా ఉన్నదో పట్టించుకోకుండ "ఎంత హెచ్చుగా ఇస్తామన్నా ఇంకా హెచ్చు కోరుతారు. ఆశకంతుండవచ్చునేమోగాని దురాశకుండదు" అన్నారు. ఆడకూలీలు మగకూలీలతో సమానంగా కూలికావాలని అడగటాన్ని వీరు సహించలేరు. వంటచేసుకోవటానికి 'చట్లు, మూకుళ్లు' కావాలని అడగటం దురాశగా వీరికి కన్పిస్తున్నది. "చక్కగా శృంగారించుకొని తలలో పూలు తురుముకుని బైలుదేరుతారు. ఆ పువ్వు రాలకుండా, ఒళ్ళు అలవకుండా, చేసీ చేయనట్లు కోసి 4½ గంటలకే చేను విడిచిపెట్టి ఇంటిముఖమౌతారు"— ఈవిధంగా వ్రాయటం ఎంత ఘోరమో సహృదయులు ఆలోచించగలరు. కూలీలు తలలో పూలుపెట్టుకోవటాన్ని భరించలేని భూస్వాములు చేస్తున్న కష్టమేమున్నది? గట్లమీద కూర్చుని చలవబట్టలు నలగకుండ కూలీలను తిట్టూ, పని కాలేదని కేకలు పెట్టటమేగదా? ఎప్పుడైనా వాస్తవాన్ని ఒక పక్కనుండే చూడకూడదు. కష్ట జీవులను అవమాన పరచే వాక్యాలను వ్రాసి "మనసులోవున్నది దాచకుండా బైట బెడ్తాను" అనటంకాదు అది సబబోకాదో మరొక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవటం మంచిది.

'పొరపాటు–తప్పిదం' అనే వ్యాసంలో "మనస్సు, బుద్ధి, జ్ఞానం, ఆత్మ, లేనిదే శరీరం వట్టికట్టె. ప్రాణం ఉండినా ప్రాణమున్న కట్టెమాత్రమే. శరీరానికి మాలిన్యం, మనస్సు, బుద్ధిమీద ఆధారపడి యుంటుంది. వాని ప్రభావం లేనప్పుడు ఏ క్రియకాని, ప్రక్రియగాని, లైంగికంగాని శరీరానికంటవు పైగా స్త్రీ నెలనెలా పరిశుద్ధమౌతుంది. నూతన జీవిత అవుతుంది. పునర్జన్మ నొందుతుంది" అని చెప్పటం విపరీతంగానున్నది. శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్మనుమాట వీరు మరచినట్లుంది. స్త్రీ నెల నెలా పరిశుద్ధమైనంత మాత్రాన ఆలోచనలు, అనుభూతులు పరిశుద్ధ మౌతాయనుకోవటం ఘోరం. విడాకులు సర్వసాధారణమైన విదేశీ సంస్కారాన్ని మనసులో పెట్టుకుని 'లైంగికానికి' ప్రాధాన్య మివ్వనక్కరలేదనటం న్యాయం కాదు–విజ్ఞతకూడా కాదు.

ఉబుసుపోకకై రచయిత రచించిన యీ పుస్తకం చదవటం వలన కాలక్షేపాన్ని మించిన ప్రయోజన మేదీ సిద్ధించదు. ఈ విషయాన్ని రచయిత స్పష్టంగా ప్రస్తావనలో వెలడించారు.

— శ్రీ రామ మోహనరాయ్.

**Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor- S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.**